


www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50 విజయవాడ సిటీ*

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 351
పేజీలు: 8 + 4

ఆదివారం | 5-4-2020

శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 7.26 వరకు తదుపరి త్రయోదశి; నక్షత్రం: మఖ మ. 2.58 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 10.04-11.29; దుర్ముహూర్తం: సా. 4.48-5.37; అమృతఘడియలు: మ. 12.47-2.14; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.26

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore





## యువతకూ డేంజర్

వారికీ కరోనా వచ్చే ముప్పు

రోగుల్లో 83% మంది 50 ఏళ్లలోపువారే

కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడి

ప్రపంచవ్యాప్తంగానూ ఇదే పరిస్థితి

ఉందన్న డబ్ల్యూహెచ్‌వో

2



## మన కరోనా భిన్నమైనదే!

కానీ తీవ్రతలో తేడా లేదు

రెండు నెలల్లో స్వదేశీ టెస్ట్ కిట్‌లు

ఐసీఎంఆర్ శాస్త్రవేత్త గంగాఖేడ్గర్

8

## జాతి ఐక్యతకు జ్యోతినై..

కరోనాపై పోరుకు నేడు సంఘీభావం

రాత్రి 9గం.నుంచి 9నిమిషాల పాటు

దివ్వెలు వెలిగించే ముందు

## శానిటైజర్లు వాడొద్దు

ప్రజలను అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం

పరిస్థితి అదుపులోకి వస్తోంది

**10 రోజుల్లో కట్టడి చేయగలం!**

ఎక్కడ బయటపడ్డా యుద్ధ ప్రాతిపదికన చర్యలు

ప్రధానికి సాధికారిక బృందాల నివేదన 2



# లాక్ డౌన్.. మరో వారం

పొడిగించే అవకాశం.. మర్కజ్ లింకులే కారణం

**పునరాలోచనలో కేంద్ర ప్రభుత్వం**

**మూడు నాలుగు రోజులుగా పెరుగుతున్న మర్కజ్ కేసులు**

**మొత్తం కేసుల్లో 30% అవే**

**లాక్ డౌన్ కొనసాగిస్తేనే కట్టడి**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌ను పొడిగించనున్నారా!? ఏప్రిల్ 14వ తేదీ తర్వాత కూడా మరో వారం రోజులపాటు ఇది కొనసాగే అవకాశం ఉందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. లాక్ డౌన్ పొడిగింపు దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచనలు చేస్తోందని చెబుతున్నాయి. ఎవరూ ఊహించని విధంగా తెరపైకి వచ్చిన తబ్లీగీ జమాత్ ఘటనే ఇందుకు కారణమని వివరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న కరోనాను అరికట్టడమే ధ్యేయంగా మార్చి 22వ తేదీన జనతా కర్ఫ్యూ విధించిన ప్రధాని మోదీ.. ఆ తర్వాత 24వ తేదీ నుంచి లాక్ డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ ఈ లాక్ డౌన్ కొనసాగుతుందని కూడా ప్రకటించారు. దీనికి తోడు, జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నిలిపి వేశారు. ఫలితంగా లాక్ డౌన్ కారణంగా సానుకూల ఫలితాలూ వచ్చాయి. విదేశాల నుంచి వచ్చే వారి ద్వారా కరోనా సోకే కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. దాంతో, లాక్ డౌన్‌ను పటిష్ఠంగా అమలు చేస్తే, ఏప్రిల్ తొమ్మిదో తేదీ నాటికి కొత్త కేసులు తగ్గిపోతాయని, రెండో దశ ప్రారంభంలోనే కరోనాను నిలువరించినట్లు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అదే జరిగితే, ఏప్రిల్ 15వ తేదీన లాక్ డౌన్‌ను ఎత్తి వేయవచ్చని కూడా భావించింది. అయితే, అనూహ్యంగా ఢిల్లీలో మర్కజ్ ఘటన వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఏదో ఒకటి రెండు రాష్ట్రాలకు పరిమితం కాకుండా

మిగతా 8వ పేజీలో...

## ఇంట్లోనే కరోనా పరీక్ష

8

కిట్ విడుదల చేసిన బయోనీ

ఖరీదు 2 వేల రూపాయలు

కచ్చితత్వం 99 శాతం

దేశంలో కిట్ ఇదే తొలిసారి

# పిల్లలపైనా పంజా

## రాష్ట్రంలో కరోనా విస్తరణ.. 196 పాజిటివ్ కేసులు

తొలిసారి ముగ్గురు పిల్లలకు.. ఒకేరోజు 32 మందికి వైరస్

**తాజా పాజిటివ్ కేసుల్లో**

**11ఏళ్ల బాలుడు, 14, 17 ఏళ్ల బాలికలు**

**32లో ముగ్గురు తప్ప అందరికీ ఢిల్లీ లింక్**

**గుంటూరులో 10మందికి పాజిటివ్**

**ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి**

**కృష్ణాలో 9, కడప, ప్రకాశంలో 4 చొప్పున**

**కర్నూలులో ముగ్గురు, అనంతలో ఒకరికి**

**తెలంగాణ నుంచి వచ్చిన ఓ మహిళకూ**

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కరోనా భూతం రాష్ట్రాన్ని చుట్టుముట్టింది. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ 200కు చేరువైంది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఒక్కరోజే ఏకంగా 32 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటితో కలిపి ఏపీలో మొత్తం బాధితుల సంఖ్య 196కు పెరిగింది. తాజాగా గుంటూరులో పదిమందికి, కృష్ణాజిల్లాలో 9మందికి, కడప, ప్రకాశం జిల్లాల్లో నలుగురు చొప్పున, కర్నూలులో ముగ్గురికి, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఒకరికి చొప్పున వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. గుంటూరు జిల్లాలో శనివారం ఐదుగురు మహిళలు సహ పదిమంది కరోనా బారిన పడ్డారు. ఢిల్లీ వెళ్లి వచ్చిన కుటుంబీకుల ద్వారా ఈ మహిళలకు వ్యాధి సోకింది. పదిమందిలో గుంటూరు నగరానికి చెందినవారు ఏడుగురు ఉన్నారు. అందులో ఒకే కుటుంబానికి చెందినవారు ఐదుగురు. వీరంతా 35ఏళ్ల లోపువారే. 11ఏళ్ల బాలుడు, 14, 17ఏళ్ల

మిగతా 7వ పేజీలో...




తిరుపతిలో రెడ్‌జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో పోలీసుల పహరా

**మరో ఇద్దరు బలి!**

కృష్ణా జిల్లాలో 45 ఏళ్ల వ్యక్తి, అనంతలో 60 ఏళ్ల వృద్ధుడు!

కరోనా లక్షణాలతో ఇంకొకరి మృతి

## ఆదర్శంగా నిలుద్దాం



కరోనాపై ఐక్యంగా పోరాడి దేశానికే గొప్ప సందేశమిద్దాం

దురదృష్టవశాత్తు జరిగిన ఘటన

దీనిని ఒక మతానికి ఆపాదించొద్దు

బాధితుల పట్ల ఆప్యాయత చూపాలి

వైద్య, పోలీసు, పారిశుధ్య శాఖ సేవలు భేష్.. వారికి పూర్తి వేతనం

సీఎం జగన్ వీడియో సందేశం 7

వరల్డోమీటర్ ప్రకారం శనివారం రాత్రి 11:30 గంటలకు..

| ప్రభావిత దేశాలు | అమెరికా | ఇటలీ | చైనా | స్పెయిన్ | ఫ్రాన్స్ | ఇరాన్ | బ్రిటన్ | ఇండియా | ప్రపంచం | తెలంగాణ | ఏపీ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కొత్త కేసులు | 23,282 | 4,805 | 19 | 5,537 | 7,788 | 2,560 | 3,735 | 518 | 64,309 | 43 | 32 |
| మరణాలు | 8,156 | 15,362 | 3,326 | 11,744 | 7560 | 3,452 | 4313 | 86 | 63,893 | 11 | 3 |
| బాధితులు | 3,00,443 | 1,24,632 | 81,639 | 1,24,736 | 89,953 | 55,743 | 41,903 | 3,082 | 11,80,952 | 272 | 196 |



టెన్త్ పరీక్షలు మే రెండో వారంలో!

**లాక్‌డౌన్ ఎత్తేశాక షెడ్యూల్**

3

అది వాస్తవమే!

**మెడ్‌టెక్ నుంచి కొన్ని పరిశ్రమలు వెళ్లిపోయాయి**

**నేటి నుంచి కరోనా కిట్లు తయారీ: పూనం**

**రైళ్ల పునఃప్రారంభంపై**

తుది నిర్ణయం తీసుకోలేదు

**బోర్డు అనుమతిస్తేనే సేవలు**

**ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి గోయల్**

8

**గమనిక**
కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ నేపథ్యంలో ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధం అందించలేక పోవుచున్నాము
విడి ప్రతి వెల మామూలు రోజులు లాగానే రూ. 6.50 పై. ఉంటుంది.
మేనేజింగ్ డైరెక్టర్

***బయటికొస్తే అంతేమరి!***

కరోనా కట్టడికి లాక్‌డౌన్ అమలు చేస్తున్నా జనం గుంపులుగా బయటికి వస్తూనే ఉన్నారు. ఇలాంటి వారికి పశ్చిమ గోదావరి పోలీసులు వింత శిక్ష వేశారు. శనివారం మధ్యాహ్నం చింతలపూడిలో రోడ్లపై తిరుగుతున్న కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారితో చీపుళ్ల పట్టించి, రోడ్లు శుభ్రం చేయించారు. -చింతలపూడి





గుంటూరు జిల్లా నగరం మండలంలో లబ్ధిదారుకు వెయ్యి రూపాయలను ఇస్తున్న వైసీపీ ఎంపీపీ అభ్యర్థి శ్రీకృష్ణయ్య

మొన్నటికి మొన్న... ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే అవకాశమున్నా... రేషన్ సరుకుల కోసం ప్రజలను రోడ్డెక్కించారు. గంటలకొద్దీ క్యూల్లో నిలబెట్టించారు. అనేక చోట్ల భౌతిక దూరం పాటించలేని ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టేశారు!

ఇప్పుడు... నేరుగా ఖాతాల్లో జమ చేసే అవకాశమున్నప్పటికీ, ఇంటింటికీ వెళ్లి వెయ్యి రూపాయలు అందించారు. సర్కారు వారి సొమ్ముతో వైసీపీ నేతలు 'షో' చేశారు. అనేక చోట్ల స్థానిక ఎన్నికల బరిలో నిలిచిన వైసీపీ అభ్యర్థులే స్వయంగా వెయ్యి రూపాయలు పంచిపెట్టారు. ఈ ఘనకార్యం తమదే అన్నట్లుగా ఫొటోలు దిగారు.

# సర్కారు సొమ్ముతో షో

## కరోనా సాయానికీ రాజకీయ రంగు

**రాజకీయ ప్రహసనంగా రూ.వెయ్యి పంపిణీ**

**ప్రేక్షకుల్లా వలంటీర్లు.. పంచిన వైసీపీ నేతలు**

**'స్థానిక' ఎన్నికల అభ్యర్థుల హల్‌చల్**

**సొంత డబ్బులిచ్చినట్లు ఫొటోలకు పోజులు**

**తమకే ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం**

**రేషన్ సరుకులకేమో జనాన్ని రోడ్డెక్కించి... వెయ్యి పంపిణీ మాత్రం నేరుగా ఇంటింటికి!**

(అమరావతి, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కరోనా నేపథ్యంలో స్థానిక ఎన్నికల ప్రక్రియను వాయిదా వేసినప్పుడు వైసీపీ నేతలంతా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై విరుచుకుపడిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు అదే కరోనా సహాయాన్ని ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారు. పలుచోట్ల శానిటైజర్లు, నిత్యావసరాలు, ఇతర సహాయాన్ని వైసీపీ గుర్తు ముద్రించి ఇస్తున్న తతంగం చాలారోజులుగా

మిగతా 3వ పేజీలో...

వస్తున్నా అనేలోపే..

3

**వార్డు కార్యదర్శికి 10 పనులు**

**ఏది చేయాలో..ఏ ఆదేశాలను పాటించాలో తెలియక తికమక**

**విభాగాల తీరుతో సతమతం**

**సమన్వయ లేమితో తంటా**



బ్రూక్లిన్‌లోని ఆస్పత్రిలో రిఫ్రిజిరేటర్ ట్రక్కులోకి ఓ మృతదేహాన్ని తరలిస్తున్న వైద్యసిబ్బంది

# ఒక్కరోజే 1500 మృతులు

## అమెరికాపై మృత్యు మేఘాలు.. 2.70 లక్షలమందికి పాజిటివ్

**3 వేల మృతులకు 3 నిమిషాలు**

**నివాళి అర్పించిన చైనా జాతి**

**సిరియా,లిబియాకీ విస్తరణపై ఐక్యరాజ్యసమితి కలవరం**

**స్పెయిన్‌లో లాక్‌డౌన్ పొడిగింపు**

వాషింగ్టన్, ఏప్రిల్ 4 : కరోనా విలయం ప్రపంచాన్ని అంతకంతకూ విషాదంలోకి నెట్టివేస్తోంది. 'ఇప్పుడేముంది.. అసలు ముప్పు మునుముందు ఉంది' అంటూ అంతర్జాతీయ సంస్థలు చేస్తున్న హెచ్చరికలు మానవ జాతికి మరింతగా ప్రమాద ఘంటికలను పెంచుతున్నాయి. యూరప్ గడగడలాడిపోతుంటే, అమెరికాపై మృత్యుమేఘాలు అలుముకొన్నాయి. ఒక్కరోజే 1500 మంది అక్కడ చనిపోయారు. అందులో 560 మంది ఒక్క న్యూయార్క్ నగరంలోనే ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ దేశం మాస్కులు ధరించడాన్ని ప్రతి పౌరుడికీ తప్పనిసరి చేసింది. ఫ్లూతో బాధపడేవారు దగ్గినప్పుడు, తుమ్మినపుడు పరిసరాల్లో ఉంటే కరోనా సోకుతుందని

మిగతా 8వ పేజీలో...

## భారత్ @ 100

**దేశంలో పెరుగుతున్న మరణాలు** 8

**పాజిటివ్ కేసుల సంఖ్య 3,600కు..**

**ఒక్క రోజులోనే 600 వరకు పెరుగుదల**

**మహారాష్ట్రలోనే కొత్తగా 145 కేసులు**

**ఎంపీలో మహిళా ఐఏఎస్‌కు వైరస్**

**తెలంగాణలో మరో 43 మందికి**

**సామూహిక వ్యాప్తి నిరోధంపై దృష్టి**

'గొలుసు' తెంపేయడమే లక్ష్యం

హాట్‌స్పాట్స్ చుట్టూ కఠిన నిషేధాజ్ఞలు

211 జిల్లాలకు పాకిన వైరస్ 2

# ఓం అడగకుండా ఇవ్వడమే కరుణ..అదే అమ్మ



పరంజ్యోతి



అవతరణ అంటే దిగిరావడం, అభివ్యక్తం కావడం! ధర్మగ్లాని జరిగినప్పుడల్లా తనను తాను సృష్టించుకుని, ఆ తరాన్ని ఉద్ధరించి, తదనంతర తరాలను నడిపించడం అవతారమూర్తుల లక్ష్యం. కాల, కార్య, కారణ, కర్తవ్యాలకు లోబడే.. వారి సంచారం సాగుతుంటుంది. అవతారాలన్నీ ప్రభవాలే! అంశావతారాలుగా, కళావతారాలుగా, అర్చావతరాలుగా, ప్రవేశావతారాలుగా, అనుప్రవేశావతారాలుగా, ఆవేశావతారాలుగా, మరెన్నో రీతులుగా అవతారాలు రావటం కొత్తకాదు. ఇన్నిటికీ, ఏదో ఒక కారణం తప్పనిసరి. వీటన్నిటికీ భిన్నంగా అమ్మ రాక, ఒక ఆశ్చర్యం. ఆలోచనామృతం. సర్వ సృష్టికి, నానా దేవీదేవతా స్వరూపాలకు మూలమైన పరమేశ్వరి మానవిగా రావాలని సంకల్పించుకుంటే, అదే అమ్మ! అమ్మ సంచారాన్ని గమనించుకుని, అనుభవ రససిద్ధం చేసుకోగలిగితే, ఆమె ఆగమనం వెనుక దొరికే కారణం, సనాతన ధర్మమూలమే.

కర్మలను అనుభవించడం కోసం కాక, కష్టాలను విని, వాటిని అధిగమించే దారి చూపడమే జగజ్జనని తత్వంగా అర్థం చేసుకోవాలి. ఇది తల్లి లక్షణం. బిడ్డ రక్షణే ఆమెకుండే ఆతృత. కనబరచే తాపత్రయమంతా, తన కోసం కాక బిడ్డ సుఖశాంతుల గురించే!

ఎందరో మహాయోగుల కామన అంతా ప్రపంచ సుఖంగా ఉండాలనే. అలా సుఖంగా ఉంచగలిగిన శక్తి జగజ్జననికే ఉంటుంది కనుక, వారందరి ప్రార్థనల ఫలంగా ఈశ్వరి ఈ జగత్తులో ప్రవేశించి, సుఖదాయిగా, ఆనందదాయిగా, సర్వదాయిగా ఉంటుంది. జీవుణ్ని తడిమి, ఒడి చేర్చుకుని, లాలన, పాలన సాగించి జీవుడి దుఃఖాన్ని, భయాన్ని, బాధను తొలగించి, ఆత్మోన్ముఖుణ్ణి చేయడం తల్లి కర్తవ్యం. జీవుడియందున్న దానవత్వ, దీనత్వ, మానవత్వ, మాధవత్వ స్థితులను.. జీవుడికి తన దర్శన, స్పర్శన, సంభాషణ, అనుగ్రహ, వాత్సల్య, ప్రేమల ద్వారా స్ఫురణకు తెచ్చి, రాక్షస భావాలను నశింపచేసి, మానవ మాధవీయంగా తీర్చిదిద్దటం మాతృలక్ష్యం. పరమ చరమంగా తనయందు లయం చేసుకోవటం, అసలు పరమార్థం.

జీవుడు తనయందున్న పశులక్షణం చేత బాధను అనుభవిస్తాడు. పశువుకు బాధే ఉంటుంది. దుఖం తెలియదు. మానవుడే రెండిటినీ అనుభవిస్తాడు. మాతృభావన ఈ రెండింటినీ శమింపజేయగలదు. కనుక అమ్మ తన దగ్గరకు వచ్చిన వారికి బాధను, దుఖాన్ని తగ్గించి ధైర్యాన్నిచ్చింది. మార్గం చూపించడం, లక్ష్యం బోధించడం, గమ్యం చేర్చడం అవతార ప్రణాళికలో భాగం. తన నడకే మార్గమైనప్పుడు, ఆ మార్గం జీవకోటిని సముద్ధరించే బాధ్యతైనప్పుడు, అమ్మ నడిచిన బాటలో అడుగువేయడమే సాధన! మంత్రబలంతో తంత్రయంత్రాత్మక విధానంతో ఫలితాన్ని పొందడం అనుభవంలో ఉన్నదే. అయితే అమ్మ వీటన్నిటికీ అతీతంగా, ఉపాసనా ఫలాన్ని సూటిగా అందించి తల్లి తత్వాన్ని ప్రకటించింది. ఉపవాసం, ఉపాసన వంటివి ఏ ఫలితాన్ని కలిగిస్తాయో ఆ ఫలితాన్ని నిర్వ్యాజంగా జీవకోటికి వరదానం చేసింది. అడిగి పొందేవన్నీ వరాలే. అడగకుండా పొందేదే కరుణ. వరాలన్నీ కోరికల చుట్టూ తిరిగేవి. కరుణ, ఒక అంతర్వాహిని. "అమ్మా! ఇంకొంత కాలం మీరుంటే బాగుంటుంది" అని సద్గురు శివానందమూర్తిగారు కోరినపుడు, "రావటం, ఉండటం, పోవటం, ఈ దేహానికేగాని, నాకేముంది? ఇవేమీ లేని 'నేను' ఎప్పుడూ ఉంటుంది" అన్నది అమ్మ సమాధానం. మాతృపార్శ్వాన్ని ప్రపంచానికి రుచి చూపిన మమతామూర్తి అమ్మ!

**- వీఎస్ఆర్ మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త**

# 10 రోజుల్లో కట్టడి చేయగలం!

## పరిస్థితి అదుపులోకి వస్తోంది.. ఎక్కడ బయటపడ్డా యుద్ధ ప్రాతిపదికన చర్యలు

- ప్రధానికి సాధికారిక బృందాల నివేదన
- పీపీఈలు, మాస్కులకు కొరత రానివ్వొద్దు
- అధికారులకు మోదీ ఆదేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా వైరస్ అదుపులోనే ఉందని, తబ్లిగీ జమాత్ సమావేశాల వంటి ఒకట్రెండు అనుకోని పరిణామాలు జరిగినా పరిస్థితి చేయిదాటి పోలేదని ప్రధాని మోదీకి కేంద్ర సాధికారిక బృందాలు నివేదించాయి. శనివారం మోదీ ఈ బృందాల సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని స్వయంగా సమీక్షించారు. రానున్న 10 రోజుల్లో వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయగలమన్న నమ్మకాన్ని అధికారులు వ్యక్తం చేశారు. దేశంలో ఏమూల వైరస్ సమాచారం లభించినా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని చెప్పినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. మాస్కులు, గ్లోవ్స్, వ్యక్తిగత రక్షణ ఉపకరణాలు (పీపీఈ), వెంటిలేటర్లు, అత్యవసర మందులు.. మొదలైనవన్నీ దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రులు, ఐసోలేషన్ కేంద్రాల్లో సిద్ధంగా ఉండేట్లు చూడాలని ప్రధాని ఆదేశించారు. సరిపడకపోతే వాటి ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులు, క్వారంటైన్ సెంటర్లు, ఐసీయూలు, ఐసోలేషన్ కేంద్రాల్లో పరిస్థితి, కొత్తగా ఎన్ని అవసర మవుతాయి, వాటిలో యుద్ధ ప్రాతిపదికన ఏమేం ఏర్పాటు చేయాలి.. మొదలైన వాటిపై ఆయన సమీక్షించారు. వ్యాధి విస్తరణపై నిఘా, సోకినవారికి అందుతున్న సాయం, పరీక్షలు, క్రిటికల్ కేర్ ట్రైనింగ్ మొదలైనవన్నీ నిరంతరం ఎలాంటి ఇబ్బందీ లేకుండా సాగాలన్నారు. కోవిడ్-19కు సంబంధించి విపత్తు యాజమాన్య చట్టం క్రింద కలిసికట్టుగా చర్యలు తీసుకునేందుకు ప్రధాని ఈ నెల 29న 11 కీలక సాధికారిక బృందాలను ఏర్పాటు చేశారు. సకాలంలో అమలు చేయడానికి ప్రణాళికలను రూపొందించి తగిన చర్యలు తీసుకునే అధికారాన్ని వీటికి కల్పించారు. లాక్‌డౌన్ సమయంలో చర్యలతో పాటు ఎత్తేశాక కూడా ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాకుండా అన్నీ సమృద్ధిగా ఉండేట్లు చూడడం వీటి లక్ష్యం. కాగా, కీలక వైద్య ఉపకరణాల ఎగుమతిపై కేంద్రం నియంత్రణ విధించింది. డయాగ్నొస్టిక్ కిట్స్, ప్రయోగశాలల్లో వాడే సామాగ్రిని ఎగుమతి చేయడానికి వీల్లేదని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ తెలిపింది.

### 8న ప్రధాని అఖిలపక్ష సమావేశం

ఈనెల 8వ తేదీ ఉదయం 11గంటలకు మోదీ అన్ని పార్టీల పార్లమెంటరీ విభాగాల నేతలతో సమావేశమై కొవిడ్-19 కట్టడికి తీసుకుంటున్న చర్యలు వివరిస్తారు. వారి సలహాలు, సూచనలు తీసుకుంటారు. 'ఐదుగురు సభ్యులున్న ప్రతీపార్టీ నేతను ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలుస్తారు. లాక్‌డౌన్ తర్వాత ఆయన విపక్ష నేతలను కలవడం ఇదే ప్రథమం' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తెలిపారు.

### కరోనాపై ట్రంప్-మోదీ చర్చ

కరోనావైరస్ కట్టడికి రెండు దేశాలూ పూర్తి శక్తిని వినియోగిద్దామని భారత్, అమెరికా అంగీకారానికి వచ్చాయి. కరోనా వ్యాప్తిని అడ్డుకునే చర్యలపై ట్రంప్, మోదీ శనివారం ఫోన్‌లో చర్చించారు. 'అన్ని అంశాలనూ విస్తృతంగా చర్చించాం. ఇండో అమెరికా భాగస్వామ్యపు పూర్తి బలాన్ని వాడుకోవాలని నిర్ణయించాం' అని మోదీ ట్వీట్ చేశారు. వైద్య సామగ్రి కోసం ప్రపంచ దేశాల సాయాన్ని అమెరికా కోరుతోంది. కాగా, బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోతోనూ మోదీ ఫోన్‌లో మాట్లాడారు. కరోనాపై రెండు దేశాలు కలిసి పోరాడాలని ఇరువురు అంగీకారానికి వచ్చారు.

### దీపాలు వెలిగించండి

**వాజ్‌పేయి కవితను షేర్ చేసిన మోదీ**

ఆదివారం రాత్రి 9 గంటలకు విద్యుత్ లైట్లు ఆర్పి చమురు లేదా కొవ్వొత్తి దీపాలు వెలింగించండని మోదీ మరోమారు దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్విటర్ ద్వారా విజ్ఞాపనచేసిన ఆయన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గతంలో ఓ సభలో చదివిన కవితను షేర్ చేశారు. 'రండి.. దీపాన్ని వెలిగించండి' అని ఉన్న ఆ కవితలో పంక్తిని మోదీ ప్రస్తావించారు. ఆవో ఫిర్ సే దియా జలాయేం... అన్నది వాజ్‌పేయి కవితా పంక్తి..



లాక్‌డౌన్ నేపథ్యంలో డ్రోన్ సాయంతో ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో పహారా కాస్తున్న పోలీసులు

# 22 వేల మందికి తబ్లీగీ కరోనాతో లింక్!

- వారందరికీ పరీక్షలు చేస్తున్నాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశవ్యాప్తంగా తబ్లీగీ జమాత్ సమావేశానికి హాజరైన వారు, వారిని కలిసిన వారు కలిపి మొత్తం 22 వేల మంది కరోనా వైరస్ అనుమానితులు ఉన్నారని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. రాష్ట్రాలతో సమన్వయం చేసుకొని వారందర్నీ పట్టుకొని, కరోనా పరీక్షలు చేస్తున్నామని వెల్లడించింది. వారిలో ఇప్పటివరకు 1023 మందికి పాజిటివ్ వచ్చినట్లుగా ఆరోగ్య శాఖ తెలిపింది. వీరంతా 17 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నట్లు చెప్పింది. మొత్తం పాజిటివ్ కేసులు 2902 కాగా, అందులో తబ్లీగీ జమాత్ వాటాయే 30% ఉన్నట్లు వెల్లడించింది. హోంశాఖ సంయుక్త కార్యదర్శి పూనియా సలీలా శ్రీవాస్తవ, ఆర్యోగశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ మీడియాతో మాట్లాడారు. విపత్తు నిర్వహణనిధి కింద రాష్ట్రాలకు రూ. 11,092 కోట్లు విడుదల చేశామని, వలస కార్మికుల సహాయక చర్యలకు వాడాలని సూచించారు. యూపీలోని బరేలీలో గల షహదనావాలీ దర్గా నుంచి 200మందిని పోలీసులు క్వారంటైన్‌కు తరలించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన వీరంతా మానసిక వైద్యం కోసం దర్గాకు వస్తుంటారు. వారిని స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాటు చేయాలని గత నెల 23నే స్థానిక పోలీసులకు విజ్ఞప్తి చేశానని, వారు పట్టించుకోలేదని దర్గా ముతవల్లీ చెప్పారు. రాజస్థాన్‌లోని 5 జిల్లాల్లో 5 కరోనా కేసులు కొత్తగా నమోదయ్యాయి. ఐదుగురూ ఢిల్లీకి వచ్చిన వారే. యూపీలోని ముజఫర్‌నగర్‌లో పోలీసులపై దాడికి ఉసిగొల్పిన వ్యక్తి జాడ చెప్పిన వారికి రూ.25 వేలు ఇస్తామని పోలీసులు తెలిపారు.

# యువతకూ రక్షణ లేదు

- వారికీ కరోనా ముప్పు... కేంద్ర ఆరోగ్యశాఖ, డబ్ల్యూహెచ్‌వో

హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): యువతా జరభద్రం!! కరోనా ఇన్ఫెక్షన్ల ట్రెండ్ మారుతోంది. వృద్ధులు, వివిధవ్యాధులతో బాధపడుతున్న వారికే కొవిడ్-19 ముప్పు ఎక్కువనే వాదనను తలకిందులు చేసే దిశగా కేసులు నమోదవుతున్నాయి. దేశంలో కరోనా బారినపడుతున్న వారిలో 83% మంది 50 ఏళ్లలోపువారేనని కేంద్ర ఆరోగ్యశాఖ శనివారం వెల్లడించింది. భారత్‌లో నమోదవుతున్న కరోనా పాజిటివ్ కేసుల్లో 41.88% మంది 21-40 ఏళ్ల వారేనని తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో 41-60 ఏళ్లవారు(32.82%), 60 ఏళ్లకు పైబడినవారు(16.69%), 20 ఏళ్లలోపువారు(8.61%) ఉన్నట్లు తెలిపింది. ఈ గణాంకాలకు బలాన్ని చేకూర్చేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఎమర్జెన్సీ ప్రోగ్రామ్స్ కార్యనిర్వాహక డైరెక్టర్ మైక్ ర్యాన్ జెనీవాలో ఓ ప్రకటన చేశారు. వివిధ దేశాల్లో 30, 40, 50 ఏళ్లవారు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకుండానే ఆస్పత్రుల్లో చేరి కరోనాతో మృతి చెందుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. బ్రిటన్‌లో 13 ఏళ్ల బాలుడు, 21ఏళ్ల మహిళ కరోనాతో మృతి చెందిన ఘటనలను ర్యాన్ గుర్తుచేశారు. గత 6 వారాల్లో ఇటలీలోని ఆస్పత్రుల ఐసీయూల్లో కరోనాతో చేరినవారిలో 15%మంది 50 ఏళ్లలోపు వారేనని తెలిపారు. దక్షిణ కొరియాలో కొవిడ్-19తో మృతిచెందుతున్న ప్రతీ ఆరుగురిలో ఒకరు 60 ఏళ్లలోపు వారేనన్నారు. ఈ పరిస్థితుల్లో యువత అప్రమత్తతతో వ్యవహరించాలని, నిర్లక్ష్యంగాఉంటే పరిస్థితి చేయిదాటే అవకాశాలున్నాయని హెచ్చరించారు.

# సామూహిక వ్యాప్తి నిరోధంపై దృష్టి

## 'గొలుసు' తెంపేయడమే లక్ష్యం

- హాట్‌స్పాట్స్ చుట్టూ కఠిన నిషేధాజ్ఞలు
- విస్తృతంగా పరీక్షలు, క్వారంటైన్, ఐసొలేషన్
- ఇంటింటి సర్వే, శాంపిల్స్ పరీక్షలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: కొవిడ్-19 వైరస్ వ్యాప్తి కారకంగా ఉన్నాయని భావిస్తున్న సమూహ ప్రాంతాలపై కేంద్రం ఫోకస్ చేసింది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో వైరస్ లక్షణాలున్నవారిని గుర్తించి, స్వీయ-నిర్బంధంలోకి లేక ఏకాంతవాసానికి పంపి.. వైరస్ గొలుసుకట్టును తెంపడం ఈ సమూహ-నిరోధక వ్యూహం(క్లస్టర్ కంటైన్‌మెంట్ స్ట్రాటజీ) ఉద్దేశం. దీనికి సంబంధించి కేంద్రం శనివారం ఓ వ్యూహ పత్రాన్ని విడుదల చేసింది. దీని ప్రకారం.. దేశంలో వైరస్ 211 జిల్లాలకు వ్యాపించింది. ఇది మరిన్నిజిల్లాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయి. "ప్రస్తుత లోకల్ ట్రాన్స్‌మిషన్ స్థాయి క్రమేణా సమూహ వ్యాప్తికి దారితీయొచ్చు. ప్రయాణాలు లేదా ఒక చోట గుమిగూడడం.. ఇలా రకరకాల మార్గాల ద్వారా ప్రజాసమూహానికి వ్యాపించొచ్చు. దీన్ని అడ్డుకోవడానికి తొలుత చేయాల్సినది భౌగోళిక స్వీయ నిర్బంధం (జగ్రాఫిక్ క్వారంటైన్). ఇది జరగాలంటే లోకల్ ట్రాన్స్‌మిషన్ ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు, ప్రయాణాలు, బయటకు రావడం.. అన్నీ నిలిచిపోవాలి. సరళంగా చెప్పాలంటే ఆ ఏరియాలను దిగ్బంధం చేసి ఓ అడ్డు (గోడ) కట్టేయాలి. పెద్ద సంఖ్యలో కేసులు బయటపడుతున్న ప్రాంతాలు, హాట్‌స్పాట్లు.. అన్ని చోట్లా ఈ భౌగోళిక క్వారంటైన్‌ను కచ్చితంగా అమలు చేయాలి. వాటి చోట్ల పకడ్బందీ నిషేధాజ్ఞలు అమలు చేయాలి" అని ప్రభుత్వ వ్యూహపత్రం పేర్కొంది. "ఈ క్లస్టర్ నిరోధక వ్యూహంలో భౌగోళిక క్వారంటైన్ మాత్రమే కాదు.. ప్రజలు భౌతిక దూరం తప్పనిసరిగా పాటించాలి. నిరంతర నిఘా, అనుమానాస్పద కేసులపై తక్షణ పరీక్షలు, స్వీయ-నిర్బంధం, ఐసోలేషన్‌కు పంపడం, ఆ వ్యక్తులతో రాసుకుపూసుకు తిరిగినవారు, వారు కాంటాక్ట్‌లోకొచ్చిన వారిని క్వారంటైన్ చేయడం, ప్రజలను చైతన్యవంతం చేయడం, వారిలో అవగాహన పెంచి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేలా చేయడం.. ఇవన్నీ చేయాలి" అని ఆ పత్రం వివరించింది. ప్రస్తుత భౌగోళిక విస్తృతి గతంలో స్వైన్ ఫ్లూ వచ్చినప్పటి తరహాలోనే ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ అభిప్రాయపడింది.

### ఈ చర్యలు చేపట్టాలి

(1) క్లస్టర్ పరిమాణాన్ని బట్టి భౌగోళిక క్వారంటైన్ అమలు చేయాలి. (2) ఆప్రాంతాల్లోని ఉష్ణోగ్రత, తేమ మొదలైనవి వైరస్ వ్యాప్తిలో ప్రభావం చూపుతాయి. వీటిని పరిగణనలోకి తీసుకోవాలి. (3)కేసుల గుర్తింపు, పరీక్షలు, ఐసోలేషన్ మొదలైనవి వేగంగా జరగాలి (4) ఎవరి నుంచి ఎవరికి వ్యాపిస్తున్నదీ విస్తృతంగా శోధించాలి (5) హై రిస్క్ కేసులను, వారు నివసించిన పరిసరాలను మరింత జాగ్రత్తగా చేపట్టాలి (6) అనుమానముంటే ఐసోలేషన్ వార్డులకు పంపాలి (7) ముఖ్యమైనది భౌతిక దూరం పాటించడం. ఈ సర్వే కోసం నర్సులు, వైద్య సిబ్బంది, మలేరియాపై నిఘా పెట్టిన అనుభవం ఉన్నవారు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, మరీ అవసరమైతే నర్సింగ్ కాలేజీ విద్యార్థులను నియోగించాలి.

### క్లస్టర్ వ్యూహం.. తీరూ తెన్నూ!

- ముగ్గురు కొవిడ్-19 పాజిటివ్ పేషెంట్లు ఒకే చోట ఉంటే.. ఆ ప్రాంతాలను సమూహ వ్యాప్తి నిరోధక ప్రాంతాలుగా ఎంపిక చేసుకోవాలి.
- ఒక్కో పేషెంటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను క్వారంటైన్ చేసెయ్యాలి.
- రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల దాకా వైద్య బృందాలు ఆ ప్రాంతంలో ఇల్లిల్లూ తిరగాలి.
- జ్వరం, దగ్గు, శ్వాసకోశ సమస్య ఉన్నట్లు కనిపించిన వారి శాంపిల్స్ తీసుకోవాలి. కేసును బట్టి క్వారంటైన్, ఐసోలేషన్‌కు పంపాలి.
- శ్వాసకోశ సమస్య ఉంటే ఆసుపత్రికి పంపాలి.
- ఇది నిరంతరం 14 రోజుల పాటు నిర్వహించాలి. పేషెంట్ల జాబితా తయారుచేయాలి.
- వ్యాధి వ్యాపకుల గుర్తింపు తప్పనిసరి.
- ప్రజల్లో చైతన్యం పెంపొందించాలి.

# కొడుకును చంపి.. తల్లి ఆత్మహత్య

- మనవరాళ్ల ప్రాణాలు కాపాడేందుకే!
- నెల్లూరు జిల్లా గంగవరంలో ఘటన

కోవూరు, ఏప్రిల్ 4: ఆస్తి కోసం తండ్రిని, కక్షతో బామ్మర్దిని, భార్య తాతనూ హతమార్చాడు. చివరకు భార్యను, కన్నబిడ్డలనూ హత్య చేసేందుకు పలు మార్లు ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో మనవరాళ్ల ప్రాణాలు కాపాడేందుకు కన్నకొడుకునే హతమార్చిందా తల్లి. అనంతరం తానూ ఆత్మహత్య చేసుకుంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం గంగవరంలో జరిగిన ఈ ఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనసూయమ్మల కొడుకు గోపాల్‌రెడ్డికి ముగ్గురు కూతుళ్లు. భార్యను నిత్యం వేధిస్తుండడంతో పిల్లలను తీసుకుని ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఇరు కుటుంబాల మధ్య వివాదాలు తలెత్తడంతో భార్య తమ్ముడిని హత్య చేసి జైలుకెళ్లాడు. విడుదలైన తరువాత ఆస్తి కోసం తండ్రినే హతమార్చాడు. కొన్నాళ్లకు భార్య తాత శ్రీనివాసులురెడ్డిని కూడా విషమిచ్చి హత్య చేశాడు. నెల్లూరులోని ఓ అపార్టుమెంటులో నివసిస్తున్న భార్య, కూతుళ్లను కూడా హత్యచేసేందుకు పలుమార్లు విఫలయత్నం చేశాడు. ఈ క్రమంలోనే శ్రీరామనవమి రోజు (ఈనెల 2న) ఇద్దరు కూతుళ్లను గోపాల్‌రెడ్డి తన ఇంటికి పిలిపించాడు. వారిని హతమార్చేందుకే పిలిపించాడని అనుమానించిన అనసూయమ్మ గోపాల్‌రెడ్డికి శీతలపానీయంలో పొటాషియం సైనైడ్ కలిపి ఇచ్చి, తానూ తాగి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో విషయం పోలీసులకు తెలిసింది.

# డీమార్ట్ అధినేత 155 కోట్ల విరాళం

- పీఎం కేర్స్ ఫండ్‌కు రూ. 100 కోట్లు
- తెలుగు రాష్ట్రాలకు చెరో రూ. 5 కోట్లు
- అదానీ గ్రూప్ రూ. 100 కోట్లు విరాళం
- రూ. 35 కోట్లు ఇచ్చిన సీకే బిర్లా గ్రూప్
- నెస్లే ఇండియా రూ. 15 కోట్లు
- సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ 5.65 కోట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: కరోనా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలకు మద్దతుగా డీ మార్ట్ అధినేత రాధాకృష్ణన్ దమానీ రూ. 155 కోట్ల విరాళం ప్రకటించారు. వీటిలో రూ. 100 కోట్లు పీఎం కేర్స్ ఫండ్‌కు అందజేశారు. మిగతా రూ. 55 కోట్లను 11 రాష్ట్రాలకు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో తెలంగాణకు రూ. 5 కోట్లు, ఏపీకి రూ. 5 కోట్లు ఇవ్వనున్నారు. అదానీ గ్రూప్ రూ. 100 కోట్ల విరాళం పీఎం కేర్స్ ఫండ్‌కు అందజేస్తామని ప్రకటించించిచచచచిచచచచింది. సేవా కార్యక్రమాల కోసం మరో రూ. 4 కోట్లు ఇస్తామని, తమ సంస్థ ఉద్యోగులు మరో రూ. 4 కోట్లు ఇవ్వనున్నారని చైర్మన్ గౌతమ్ అదానీ చెప్పారు. సీకే బిర్లా గ్రూప్ రూ. 35 కోట్ల విరాళం ప్రకటించింది. రూ. 25 కోట్లను పీఎం కేర్స్ ఫండ్‌కు, మిగతా రూ. 10 కోట్లు వైద్య పరికరాలు, మాస్కులు, పీపీఈలు కొనడానికి రాష్ట్రాలకు అందజేస్తామని పేర్కొంది. సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ పీఎం కేర్స్ ఫండ్‌కు రూ. 5.65 కోట్లు విరాళం ఇచ్చింది. నెస్లే ఇండియా రూ. 15 కోట్ల విరాళం ప్రకటించింది. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ రూ. 5 కోట్ల విరాళం ఇచ్చింది.

### సత్యసాయి ట్రస్టు విరాళం 10కోట్లు

అమరావతి/అనంతపురం/విశాఖపట్నం: కరోనాపై పోరుకు భగవాన్ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు రూ.10కోట్ల విరాళం ప్రకటించింది. పీఎం కేర్స్ ఫండ్‌కు రూ.5కోట్లు అందజేయనున్నట్లు పేర్కొంది. శనివారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌కు రూ.5కోట్ల చెక్కును ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అందజేశారు. అనంతపురం జిల్లాలోని 14 క్వారంటైన్ కేంద్రాల్లో వైద్యపరికరాల నిమిత్తం రూ.1.80కోట్లు ఇదివరకే ఇచ్చినట్లు సీఎంకు చెప్పారు. ఈ సందర్భంగా రత్నాకర్‌ను జగన్ అభినందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏపీ మెడికల్ కౌన్సిల్ రూ.కోటి విరాళం అందజేసింది. పెన్నా సిమెంట్స్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి రూ.2కోట్ల చెక్‌ను సీఎంకు అందజేశారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల 3రోజుల వేతనం రూ.1.15కోట్లను అసోసియేషన్ ప్రతినిధులు విరాళంగా అందజేశారు. బీజేపీ నాయకుడు కంభంపాటి హరిబాబు రూ.20.44 లక్షలు ప్రధాన మంత్రి సహాయ నిధికి పంపించారు. ఆయన మిత్రులు, వ్యాపారవేత్తలు ఎం.ఇంద్రకుమార్(అవంతి ఫీడ్స్), గిరీశ్ దీక్షిత్ (ఇసాయి ఫార్మా), టి.వలసరాజ్ (కోస్టల్ కార్పొరేషన్), జి.మురళీకృష్ణ (ఫ్లూయెంట్ గ్రిడ్) తదితరుల నుంచి సేకరించిన రూ.3.26కోట్లు పీఎం కేర్స్ ఫండ్‌కు జమ చేసినట్టు బీజేపీ నేత మేడపాటి రవీంద్ర తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు రూ.లక్ష చెక్ పంపించారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

### క్వారంటైన్ కేంద్రంగా షారూక్ భార్య ఆఫీసు

తన భార్య గౌరీకి ముంబైలో ఉన్న నాలుగు అంతస్థుల వ్యక్తిగత కార్యాలయాన్ని క్వారంటైన్ కేంద్రంగా వాడుకోవాలని బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్ సూచించారు. దీనిపై బీఎంసీ ట్విటర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపింది. షారూక్ ఖాన్ ఇంతకు ముందే పీఎం కేర్స్ ఫండ్, మహారాష్ట్ర సీఎం సహాయనిధి, ఎర్త్ ఫౌండేషన్, రోటీ ఫౌండేషన్‌లకు విరాళం ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆయన మహారాష్ట్ర, బెంగాల్‌లో హెల్త్‌కేర్ వర్కర్లకు 50 వేల పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్(పీపీఈ) కిట్లను అందజేస్తామన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ముంబైలోని 5,500 కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్నారు.

### నయనతార విరాళం 20లక్షలు



లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సినీ కార్మికులకు నయనతార సాయం చేశారు. దక్షిణాది చలన చిత్ర కార్మికుల సమాఖ్య (ఫెఫ్సీ)కి రూ.20 లక్షల విరాళం అందజేశారు. రాజశేఖర్ కుమార్తెలు శివానీ, శివాత్మిక చెరో రూ.లక్ష ఇచ్చారు. దక్షిణాది రచయితల సంఘం తరపున రూ.లక్ష ఇవ్వనున్నట్టు కె.భాగ్యరాజా తెలిపారు.

## లోకం తీరు




### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 35.2 | 24.2 |
| విశాఖపట్నం | 35.4 | 25.0 |
| గుంటూరు | 35.6 | 35.6 |
| నెల్లూరు | 36.0 | 25.5 |
| విజయవాడ | 37.2 | 24.2 |
| కడప | 41.0 | 23.0 |

### చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అధిక పీడనం ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్తర కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. శనివారం అనంతపురంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



### ప్రజలను చీకటి సొరంగంలో ఎందుకు ఉంచుతారు?

కరెంటు వెలిగించే అవకాశం ఉన్నప్పుడు ప్రజలను చీకటి సొరంగంలో ఎందుకు ఉంచాలనుకుంటున్నారు. లైట్లన్నీ ఆర్పేస్తే ఎలక్ట్రిక్ గ్రిడ్ కుప్పకూలుతుంది. అసలు విద్యుత్తు లేకుండా వెలుగు ఎలా వస్తుంది? లిఫ్ట్ ఎలా పని చేస్తుంది?

**- శశిథరూర్, కాంగ్రెస్ సీనియర్ నేత**



### ముందు మీ హృదయంలో వెలుగు నింపండి

శశిథరూర్ గారూ.. ప్రజలంతా ఆశలు నిండిన కాంతితో సొరంగాన్ని అధిగమించేందుకు ఐక్యంగా ప్రయత్నిస్తున్నారు. ఈ తరుణంలో మీ ఆరోపణ, ప్రధాని ప్రయత్నాలకు వక్రీకరణ అర్థం లేనివి. మీరు ప్రశాంతంగా ఉండండి. ముందు మీ హృదయంలో వెలుగు నింపండి. లిఫ్ట్ గురించి ఆలోచించకండి.

**- అద్నాన్ సమీ, ప్రముఖ గాయకుడు**



### ఊపిరితిత్తుల వ్యాధులకు వాడే ఔషధంతో 'కరోనా' చికిత్స

టొరంటో, ఏప్రిల్ 4: కరోనా ఇన్ఫెక్షన్‌తో తీవ్రంగా ప్రభావితమవుతున్నది రోగుల శ్వాసకోశ వ్యవస్థే. ఈ పరిస్థితుల్లో ఊపిరితిత్తుల వ్యాధుల కట్టడికి అభివృద్ధి చేస్తున్న 'ఏపీఎన్01' అనే ఔషధాన్ని కొవిడ్-19కు విరుగుడుగా వాడొచ్చని కెనడాలోని బ్రిటీష్ కొలంబియా వర్సిటీ, స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం చెబుతోంది. కరోనా ఇన్ఫెక్షన్‌ను తొలి దశలోనే అడ్డుకట్ట వేసేంత ప్రభావవంతంగా ఏపీఎన్01 పనిచేస్తుందని ప్రాథమిక ప్రయోగ పరీక్షల్లో గుర్తించామని వెల్లడించారు. దీనికి శరీరంలోని కణాలు, శ్వాసకోశ వ్యవస్థ, ఇతర అవయవాలు సానుకూలంగానే స్పందిస్తున్నాయన్నారు. ఈ ఔషధాన్ని ఆస్ట్రియా దేశానికి చెందిన 'ఎపీరియాన్ బయాలజిక్స్' అభివృద్ధిచేసింది. త్వరలో ఏపీఎన్01తో చైనాలోని కరోనా రోగులపై పరీక్షలు నిర్వహించనుంది.

### త్వరగా యవ్వనంలోకి అడుగుమోపే బాలురకు మధుమేహం ముప్పు

లండన్, ఏప్రిల్ 4: కొందరు బాలురు చిన్న వయసులోనే యువకుల్లా కనిపిస్తుంటారు. శరీరంలోని వివిధ గ్రంథులు, మెదడులో మార్పుల వల్లే ఇలా జరుగుతుంది. జన్యుకారణాలతోనూ ఇలా జరిగే అవకాశాలున్నాయి. కానీ, ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనే బాలురకు వయసు పెరిగే కొద్దీ టైప్-2 మధుమేహం ముప్పు ఉంటుందని స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. వారి రక్తంలోని చక్కెర మోతాదులో భారీ హెచ్చుతగ్గులు చోటుచేసుకొని మధుమేహానికి దారితీస్తుందన్నారు.



**వటపత్రశాయిగా కోదండరాముడు**

ఒంటిమిట్ట, ఏప్రిల్ 4: ఏకశిలా నగరి ఒంటిమిట్టలోని కోదండ రామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు శనివారం ఉదయం కోదండరామస్వామి వటపత్రశాయి అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చి వేద మంత్రోచ్చారణల మధ్య హారతులిచ్చారు.



**తిరుమలలో నేటి నుంచి వసంతోత్సవాలు**

తిరుమల, ఏప్రిల్ 5: తిరుమలలో ఆదివారం నుంచి సాలకట్ల వసంతోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయితే, కరోనా కారణంగా ఈసారి ఈ ఉత్సవాలను ఆలయంలోని కల్యాణ మండపంలో నిరాడంబరంగా నిర్వహించనున్నారు. ఏటా చైత్రశుద్ధ త్రయోదశికి మొదలై పౌర్ణమికి ముగిసేలా మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు మధ్యాహ్న సమయంలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి ఆలయంలోని కళ్యాణ మండపంలో అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. తొలి రెండు రోజులు మలయప్పస్వామి, దేవేరులు మాత్రమే వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజున మూడు యుగాలను గుర్తుచేస్తూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి, సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామికి ఏకకాలంలో అభిషేకం నిర్వహిస్తారు. దాంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. కాగా.. వసంతోత్సవాల్లో భాగంగా రెండోరోజు నిర్వహించే రథోత్సవాన్ని కూడా టీటీడీ రద్దు చేసింది. దానికి బదులుగా సర్వభూపాల వాహనంలో ఉత్సవర్లను కొలువుదీర్చి మండపంలోనే విశేష సమర్పణ నిర్వహించేలా నిర్ణయించారు.

# వస్తున్నా అనేలోపే..

## ఒక వార్డు కార్యదర్శికి 10 పనులు

- ఏది చేయాలో..ఎవరి ఆదేశాలను పాటించాలనేది తెలియక తికమక
- పలు విభాగాల తీరుతో సతమతం
- కొరవడిన సమన్వయంతో తంటా

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అతనో వార్డు కార్యదర్శి. రేషన్‌షాపుల దగ్గర లబ్ధిదారులకు బదులుగా వేలిముద్ర వేసే పని ఆయనకు అప్పగించారు. ఇంతలోనే పోలీసు శాఖ నుంచి ఫోన్. ఫలానా పోలీస్ స్టేషన్‌కు వచ్చేయండి, అక్కడ పని ఉంది అని. ఆ కాసేపట్లోనే మరో ఫోన్. ప్రభుత్వం ఇస్తున్న వెయ్యి రూపాయలు పంచాలి, ఫలానా చోటకు వెళ్లండని. "అది కాదు సార్! నాకు రేషన్ డ్యూటీ వేశారు. ఉదయం లేచేసరికే రేషన్ దుకాణాల ముందు పదుల సంఖ్యలో జనం ఉంటున్నారు. అక్కడికెళ్లకుంటే ఇబ్బందిపడతారు" అని సదరు వార్డు కార్యదర్శి చెప్పే ప్రయత్నం చేశారు. "అవేమీ మాకు తెలీదు. మేం చెప్పినట్లు చేయాల్సిందే".. ఫోన్లు చేసిన ప్రతి శాఖ అధికారిదీ ఇదే హుకుం. ఏం చేయాలి, ఎవరి ఆదేశాలు పాటించాలి, ఏ పనికి హాజరవ్వాలనేది గ్రామ కార్యదర్శులు, వార్డు కార్యదర్శులకు ఎదురవుతున్న ప్రశ్న! పై స్థాయిలో సమన్వయం లేకుండా...వాళ్లు ఒకరికొకరు మాట్లాడకుండా కింద ఉన్న వారికి ఆదేశిస్తుండటమే దీనికి కారణం. అలాగే, గ్రామ కార్యదర్శులు, వార్డు కార్యదర్శుల్లో ఏ విధుల్లో ఉన్నవారు ఏ విభాగం నియంత్రణలోకి వస్తారన్న విషయంలో స్పష్టత లేకపోవడమూ వారి కష్టాలను పెంచుతోంది. ఈ నేపథ్యంలో ఎవరో ఒకరి ఆదేశాలే పాటిస్తే...మరొకరి ఆగ్రహానికి గురవ్వాల్సి వస్తుందని సిబ్బంది వణికిపోతున్నారు. "మాకేమైనా శిక్షణ సమయంలో మాయలు, మంత్రాలు నేర్పించారా? లేకుంటే సినిమాలోలా ఒకే సమయంలో రెండు, మూడు చోట్ల ఉండే విద్య మాకేమైనా ఉందా?" అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

### రావాలంటే.. రవాణా ఉండొద్దా?

సచివాలయాల్లో పోలీసు బాధ్యతల్లో నియమితులైన మహిళలకు హఠాత్తుగా ఫోన్లు చేసి... ఎక్కడో 25 కిలోమీటర్ల అవతల ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లండంటూ ఆదేశాలు వస్తున్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఏ వాహనం లేని మహిళలు అక్కడికెళ్లేందుకు నానా రకాల ఇబ్బందులు పడాల్సి వస్తోందని సమాచారం. "రవాణా సదుపాయం లేదు. సొంత బైక్ లేదు. ఎలా అంటే...అవన్నీ తెలియదు...తక్షణం రావాల్సిందే అంటున్నారు" అని వారిలో కొందరు వాపోతున్నారు. పై స్థాయి నుంచి ఒకేసారి వస్తున్న విభిన్న శాఖల ఆదేశాలు, ఎలా చేయాలని అడిగితే...చేయాల్సిందే అంటూ ఎదురవుతున్న కరకు సమాధానాలతో దిక్కుతోచని పరిస్థితుల్లో కార్యదర్శులు పడిపోతున్నారు. తమ శాఖ పని అయిపోతే చాలుననే ఉద్దేశంతో...ఏ శాఖకు చెందినవారు ఆ శాఖ పనులను చెప్పేస్తున్నారు. అయితే ఈ చెప్పిన పనులు చేయాల్సిన వాళ్లు మాత్రం అసలే పని చేయాలో తెలియక జుట్టుపీక్కుంటున్నారు. ఉన్నతస్థాయిలో దీనిపై చర్చించి వీరిపై నియంత్రణ, పర్యవేక్షణ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటిస్తే తప్ప ఈ గందరగోళానికి ముగింపు ఉండదని గ్రామ సచివాలయ వర్గాలే అంటున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీరికి శానిటైజర్లు, మాస్కులు కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. నిత్యం వందలమందితో కలవాల్సిన అనివార్య పరిస్థితుల్లో ఉన్న తమకు ఆరోగ్య రక్షణ లేదనే భయాందోళనలు కూడా వారిలో వ్యక్తమవుతున్నాయి.

## రేషన్ షాపుల వికేంద్రీకరణ

- లబ్ధిదారుల భౌతిక దూరానికి ప్రాధాన్యం
- ఒక్కో షాపునకు 3 అదనపు కేంద్రాలు
- ఈ నెల 15 నుంచి అమలుకు చర్యలు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో లబ్ధిదారులు భౌతిక దూరం పాటించేలా ప్రజా పంపిణీ వ్యవస్థలో రైతుబజార్ల తరహాలో రేషన్ షాపులను వికేంద్రీకరించాలని పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. ఒక్కో షాపునకు మూడు అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఈ నెల 15న జరిగే రెండో విడత పంపిణీలో ఈ విధానం అమలు చేయనుంది. ఈ మేరకు దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లను పౌరసరఫరాలశాఖ ఆదేశించింది. ప్రస్తుత రేషన్ పంపిణీలో లబ్ధిదారులకు స్లిప్పులు పంపిణీ చేసినా ఒక్కసారిగా షాపులకు పోటెత్తుతున్నారు. దీంతో దుకాణాల వద్ద రద్దీ నియంత్రణ, భౌతికదూరం పాటించడం కష్టంగా మారాయి. ఈ విషయాన్ని గమనించిన అధికారులు వచ్చేసారి పంపిణీలో ఈ సమస్య లేకుండా వికేంద్రీకరణకు శ్రీకారం చుడుతున్నారు. ముందురోజే ఏ సమయంలో ఏ కార్డుదారులు రావాలో స్లిప్పులు పంపిణీ చేస్తారు. అందరికీ ఒకే స్లిప్పులు ఇస్తే క్రమపద్ధతి లేకుండా ఒకేచోటకు వచ్చే ప్రమాదం ఉందని భావించి నాలుగు కేంద్రాలకు వేర్వేరు రంగుల్లో స్లిప్పులు పంపిణీ చేసి, ఆ రంగు స్లిప్పులకు పంపిణీ చేసే షాపునకు మాత్రమే వెళ్లాలనే నిబంధన పెడుతున్నారు. పోర్టబులిటీతో ఇబ్బంది లేకుండా తొలి మూడు రోజుల తర్వాతే వారికి రేషన్ పంపిణీ చేయాలని నిర్ణయించారు. అదనపు కేంద్రాలను సమీపంలోని పాఠశాలలు, కమ్యూనిటీహాళ్లు, ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేయనున్నారు. వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్ల ద్వారా బయోమెట్రిక్ తీసుకుంటారు. దీంతో పౌరసరఫరాల పంపిణీలోనూ కరోనా ముందస్తు చర్యలు సఫలీకృతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

## అనుమతించి.. ఆంక్షలు!

- పట్టణాల్లో మాంసం, చేపల షాపులు తెరవొద్దంటూ హెచ్చరికలు
- లాక్‌డౌన్ నుంచి సడలింపు ఉన్నా క్షేత్రస్థాయి అధికారుల అత్యుత్సాహం

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా కేంద్రం అమలు చేస్తున్న లాక్‌డౌన్ సమయంలో నిత్యావసర వస్తువుల దుకాణాల నిర్వహణపై వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించింది. ఉన్నతాధికారుల ఆదేశాలను క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. చికెన్, మటన్, చేపలు, రొయ్యలను నిత్యావసరాలుగా ప్రకటించినా, వాటి అమ్మకాలపై క్షేత్రస్థాయి అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో లాక్‌డౌన్ సడలింపు సమయంలోనూ అమ్ముకోలేక వ్యాపారులు నష్టపోతున్నారు. పౌల్ట్రీ, ఆక్వా ఉత్పత్తులను నిత్యావసరాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లాక్‌డౌన్ సమయంలో రైతులు నష్టపోకుండా పండ్లు, కూరగాయలతో పాటు రొయ్యలు, చేపల రవాణాకు, చికెన్, మటన్ విక్రయాలకు సడలింపు ఇస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రులు సైతం ప్రకటించారు. కానీ కరోనా కేసులు ప్రబలాయన్న ఉద్దేశంతో ఈ ఆదివారం నుంచి ఏలూరులో చికెన్, మటన్ షాపులు తెరవొద్దంటూ మున్సిపల్ అధికారులు స్థానికంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ దుకాణాల వద్దకు కొనుగోలుదారులు గుంపులుగా రావడమే ఇందుకు కారణమని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఇలా వస్తున్న వారిని నియంత్రించాల్సిందిపోయి... చికెన్, చేపలు, మటన్ వ్యాపారులు నష్టపోయేలా క్షేత్రస్థాయి అధికారులు అత్యుత్సాహంతో ఆ దుకాణాలను మూయించడంపై విమర్శలు వస్తున్నాయి.

### కోత కోస్తే కేసే!

మరోవైపు గ్రామాల్లో పోలీసులు సైతం ఇదే ధోరణితో వ్యవహరిస్తున్నారు. రైతులు నష్టపోకూడదని, తగు జాగ్రత్తలతో పంటపొలాల్లో పనులు చేయించుకోవచ్చని, ఈ విషయంలో పోలీసులు అడ్డుకోవద్దని స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన ఆదేశాలను పోలీసులు బేఖాతరు చేస్తున్నారు. మిరప కోతలకు వెళ్లే కూలీలపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇకపై పొలం వెళ్తే కేసులు తప్పవంటూ గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూలీలకు ఫోన్లు చేసి మరీ హెచ్చరిస్తున్నారు. దీంతో కూలీలు కోతలకు దూరం కాగా, పంటను ఇంటికి ఎలా చేర్చుకోవాలో తెలియక రైతులు వాపోతున్నారు. మిరప పంటకు ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుంది. అంతపెట్టి ఇప్పుడు పంటను ఇంటికి తెచ్చుకోలేకపోతే ఎంత నష్టం భరించాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కరోనా కల్లోలం

## మీరిచ్చినవి పేదలకు చేరట్లేదు

- ధరల అదుపులోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- కేంద్రానికి తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ సమయంలో పేదలను ఆదుకోడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి ఏపీలో పేదలకు అందడం లేదని కేంద్రానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. పేదలకు నిత్యావసరాలు సరిగా అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు శనివారం లేఖ రాశారు. 'లాక్‌డౌన్ వల్ల పేదలు, రోజువారీ కూలీలు అవస్థలు పడకుండా చూడటానికి బియ్యం, పప్పు, ఒక గ్యాస్ సిలిండర్ ఉచితంగా ఇవ్వాలని కేంద్రం తీసుకొన్న నిర్ణయం అభినందనీయం. కానీ, కేంద్రం ప్రకటించిన సరుకుల్లో ఇప్పటివరకూ రాష్ట్రంలో ఒక్కరికి కూడా ఉచితంగా వాటిని ఇచ్చిన దాఖలాలు లేవు' అని ఆ లేఖలో పేర్కొన్నారు. అసంఘటిత కార్మికులు బాగా అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటని, ఇటీవల ఇసుక కొరతతో 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడగా, ఇప్పుడు లాక్‌డౌన్ కారణంగా వారు మళ్లీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, రెండు వారాల కిందట కంటే ధరలు విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొన్నారు. పింఛన్లలోనూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేరుతో వలంటీర్లు కోత పెడుతున్నారని, రేషన్ కింద ఇవ్వాల్సిన బియ్యం, పప్పుల్లోనూ కోత విధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్యాకేజీ రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ అందేలా చూడాలని కళా విజ్ఞప్తి చేశారు.

## టెన్త్ పరీక్షలు మే రెండోవారం నుంచి?

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మే నెల రెండో వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ పరీక్షల కొత్త షెడ్యూల్ లాక్‌డౌన్ ఎత్తి వేసిన తర్వాత ప్రకటించనున్నారు. కరోనా వైరస్ (కోవిండ్-19) వ్యాప్తి నిరోధక చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 14 వరకు లాక్‌డౌన్ కొనసాగనున్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న తరుణంలో లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తివేత సాధ్యమా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

## ఏపీ జాలర్లకు ఆహారం అందించాం

- చంద్రబాబు లేఖపై స్పందించిన మహారాష్ట్ర సీఎం

ముంబై, ఏప్రిల్ 4: లాక్‌డౌన్ వల్ల మహారాష్ట్రలో చిక్కుకుపోయిన 60 మంది ఏపీ జాలర్లను గుర్తించామని, వారికి ఆహారం సరఫరా చేశామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. వారిని ఆదుకోవాలంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖకు గంటల వ్యవధిలోనే ఆయన స్పందించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆ జాలర్లను ఆదుకోవాలంటూ మహారాష్ట్ర సీఎంకు, కేంద్ర హోంశాఖ కార్యదర్శికి వేర్వేరుగా చంద్రబాబు శుక్రవారం లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఆ జాలర్లు ముంబై తీరంలోని మాధ్ దీవిలో ఎక్కడ చిక్కుకుపోయారో జిల్లా కలెక్టర్ గుర్తించారని, ఆహారం సరఫరా చేశారని మహారాష్ట్ర సీఎం కార్యాలయం శనివారం ట్వీట్ చేసింది. 'షెల్టర్ విషయంలో వారికి ఏ విధమైన ఇబ్బందీ లేదు. అయితే, ఆహారమే కొరత. వారికి ఆహారం సరఫరా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశాం. వారు ఆ దీవిలో ఉన్నంతకాలం ఆహారాన్ని అందజేస్తుంటామని మీకు హామీ ఇస్తున్నాం' అని మహారాష్ట్ర సీఎంవో పేర్కొంది.

## పరిశ్రమలను బతికించండి: ఆంధ్రా చాంబర్స్

విజయవాడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక, వ్యాపార రంగాలు ఎదుర్కొంటున్న కష్టాలను సమీక్షించడానికి రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ మాదిరిగా.. జిల్లా స్థాయిలోనూ ఆర్థిక టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌కు ఆంధ్రా చాంబర్స్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఏపీ చాంబర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీఎస్ ప్రకాశ్‌రావు, పొట్లూరి భాస్కర్‌రావు శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. కరోనా నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసిందని సీఎంకు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నట్టు వివరించారు. తయారీ రంగంతో పాటు అనేక రంగాలకు తీవ్ర అంతరాయం కలిగిందని తెలిపారు. పారిశ్రామిక రంగాల యూనిట్లను ఎక్కువ భాగం మూసివేయాల్సి వచ్చిందని, ఇలాంటి సమయంలో పారిశ్రామిక రంగంతోపాటు పలు రంగాలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన మద్దతు కోరుతున్నట్టు తెలిపారు.

## రాజకీయాలు వీడి సాయం చేయండి: శైలజానాథ్

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చప్పట్లు కొడదాం, దీపాలు వెలిగిద్దామంటూ రాజకీయాలు చేయకుండా.. వైద్యులకు రక్షణ పరికరాలు.. పేదలకు సాయమందించేందుకు వీలుగా రూ.25000 కోట్ల ప్యాకేజీని తక్షణమే ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీని పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కోరారు. ఈ మేరకు ఆయన ప్రధానికి శనివారం లేఖ రాశాను. దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రాలకు చేయూత అందించేందుకు తక్షణమే రూ.25000 కోట్ల ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశానికి ప్రపంచ బ్యాంకు ఇచ్చిన నిధులు రూ.7500 కోట్లతో పాటు.. ప్రధాని సహాయ నిధికి వస్తోన్న విరాళాలను కలిపి రాష్ట్రాలకు తక్షణమే ప్యాకేజీని ప్రకటించాలని లేఖలో ప్రధానిని శైలజానాథ్ కోరారు.

## కరోనాపై పోరులో సహకరిస్తాం: సీపీఎం మధు

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. శనివారం ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఇటీవల కరోనా నివారణ చర్యల కోసం స్వచ్ఛంద సేవా కార్యకర్తల సహకారం కోరుతూ ప్రకటించారని దీన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో కరోనా నివారణకు స్వచ్ఛంద సేవకు ముందుకొచ్చిన వారి జాబితా తమ పార్టీ సిద్ధం చేసిందని మధు చెప్పారు.

## సాయాన్నీ రాజకీయం చేస్తున్నారు: సీపీఐ రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): "కరోనా విపత్తు సహాయార్థం ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సాయాన్ని వైసీపీ అభ్యర్థుల చేత పంపిణీ చేయించడం తగదు. కరోనా సాయాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వైసీపీ వాడుకోవడం దారుణం" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

# అది వాస్తవమే!

- మెడ్‌టెక్ నుంచి పరిశ్రమలు వెళ్లిపోవడంపై పూనం
- నేటి నుంచి కరోనా పరీక్షల కిట్లు తయారీ

విజయవాడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్ నుంచి కొన్ని పరిశ్రమలు తరలివెళ్లిపోయిన మాట వాస్తవమేనని పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య పరోక్షంగా అంగీకరించారు. దీని వెనుక స్వార్థపూరిత శక్తులు ఉన్నాయని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఎంటీజెడ్‌లో వెంటిలేటర్లు, కరోనా పరీక్షల కిట్ల తయారీని వివరించేందుకు శనివారం విజయవాడలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. కేంద్ర ఆరోగ్యశాఖ హెచ్‌ఎల్‌ఎల్ ద్వారా వెంటిలేటర్లు, కరోనా పరీక్షల కిట్ల కోసం ఆర్డర్లు ఇస్తోందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలు వెంటిలేటర్లు, కరోనా పరీక్షల కిట్ల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. దీంతో ఈ రెండింటినీ తయారు చేసే అవకాశం ఎంటీజెడ్‌కు వచ్చిందని ఆమె వివరించారు. ఎంటీజెడ్‌లో ఆదివారం నుంచే కరోనా పరీక్షల కిట్లు తయారీ పనులు ప్రారంభమవుతాయని, పదో తేదీ నుంచి వెంటిలేటర్లు, కిట్లు మార్కెట్లోకి వస్తాయని తెలిపారు. ఇతర దేశాల నుంచీ వెంటిలేటర్ల కోసం ఆర్డర్లు వచ్చాయని చెప్పారు. ఎంటీజెడ్‌ను కేంద్రం ప్రశంసించిందని, దీనిని నేషనల్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా తయారు చేయాలని సీఎంకు లేఖ కూడా రాసిందన్నారు.

### ప్రభుత్వ షాపులో మద్యం మాయం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్4: లాక్‌డౌన్ అక్రమార్కులకు కలిసొచ్చింది. గుంటూరు జిల్లా నరసరావుపేట పట్టణంలోని ప్రభుత్వ షాపులో మద్యం నిల్వలను గుట్టుచప్పుడు కాకుండా చోరీచేశారు. ఈ ఘటన గత నెల 26వ తేదీన జరిగినా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వినుకొండ రోడ్డు బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ మద్యం దుకాణంలో సుమారు రూ.4,63,070 మేరకు విలువైన వివిధ కంపెనీలకు చెందిన 4,230 మద్యం సీసాలను కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వీరారెడ్డి ఘటనాస్థలిని పరిశీలించారు. పక్కనే ఉన్న డార్మెటరీకి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

### కాంట్రాక్టర్లపైనే జగన్‌కు ప్రేమ: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): "మీ ఇంటికొస్తే ఏం ఇస్తారు? మా ఇంటికొస్తూ ఏం తెస్తారు? అనే రకం సీఎం జగన్మోహన్‌రెడ్డి. ఆయనకు కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమ... ప్రజలు, రైతులు, వైద్యులు, ఉద్యోగులపై లేకపోవడం బాధాకరం" అని టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది కంటే రూ.30 వేల కోట్లు అధిక ఆదాయం ఉన్నా అన్నింటిలోనూ కోతలు పెడుతున్నారని విమర్శించారు. మరి కాంట్రాక్టర్లపై కురిపించిన రూ.6,400 కోట్లు ఆకాశం నుంచి ఊడిపడ్డాయా? అని ప్రశ్నించారు. కరోనా నేపథ్యంలో కేంద్రం చేస్తున్న సాయం తాను చేస్తున్నట్లు బిల్డప్ ఇవ్వడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాయం ఏమీలేదని విమర్శించారు.

### జగన్ పబ్లిసిటీ పిచ్చి రోత పుట్టిస్తోంది:టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం, పాలకుల తీరుపై తెలుగుదేశం నేతలు దుమ్మెత్తిపోస్తున్నారు. "జగన్‌కి పబ్లిసిటీ పిచ్చ పబ్లిసిటీకే రోతపుట్టేలా ఉంటుంది. చిన్న పిల్లల ముడ్డికి తప్ప... అన్నింటికీ వైసీపీ రంగులు వేయించిన జగన్, విజయసాయిరెడ్డి.. చంద్రబాబు పబ్లిసిటీ గురించి మాట్లాడడం విచిత్రంగా ఉంది" అంటూ టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్విటర్ వేదికగా ఎద్దేవా చేశారు. భౌతిక దూరం పాటించేలా అవగాహన కల్పించాల్సిన అధికార పార్టీ నేతలే లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించారని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ఆరోపించారు. ఈ సంక్లిష్ట కాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ఒక్కొక్కరికీ రూ.50 లక్షల విలువైన ఆరోగ్య బీమా కల్పించాలని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### కరోనాపై కంటితుడుపు: యనమల

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకుల ఉదాసీనత వల్లే రోజు రోజుకు కరోనా ఉధృతి పెరుగుతుందని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. గత ఏడాది రూ.2,27,975కోట్ల బడ్జెట్‌లో ఎంత ఖర్చుపెట్టారని ప్రశ్నించారు. తొలి ఆరు నెలల్లో బడ్జెట్‌లో 35శాతం కూడా ఖర్చుచేయలేదన్నారు. ఇంకా 65శాతం నిధులు మీ వద్దే ఉంటే ఉద్యోగుల జీతాల్లో కోతలు ఎందుకని నిలదీశారు. కరోనా నిరోధానికి నిధులు ఎందుకివ్వరని, డాక్టర్లు, సిబ్బందికి మాస్కులు ఎందుకు కొనరని యనమల ప్రశ్నించారు.

# పోరు ఆగదు!

**109వ రోజు కొనసాగిన రాజధాని రైతుల ఆందోళన**

- మార్మోగిన అమరావతి నినాదం
- ఎమ్మెల్యే పర్యటనపై ఫైర్



నిరసనలు తెలుపుతున్న పెదపరిమి మహిళలు

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజధానిగా అమరావతిని ప్రకటించే వరకు తమ పోరు ఆగదని రైతులు, రైతు కూలీలు, మహిళలు నినదించారు. "బతుక్కి భద్రత లేనప్పుడు ఊళ్లో ఉన్నా జైల్లో ఉన్నా ఒకటే.. ఎన్ని ఆంక్షలైనా పెట్టుకోండి. ఊపిరి ఉన్నంత వరకు అమరావతి కోసం పోరు ఆపేది లేదు" అని స్పష్టం చేశారు. రాజధాని కోసం రైతులు చేస్తున్న ఉద్యమం శనివారానికి 109వ రోజుకు చేరింది. నీరుకొండ, పెదపరిమి, రాయపూడి దీక్షా శిబిరాల్లో రైతులు భౌతికదూరం పాటిస్తూ మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతవరం, నెక్కల్లు, వెలగపూడి, మందడం, అబ్బురాజు పాలెం, వెంకటపాలెం, కృష్ణాయపాలెం తదితరాల గ్రామాల్లో మహిళలు ఇళ్ల వద్దే నిరసన వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యేను కలవనివ్వని పోలీసులు

రాజధాని కోసం భూములిచ్చి 109 రోజులుగా రోడ్డున పడి గగ్గోలు పెడుతుంటే కనీసం తొంగి చూడని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి నేడు ఎందుకు వచ్చారని తుళ్లూరు రైతులు ప్రశ్నించారు. కరోనా నియంత్రణలో భాగంగా ఆశావర్కర్లు, పారిశుధ్య కార్మికులకు శనివారం ఎమ్మెల్యే నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ దశలో ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం ఇస్తామని స్థానిక సీఐ శ్రీహరిని దళిత జేఏసీ నేత బసవయ్య అభ్యర్థించారు. అయితే, ఆయన అనుమతి నిరాకరించారు. దీంతో దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీదేవి ఓ ప్రజాప్రతినిధి ఇచ్చిన విందుకు హాజరయ్యారన్న ఆరోపణలు ఉన్నాయని, అలాంటి సమయంలో ఎటువంటి పరీక్షలు చేయించుకోకుండా తుళ్లూరు ఎలా వస్తారని నాయకులు ప్రశ్నించారు. ఆమె పర్యటనతో తుళ్లూరు గ్రామం పోలీసు వలయంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి అమరావతి ఆశాకిరణంగా నిలుస్తుందంటూ రాజధాని రైతులు 'అమరావతి వెలుగు' కార్యక్రమాన్ని శనివారం కొనసాగించారు. రాత్రి 7.30 నుంచి 7.35 వరకు ఇళ్లలో విద్యుత్‌ను నిలిపివేసి కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేపట్టారు.

# సర్కారు సొమ్ముతో 'షో'

(మొదటి పేజీ తరువాయి)

నడుస్తోంది. స్థానిక ఎన్నికల బరిలో నిలిచిన వారు... కరోనా సహాయం పేరిట ఇంటింటికీ తిరుగుతూ గుట్టుచప్పుడు కాకుండా ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు... ఏకంగా ప్రభుత్వం అందిస్తున్న వెయ్యి రూపాయలను కూడా తమ 'సొంత ఖాతా'లోకి వేసుకుంటున్నారు.

### 'ఆన్‌లైన్' అవకాశమున్నా...

శనివారం బియ్యం కార్డుదారులకు రూ.వెయ్యి పంపిణీ ప్రక్రియ చేపట్టారు. కరోనా కాలంలో వీలైనంత వరకు ప్రజలను రోడ్లపైకి రావాల్సిన అవసరం లేకుండా చూడాలి. నగదును ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల ఖాతాలో వేసే అవకాశముంది. అయినా వలంటీర్లను రంగంలోకి దించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలు, మంత్రులు 'లాంఛనంగా' ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బట్వాడాకు ఎమ్మెల్యేలు పోటీ పడ్డారు. ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి కూడా నగదు పంపిణీ ప్రారంభానికి వెళ్లారు.

### రాజకీయ సందడి...

కడపలో డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఇంటింటికీ వెళ్లి వెయ్యి అందించారు. ఆయన వెంట కార్యకర్తలు, అధికారులు గుంపులు గుంపులుగా నడిచారు. కమలాపురంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి గ్రామసభ తరహాలో భేటీ ఏర్పాటు చేసి ప్రభుత్వ సహాయం అందించారు. ప్రొద్దుటూరు 13వ వార్డులో వైసీపీ నేతలే రూ.వెయ్యి పంపిణీ చేసి... స్థానిక ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. అనంతపురం జిల్లాలో వెయ్యి రూపాయల పంపిణీలో అధికార పార్టీ నేతలు 'చక్కటి సమన్వయం' ప్రదర్శించారు. స్థానిక ఎన్నికల బరిలో నిలిచిన వారంతా ఎక్కడికక్కడ వలంటీర్లతో సహా ఇంటింటికీ తిరిగారు. వలంటీర్ నామమాత్రంగా పక్కన నిలబడగా... అభ్యర్థులే రూ.వెయ్యిని కార్డుదారు చేతిలో పెట్టి, ఎన్నికలో తమకే ఓటు వేయాలని అభ్యర్థించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం తెల్లవారగానే... వలంటీర్లకంటే ముందుగా వైసీపీ 'స్థానిక' అభ్యర్థులు వీధుల్లోకి వచ్చారు. 'వెయ్యి ఇస్తున్నది మేమే' అనేలా కలరింగ్ ఇచ్చారు. టీడీపీతోపాటు ఇతర పార్టీల నుంచి ఎలాంటి ప్రతిఘటన లేకపోవడంతో స్వేచ్ఛగా సర్కారు సొమ్ముతో సొంత సోకు చేసుకున్నారు. అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురంలో మాత్రం టీడీపీ ఫిర్యాదు మేరకు అధికారులు వైసీపీ నేతలను నిలువరించారు. గుంటూరు జిల్లా నగరం మండలం ఎంపీపీ వైసీపీ అభ్యర్థి చింతల శ్రీకృష్ణయ్యతోపాటు రేపల్లె మునిసిపాలిటీలోని కౌన్సిలర్ అభ్యర్థులు కూడా చక్కగా వెయ్యి రూపాయలు పంచి పెట్టారు. విశాఖలోనూ ఈ తంతు సాగింది. 29వ వార్డులో లబ్ధిదారులకు వీఎంఆర్డీయే చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ పంచిపెట్టారు.



అమరాపురంలో రూ. 1000 పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అభ్యర్థి

### రేషన్ అలా... నగదు ఇలా!

రేషన్‌తోపాటు ప్రభుత్వ పథకాలన్నింటినీ నేరుగా ఇంటి గుమ్మం ముందుకు చేర్చేందుకే వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. ఇది అపూర్వం, అద్భుతం అని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. కానీ... కీలకమైన కరోనా సమయంలో మాత్రం వలంటీర్ల సేవలను ఉపయోగించుకోలేదు. ప్రజలనే రోడ్లపైకి రప్పించారు. 'వలంటీర్లు ఇంటింటికీ వెళితే కరోనా వ్యాపించే ప్రమాదముంది' అని ఒక మంత్రి కూడా పేర్కొన్నారు. కానీ... వెయ్యి సహాయం పంపిణీ విషయానికొచ్చే సరికి అవన్నీ మరిచిపోయారు. ఇంటింటికీ తిరిగి డబ్బులిచ్చే బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు. చివరికి... ఈ కార్యక్రమాన్ని వైసీపీ నేతలు 'హైజాక్' చేసేసి, రాజకీయ ప్రచారానికి వాడుకున్నారు. అందులోనూ... గుంపులు గుంపులుగా వెళ్లి, కొన్ని చోట్ల మాస్కులు కూడా వేసుకోకుండా జనంలో కలియదిరిగారు.

## 71% కార్డుదారులకు పంపిణీ

- యాప్ పనిచేయక వలంటీర్లకు కష్టాలు.. కార్డుదారుల నిరసన

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ నేపథ్యంలో తెల్ల రేషన్ కార్డుదారులకు రూ.వెయ్యి పంపిణీని ప్రభుత్వం శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. సాంకేతిక సమస్యలతో తొలిరోజు సుమారు 71.74 శాతం మందికి మాత్రమే అందించారు. రాష్ట్రంలో 1.33 కోట్ల బియ్యం కార్డులున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు 95,44,224 మందికి నగదు పంపిణీ చేశారు. మిగిలినవారికి ఆదివారం పంపిణీ చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఈ ఇన్సెంటివ్‌ను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెన్షన్ తరహాలోనే బయోమెట్రిక్ విధానంలో కాకుండా జియోట్యాగింగ్ ద్వారా పంపిణీ చేశారు. మొదట వలంటీర్లకు ఇచ్చిన యాప్ మొరాయించడంతో ఉదయాన్నే పంపిణీ ప్రారంభించలేకపోయారు. వలంటీర్లు సచివాలయాల్లో సిబ్బందిని వాకబు చేసినా పరిష్కారం దొరకలేదు. దీంతో వెంటనే వేరే యాప్‌ను పంపించి దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. కొన్ని చోట్ల నెట్‌వర్క్ సరిగా లేకపోవడం వల్ల చెల్లింపులు కన్ఫర్మ్ కాక వలంటీర్లు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుల స్థానంలో బియ్యంకార్డులు, ఫీజురీయింబర్స్‌మెంట్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని ఇటీవల నిర్ణయించిన నేపథ్యంలో బియ్యం కార్డు మంజూరైన కుటుంబాలకు మాత్రమే రూ.వెయ్యి ఇన్సెంటివ్‌ను అందజేసింది. దీంతో పలుచోట్ల లబ్ధిదారుల నుంచి వలంటీర్లు నిరసనను ఎదుర్కోవాల్సి వచ్చింది. తెల్లరేషన్‌కార్డు ఉన్నా తమకు నగదు ఎందుకివ్వరని వలంటీర్లను పలువురు నిలదీశారు. దీంతో వలంటీర్లు సమాధానం చెప్పలేకపోయారు. రాష్ట్రంలోని 1.47 కోట్ల తెల్లరేషన్‌కార్డుల్లో 1.33 కోట్ల కుటుంబాలకే ప్రభుత్వం బియ్యంకార్డులు మంజూరు చేసింది. దీంతో సుమారు 14 లక్షల కుటుంబాలకు ఇన్సెంటివ్ దక్కలేదు. కొన్ని జిల్లాల్లో వైసీపీ నేతలు కరోనా ఇన్సెంటివ్ పంపిణీనీ రాజకీయ ప్రచారంగా వాడుకున్నారు. గ్రామాల్లో వలంటీర్లతో కలిసి లబ్ధిదారుల వద్దకు వెళ్లి పంపిణీలో చేతులు కలిపారు. వలంటీర్లలో ఎక్కువ మంది వైసీపీ కేడర్‌కు చెందిన వారు కావడంతో వారికి అడ్డు చెప్పే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల లబ్ధిదారులు అభ్యంతరం చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారు.

## కరోన శతకం

ఒక్క సూక్ష్మజీవి ఊహనులో పుట్టి
విశ్వమంత నేడు విస్తరించి,
మరణశాసనాలు విరచించుచుండెను
నేటి నిజము వినర!సాటి మనిషి!

చాలు చాలు బాబు! ఆలింగ నాలింక
చేయి కలుపవద్దు చెంత జేరి
అఖిలజనుల కెప్పుడభివాదమే లెస్స
నేటి నిజము వినర!సాటి మనిషి!

కుల మతాలు విడిచి కలిమిలేములు మర్చి
ఏకమాయె నిపుడు లోకమంత
సూక్ష్మజీవి తెచ్చె సోషలిజమ్మును
నేటి నిజము వినర!సాటిమనిషి!

పత్రికంటుకున్న ప్రబలు కరోనంటు
వ్యాప్తిచేయు గాలివార్తలెన్నొ
వెర్రి ముదిరినట్టి విజ్ఞాన హంతకుల్
నేటి నిజము వినర! సాటి మనిషి!

చావుతొ నిరతమ్ము సహవాసమును జేసి
ధీరుడై కరోన పోరు చేయు
సాటిలేని వేల్పు సర్కారు వైద్యుడే
నేటి నిజము వినర!సాటిమనిషి!

బ్రతుకు పరుగులోన భార్యబిడ్డలతోడ
మాటలాడ లేదు మనసు విప్పి
జనత కర్ఫ్యూతెచ్చె ఎనలేని ముచ్చట్లు
నేటి మాట వినర!సాటిమనిషి!

వలస కూలి జనుల వలపోత గమనించి
కడుపు నింప వలెను కరుణ తోడ
మానవత్వసిరులు మహినిండ పండాలి
నేటి నిజము వినర!సాటిమనిషి

సరుకు దాచిపెట్టి కరువును సృష్టించి
డబ్బుగుంజు, పిదప డాబు సరిగ
వెల్లువాయె నిపుడు నల్ల బజారులు
నేటి నిజము వినర!సాటి మనిషి!

జ్వరము, దగ్గు, జలుబు దరిచేరినంతనే
చావు మూడెననుచు సణుగుచుంద్రు
భయమె ముప్పుతెచ్చు వైరస్సుకంటేను
నేటి నిజము వినర!సాటి మనిషి

కీడు చేయునట్టి, క్రిమి తోడ పోరాడి
మురికినంత కడుగు, ముందు కురికి
కార్మికుల ఋణమ్ము కడతేర దెపుడైన
నేటి నిజము వినర!సాటిమనిషి!

**– కోటేశు**

# అతిగా భయపడుతున్నామా?



నవీన సాంకేతికతా శిల్పి బిల్‌గేట్స్ ఒక అద్భుత దార్శనికుడు. 2015 తొలినాళ్లలోనే, ఇప్పుడు మన జీవితాలను అల్లకల్లోలం చేస్తున్న కొవిడ్ 19 లాంటి వైరస్, ప్రపంచం మీద విరుచుకుపడనున్నదని ఆయన చెప్పారు. ఆ విశ్వమారిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సంసిద్ధంగా లేదని కూడా గేట్స్ నిక్కచ్చిగా హెచ్చరించారు. కరోనా మహమ్మారి విజృంభించిన నాటి నుంచి ప్రజల్లో బిల్‌గేట్స్ పట్ల గౌరవ భావం ఇతోధికమయింది. అమెరికాలో ఈ భయానక విషక్రిమిపై పోరుకు ఒక ప్రణాళికను ఆయన ప్రతిపాదించారు. దాని సారాంశమిది: పదివారాల పాటు లేదా వైరస్ సంక్రమణలు తగ్గుముఖం పట్టేంత వరకు అమెరికాను షట్‌డౌన్ చేయాలి; విస్తృత స్థాయిలో ప్రజలకు కరోనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి; కరోనాను అరికట్టే వ్యాక్సిన్ అభివృద్ధి పరిచేందుకు ఫెడరల్ ప్రభుత్వం అన్ని విధాల సహకరించాలి.

ఇంతకూ కరోనా వైరస్ నిజంగా ప్రాణాంతకమైనదేనా? అవునని ప్రభుత్వాలు ఘోషిస్తున్నాయి; ప్రజలు విశ్వసిస్తున్నారు. వాస్తవమేమిటి? 'డైమండ్ ప్రిన్సెస్ 'అనే జపనీస్ ప్రయాణికుల నౌక ఉదంతాన్ని పరిశీలిద్దాం. గత జనవరి 20న యోకొహామలో 80 ఏళ్ళ వృద్ధుడు ఒకరు ఈ నౌకలోకి ఎక్కాడు. జనవరి 26న హాంకాంగ్‌లో ఆ వృద్ధుడు నౌకనుంచి నిష్క్రమించాడు. దరిమిలా వైద్య పరీక్షల్లో ఆయనకు కొవిడ్ 19 పాజిటివ్ నిర్ధారణ అయింది. ఫిబ్రవరి 4న యోకొహామ ఓడరేవులో 'డైమండ్ ప్రిన్సెస్'ను క్వారంటైన్‌లో ఉంచారు. చెప్పవచ్చినదేమిటంటే, కరోనావైరస్ వల్ల సంభవించే నష్టాన్ని అంచనావేసేందుకు ఇదొక నిర్దుష్ట నిదర్శనం. ఆ నౌక, సరిహద్దులు పూర్తిగా మూసివేసిన ఒక మినీ నగరం లాంటిది. నౌకలోని ప్రతి ఒక్కరూ ఇతరులకు అత్యంత చేరువగా వుంటారు. ప్రతి ఒక్కరికి వైరస్ సోకడానికి ఇంతకంటే అనుకూల పరిస్థితి మరొకటేముంటుంది? ఓడలోని ప్రయాణికులు వృద్ధులు కావడం కరోనా వైరస్ సృష్టించే విషమ పరిస్థితుల నిదర్శనాధ్యయానికి (కేస్‌స్టడీ) మరింత అనుకూల పరిస్థితి. యువజనుల కంటే వృద్ధులకే మరింత హానికారిగా కరోనా పేరుబడింది. మరింత శోచనీయమైన విషయమేమిటంటే ఈ అంటువ్యాధిని నివారించేందుకు ఓడ అధికార వర్గం కనీస మాత్రంగానైనా జాగ్రత్తలు తీసుకోలేదు! డైమండ్ ప్రిన్సెస్‌లో మొత్తం 3711 మంది వున్నారు. వారిలో 1045 మంది సిబ్బంది కాగా, 2666 మంది ప్రయాణికులు. సిబ్బంది సగటు వయసు 36, ప్రయాణికుల సగటు వయస్సు 69 సంవత్సరాలు. నౌకను క్వారంటైన్ చేసిన తరువాత దానిలో పూర్తిగా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓడను సందర్శించిన అంటువ్యాధుల నిపుణుడు కెంటారో ఇవాటా ఆ పరిస్థితులకు ఎంతో భీతిల్లి పోయాడు. డైమండ్ ప్రిన్సెస్‌ను 'ఆయన కొవిడ్ 19 మిల్లు'గా అభివర్ణించాడు. మరి ఓడలోని 3711 మందిలో 696 మందికి వైరస్ సోకడంలో ఆశ్చర్యమేముంది? వీరిలో 12 మంది మరణించారు. గమనార్హమేమిటంటే సిబ్బంది 1045 మందిలో ఒక్కరికీ కరోనా వ్యాధి సోకలేదు. ఇదెలా సాధ్యమయింది? సిబ్బంది అందరూ యువజనులు కావడమే. వృద్ధ ప్రయాణికులు అందరూ మరణించారు. వైరస్ సోకిన మొత్తం మందిలో మృతుల సంఖ్య 0.3 శాతం మాత్రమే.

కొవిడ్ 19 ఒక మహా అంటువ్యాధి అనడంలో సందేహం లేదు. అయితే అది ప్రాణాంతక వ్యాధి కానేకాదు 'ప్రభుత్వం తక్షణమే పటిష్ఠ చర్యలు చేపట్టని పక్షంలో అమెరికాలో 22 లక్షల మంది ప్రజలు మరణించే అవకాశమున్నదని' సుప్రసిద్ధ దినపత్రిక 'న్యూయార్క్ టైమ్స్'లో మార్చి 15న వెలువడిన ఒక వార్త పేర్కొంది. ఇటువంటి అవాస్తవిక, సంచలనాత్మక వార్తల వల్లే ప్రజలు, ప్రభుత్వాలలో కరోనా విషయమై అమిత భయాందోళనలు నెలకొన్నాయి. కరోనా వైరస్ గత నాలుగునెలలకు పైగా అసంఖ్యాక ప్రజలను సతాయిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు యాభైవేల మంది చనిపోయారు. ఈ వాస్తవాన్ని సరైన దృష్టికోణంలో చూడవలసిన అవసరమున్నది. 2017లో ప్రపంచవ్యాప్తంగా 5.60 కోట్లమంది చనిపోయారు. వీరిలో 17.79 మిలియన్ ప్రజలు హృద్రోగాలతోను, 9.56 మిలియన్ ప్రజలు కేన్సర్‌తోనూ విగతులయ్యారు. అమెరికాలో కరోనా సోకి చనిపోయిన వారి సంఖ్య నాలుగున్నరవేలకు పైగా ఉన్నది. 2017లో అమెరికాలో సంభవించిన మొత్తం మరణాల సంఖ్య 2.80 కోట్లు కాగా వారిలో 6,47,457 మంది హృద్రోగాలతోను; 5,99,108 మంది కేన్సర్‌తో మరణించారు. ఫ్లూ జ్వరానికి 55,672 మంది చనిపోయారు. కరోనా వల్ల మరణించేవారి సంఖ్య లక్ష నుంచి, 2.40 లక్షల మధ్య ఉండవచ్చని వైట్‌హౌజ్ ప్రకటించింది. 2017లో అమెరికాలో రోడ్డు ప్రమాదాలలో 1,69,936 మంది మరణించారు. అంతమంది మరణించారు గనుక రోడ్లను షట్ డౌన్ చేయాలని ఎవరైనా ఆలోచించారా?

ఇటలీలో మూడునెలల క్రితం కొవిడ్ 19 ప్రబలడం ప్రారంభమైన తరువాత ఇంతవరకు మొత్తం దాదాపు పదమూడున్నరవేల మంది మరణించారు 2013–14 నుంచి 2016–17 దాకా ఇటలీలో ఫ్లూ వల్ల 68,000 మంది మరణించినట్టు 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్ఫెక్షస్ డిసీజెస్' వెల్లడించింది. 2016–17లో ఇటలీలో ఫ్లూ వల్ల 24,981 మంది మరణించారు. కరోనాతో ఇంతవరకు మరణించిన వారి కంటే ఫ్లూ మృతుల సంఖ్య రెండు రెట్లు ఎక్కువ.

ఈ వ్యాసం రాస్తున్న సమయానికి భారత్ లో కొవిడ్ 19 కారణంగా 58 మంది మరణించారు. భారత్‌లో క్షయవ్యాధి కారణంగా ఏటా 4,40,000 మంది మరణిస్తున్నట్టు 2019లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. క్షయవ్యాధికి, కరోనా మహమ్మారికి పొంతన ఏమిటి? కరోనా మాదిరిగానే క్షయ కూడా, వ్యాధిగ్రస్తులు దగ్గడం లేదా తుమ్మడం వల్ల వెలువడే సూక్ష్మ క్రిముల ద్వారానే వ్యాపిస్తుంది. మరి క్షయ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకై దేశాన్ని లాక్‌డౌన్ చేయాలన్న ఆలోచన ఎవరికైనా వచ్చిందా?

కొవిడ్ 19 'మరణాల రేటు' ఎక్కువ చేసి చూపుతున్నారు. ఇది, విధాన నిర్ణేతలను తప్పుదోవ పట్టించే అవకాశం వున్నది. మొత్తం కేసులను మొత్తం మరణాలతో భాగించగా వచ్చేదే మరణాల రేటు. అయితే, కేసుల మొత్తం సంఖ్య అనేది దేశంలో ఎంత విస్తృతంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారన్నదానిపై ఆధారపడివున్నది. తీవ్ర వ్యాధి గ్రస్తులై ఆస్పత్రులకు వచ్చినవారికి మాత్రమే పరీక్షలు నిర్వహిస్తే మరణాల రేటు మరింత అధికంగా వుండే అవకాశం ఎంతగానో వున్నది. అలా కాకుండా విస్తృతంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధిలక్షణ రహిత కేసులను కూడా గుర్తించడం జరిగితే మరణాల రేటు తక్కువగా ఉండే అవకాశమున్నది.

కొవిడ్ 19ని కామన్ ఫ్లూ తో పోల్చగూడదనే వాదన ఒకటి గట్టిగా వున్నది. నిజమే, ఫ్లూ అంటువ్యాధి లాంటిది కాదు కొవిడ్ 19. అయితే ఈ రెండింటి లక్షణాలు ఒకే విధంగా ఉండడం కద్దు. ఫ్లూ కంటే కొవిడ్ శీఘ్రగతిన వ్యాపిస్తుందనేందుకు రుజువులు వున్నాయి. ఈ రెండు వ్యాధులకు ఒకే విధమైన అంటు వ్యాధి లక్షణాలు ఉన్నందునే ప్రస్తుత గ్లోబల్ షట్‌డౌన్ సందర్భంలో ఈ తులనాత్మక పరిశీలనకు ప్రాధాన్యమున్నది. ఫ్లూ మూలంగా దేశాలను షట్ డౌన్ చేయడమనేది ఎన్నడూ జరగలేదు. మరి కరోనా విషయంలో ఎందుకు అలా చేస్తున్నాము? కొవిడ్ 19 సంక్షోభం దృష్ట్యా ఆహార ధాన్యాల ఎగుమతి దిగుమతులపై ఆంక్షలు విధించిన పక్షంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నదని పలు అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌లో సైతం ఆహార ధాన్యాల లూటీ వార్తలు వెలువడడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థల మందగమనం ఫలితంగా అసంఖ్యాక ప్రజలు జీవనాధారాలు కోల్పోతారు. లక్షలాది యువజనులు నిరుద్యోగులవుతారు. ఎంతో మంది నిర్వాసితులవుతారు. ప్రజల జీవన ప్రమాణం గణనీయంగా పడిపోతుంది.ఈ వాస్తవాల దృష్ట్యా పదివారాల పాటు షట్ డౌన్ ప్రకటించాలని బిల్ గేట్స్ ప్రతిపాదించడం సరికాదు. అమెరికాలో గానీ , మరెక్కడైనా గానీ షట్ డౌన్ కంటే మరింత వివేక వంతమైన మార్గాన్ని అనుసరించవలసివున్నది. తొలుత 80 ఏళ్ళకు పైబడినవారందరూ స్వచ్ఛందంగా క్వారంటైన్‌లోకి వెళ్ళాలి. హృద్రోగాలు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారిని కూడా స్వచ్ఛందంగా క్వారంటైన్‌లోకి వెళ్ళాలని సూచించాలి. కొవిడ్ 19 ప్రభావితులందరినీ క్వారంటైన్‌కు పంపించాలి. ఆ తరువాత కొవిడ్ 19 రోగితో సంబంధాలలోకి వచ్చిన వారందరినీ గుర్తించి, క్వారంటైన్‌కు పంపించాలి. దరిమిలా విస్తృతస్థాయిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాతనే మిగతా ప్రజలందరూ తమ సాధారణ కార్యకలాపాలను పునఃప్రారంభించాలి. ప్రజలందరూ మాస్కులు, గ్లవ్స్ ధరించేలా, తరచు చేతులు కడుక్కునేలా చేయాలి. చైనా ఇరుగుపొరుగున వున్న దక్షిణ కొరియా, హాంకాంగ్, తైవాన్, సింగపూర్‌లు ఇలాంటి చర్యలు పటిష్ఠంగా చేపట్టడం ద్వారానే కరోనా వైరస్‌ను సమర్థంగా ఎదుర్కోగలుగుతున్నాయి. అంతేగానీ అమెరికాలో సంపూర్ణ షట్‌డౌన్ లేదా భారత్‌లో అసంబద్ధ లాక్‌డౌన్ వల్ల ప్రయోజనమేమీ వుండదు. కరోనా వైరస్ తిరోగమించదు. షట్‌డౌన్‌లు, లాక్‌డౌన్‌లు ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా దెబ్బ తీస్తాయి, పేదలను చెప్పనలవి కాని అవస్థల పాలుచేస్తాయి.. దేశ శ్రేయస్సుకు దోహదం చేయవు.

**క్షయవ్యాధి కారక మరణాలు లక్షల సంఖ్యలో వున్నందున దేశాన్ని లాక్‌డౌన్ చేయాలని ఎవరైనా ఆలోచించారా? చైనాకు ఇరుగుపొరుగున వున్న దక్షిణ కొరియా, హాంకాంగ్, తైవాన్, సింగపూర్‌లు చేపట్టిన చర్యలను అనుసరించడం ద్వారా మాత్రమే కరోనా వైరస్‌ను సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. అంతేగానీ అమెరికాలో సంపూర్ణ షట్ డౌన్ లేదా భారత్‌లో అసంబద్ధ లాక్‌డౌన్ వల్ల ప్రయోజనమేమీ వుండదు. కరోనా వైరస్ తిరోగమించదు. షట్‌డౌన్‌లు, లాక్‌డౌన్‌లు ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా దెబ్బ తీస్తాయి, పేదలను చెప్పనలవికాని అవస్థల పాలుచేస్తాయి.**

◆ **చక్రవర్తి నలమోతు**

# మనిషే గెలుస్తుంది



జీవ కిరీటం దక్కుతుందో లేదో గాని
చావు కిరీటానికి చిక్కొద్దనుకున్నారు
ప్లాస్టిక్ మూటగా మారొద్దనుకున్నారు
మాయి ముంతల్ని వెతుక్కుంటూ వెళ్తున్నారు

మృత్యు కిరీటాలు విమానమెక్కి వచ్చేశాయి
గత్తర కత్తెరలై పేదలపై బడ్డాయి
మెతుకులు లేకున్నా బలుసాకున్నా చాలు
బతుకు జీవుడా అనుకున్నారు!

దూరాభారమైన పల్లెలు కావొచ్చు
స్వర్ణ చతుర్భుజి రహదార్లూ కావొచ్చు
ఆకలి అభద్రత భయం దైన్యం నిర్వేదాల
మట్టి కాళ్ళ మహా యాత్రలు

చంకల్లో చిన్న ప్రాణాలు
చేతుల్లో సంసారం మూటలు
నెత్తిన ఎండ ప్రచండాలు
కడుపులో ఆకలి రాగాలు
అడవి తగలబడుతున్నపుడు
మూగ జీవాల రోదనలూ
రెక్కలల్లార్చే పక్షుల భయాలూ ఉంటాయే
అట్లాంటియే ఇప్పటి వలస మూటల భయాలూ

మంచి నీరిచ్చే మోషే మంత్ర దండం లేదు
ఆకలి తీర్చే 'మన్నా' ఏ ఆకాశం నుంచీ కురియదు
భూమికీ మండే సూర్యుడికీ మధ్య
క్షుధానల దగ్ధ మూర్తులు ఈ వలస జీవులు

మనిషి తల్లి భూమి
మనిషి ఊయల భూమి
మనిషి సంకేతం భూమి
మనిషి కేతనం భూమి

మనిషి జీవ గృహం భూమి
మనిషి హక్కు భూమి
మనిషి సంతకం భూమి
మనిషి స్వాస్థ్యము భూమి

చివరకు మనిషే గెలుస్తుంది
మృత్యు కిరీటం మట్టిలో కలుస్తుంది

● **కృపాకర్ మాదిగ**

## ఏకత్వం

నియంతా నాయకుడూ
కసాయీ కవిరాజూ
ద్విజుడూ శూద్రుడూ
వణికుడూ పాలకుడూ
పండితుడూ పామరుడూ
గిరిజనుడూ పురజనుడూ
ఉన్నవాడూ లేనివాడూ
బలవంతుడూ బలహీనుడూ
పనివాడూ పైవాడూ
ఆస్తికుడూ నాస్తికుడూ
కమ్యూనిస్టూ క్యాపిటలిస్టూ
అంతా ఒకటే నాకన్నీ ఒకటే!

**– పురుషోత్తముడు రాచాబత్తుని** (న్యూ జెర్సీ)

## కాస్తైనా మారానా

నిన్నటి నీ దర్పం
ఆవిరైపోయింది
కత్తి విడిచి సాము చేశావుగా
గడప దాటగలవా!
గడియ తీసి గద్దించగలవా!

అద్దం ముందు నిలబడు
అడిగిందే అడుగు
కరోనా కాస్తైనా మారానా..
నా అహంకారాన్ని అసూయని
అందలాన్నీ అవినీతిని
పదవీ వ్యామోహాన్ని, ప్రాపకాన్ని
శాశ్వతంగా తీసుకుపో..
కల్మషాన్నంతా మింగి
కాలగర్భంలో కలిసిపో..

**– శశి కిరణ్ కొమాండూర్**

# 'ద్రావిడ' మహమ్మారి!



'మహమ్మారి' అనే మాట ఇటీవల బాగా వ్యాప్తిలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ మాటను తన హిందీ ప్రసంగంలో 'మహామారి' అని ఒకసారి, 'మహమ్మారి' అని మరొకసారి రెండు విధాలుగా సంబోధించారు. హిందీ, సంస్కృతం వార్తలలో కూడా ఇది ఇటీవల ప్రతి రోజూ ప్రయోగితమవుతోంది. మహమ్మారి అనే మాట సంస్కృత పదం అని చాలా మంది నమ్ముతున్నారు. సంస్కృ తపదాలనుండే తెలుగుపదాలు ఎక్కువగా పుట్టాయి లేదా వచ్చాయి అని చెప్పడానికి మన పండితులు ఉత్సాహపడుతుంటారు కదా. అయితే మహమ్మారి అనే పదం ద్రావిడ భాషలనుండే సంస్కృతానికి పోయింది.

మారి అనేది ఒక జబ్బుకు పెట్టుకున్న అమ్మవారి పేరు. మనకు వర్షఋతువులో వచ్చే సాంక్రామిక వ్యాధులకు అన్నింటికి అమ్మవారి పేర్లే ఉన్నాయి. ముత్యాలమ్మ, ఆటలమ్మ, మారెమ్మ అనేవి అన్నీ మనం వేరు వేరు అంటు రోగాలకు పెట్టుకున్న పేర్లు. ఇక మహమ్మారి అని కూడా అన్ని రకాల అంటు జబ్బులకు వాడతాము. ఇది, మారెమ్మ అనే దేవత పేరే. ఈ మారెమ్మ అంటే మన దగ్గర ఉన్న దేవత. ప్రతి గ్రామంలో ప్రతి కులం వారికి అమ్మవారు ఎల్లమ్మ. ఎల్లమ్మకు ఉన్న మరొక పేరే మారెమ్మ. తండ్రి జమదగ్ని ఆజ్ఞపైన తన తల్లిని తల నరికి చంపడానికి ఉద్యుక్తుడౌతాడు పరశురాముడు. తప్పించుకోవడానికి ఎల్లమ్మ పారిపోతుంటుంది. అలా వేరు వేరు కులాల వారి ఇండ్లకు పోయినప్పుడు వారు కొద్ది సేపు ఉంచుకొని పరశురాముడు వస్తున్నాడని తెలుసుకొని భయపడి ఆమెను బయటికి పంపిస్తారు. ఆ ఇండ్ల వారి అందరి పైనా కోపగించి ఏడాదికి ఒకసారి తనకు కొలుపు జేయకపోతే తన ఆగ్రహానికి పిల్లలు, గొడ్డూ గేదెలను పోగొట్టుకోవలసి వస్తుంది అని హెచ్చరిస్తుంది. అలా పారిపోతూ చివరికి ఒక మాదిగ గృహస్తు ఇంటికి పోయింది.

అక్కడ ఆమెను తోలు ఊనే లందలో దాచి పెడతారు. పరశు రాముడు వెదుకుతూ వెదుకుతూ ఆ మాదిగ ఇంటికి వస్తాడు. ఇంట్లో కనిపించదు. చివరికి లందలో పట్టుకుంటాడు. తల నరకబోతుంటే ఆ యింటి ఇల్లాలు వచ్చి అడ్డుకొని ఆమెను వాటేసుకొని కాపాడే ప్రయత్నం చేస్తుంది. పరశురాముడు ఆవేశంలో తల నరకగా ఇద్దరి తలలు తెగిపోతాయి. అలా తల్లిని చంపిన తర్వాత ఆయన తండ్రి జమదగ్ని పరశురాముని ఏదైనా వరం కోరుకోమంటాడు. తన తల్లిని బతికించమని కోరుకుంటాడు ఆయన. అప్పుడు తలను మొండానికి అతికించి ఎల్లమ్మను బతికిస్తారు. కాని ఇక్కడ ఒక పొరపాటు జరిగింది. మాదిగ స్త్రీ తలను ఎల్లమ్మ మొండానికి ఎల్లమ్మ తలను మాదిగ స్త్రీకి పెడతారు. ఇద్దరూ బతుకుతారు. ఇలా ఎల్లమ్మ మారింది. మారిన అమ్మే మారెమ్మ, మారి అయింది. ఎల్లమ్మ తల–మాదిగ మొండెం ఉన్న దాన్నే జమదగ్ని భార్యగా స్వీకరిస్తాడు. ఆమెను రేణుకా ఎల్లమ్మగా పిలుస్తారు. మాదిగ తల ఎల్లమ్మ మొండెం ఉన్న దాన్ని మారెమ్మ అని పిలుస్తారు. అంతే కాదు ఇద్దరినీ ఎల్లమ్మ అనడం కూడా ఉంది. ఇద్దరినీ మారెమ్మ అని కూడా అనడం ఉంది. అందుకే ఎల్లమ్మ సబ్బండ కులాల దేవత అయింది.

ఇదే మారెమ్మ, తమిళనాడు, కేరళ, కర్ణాటకల లోనూ ఉన్నది. అక్కడ ఈమెను మారెమ్మ, మారియమ్మ, మారియమ్మన్ అని పిలుస్తారు. కర్ణాటకలో ఎల్లమ్మ అని కూడా పిలుస్తారు. మహారాష్ట్రలో కూడా కొన్ని ప్రాంతాలలో ఈమెను మారెమ్మ అంటారు. మారెమ్మ అని పిలిచే కథ ఉత్తర భారతంలో లేదు. అక్కడ రేణుక కథ మన ఎల్లమ్మ కథ ఒకటే. కాని మాదిగ స్త్రీ ఉదంతం అక్కడ ఉండదు. కాబట్టి దక్షిణ భారతదేశంలోని ద్రావిడ భాషలలోనే ఈ మారి మారెమ్మ అనే పిలుపుతో కూడిన కథ ఉంది. మారి అనే పదం ఇక్కడనుండే వ్యాధిదేవతలకు పేరుగా ఉత్తర భారతానికి పోయింది. ఈ మారెమ్మ అనే పదం ప్రాచీన కాలం నుంచి ఉంది అని చెప్పడానికి సాక్ష్యాలు మనకు లభిస్తున్నాయి. మారి, మారు పదాలను Dravidian Etymological Dictionary తమిళ తెలుగు పదాలుగానే చూపింది. మారి అనే పదాన్ని అంటువ్యాధి అనే అర్థంలో ప్రయోగించడం మనకు చాల ప్రాచీన కాలంనుండే ఉంది. మనకు మహాభారతంలోనే మారి అనే పదాన్ని తిక్కన తన విరాట పర్వం, ద్రోణ పర్వాలలో కూడా ప్రయోగించాడు. విరాట పర్వంలో తృతీయాశ్వాసంలో 37వ సీస పద్యంలో మారి శబ్దాన్ని ప్రయోగించాడు. భీముడు ఉపకీచకులను అందరినీ గంధర్వుని వేషంలో వచ్చి చంపిన తర్వాతి రోజున ద్రౌపది వీధిలో పోతుంటే అక్కడి ప్రజలు ఇలా అనుకున్నారట. 'మనకీచకుల కెల్ల మారియై పుట్టిన సుదతి పోయెడను నని చూచువారు.....' అని ఇంకా పద్యంలో వర్ణిస్తాడు. ద్రౌపదినే ఒక మారెమ్మగా భావించి ఆమె వైపు కూడా చూడడానికి భయపడి పక్కకు తప్పుకొని తల వంచుకొని జనం పోయారని తిక్కన అక్కడ వర్ణించాడు.

ఇక ద్రోణ పర్వం ప్రథమాశ్వాసంలో ద్రోణుడు చేసిన వీర విక్రమాన్ని వర్ణిస్తూ 141వ పద్యంలో ఇలా వర్ణిస్తాడు. 'కూల్చుచు గజముల నెత్తుట/దేల్చుచు దురగముల వీఁకc దేరులు మరలన్/వెల్చుచుc గాల్బముల బోరి/మాల్చుచు రౌద్రముగ మారి మసగిన భంగిన్'. మారెమ్మ అనే వ్యాధి కలయ దిరిగి మనుషులను అంత మొందించినట్లుగా ద్రోణుడు ఏనుగులను కూలుస్తూ గుర్రాలను నెత్తుట తేలుస్తూ రథాలను వెనుకకుపోయేటట్లు చేస్తూ పదాతి దళాన్ని చంపుతూ వీరవిహారం చేసాడని ఇందులో వర్ణించడం ఉంది. ఇక మారెమ్మ వస్తే ఊడ్చుకు పెట్టి పోతుంది అనే నానుడిని ఇక్కడ ధ్వనించేలాగా దీన్ని వర్ణించాడు తిక్కన. ఈ రెండు ప్రయోగాలలో మారి అనే పదం జబ్బుకు పర్యాయపదంగా వ్యాధి దేవతగా వర్ణించడం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది, 13వ శతాబ్ది నాటికే 'మహమ్మారి' అనే పదం ఉందని చెప్పడానికి తిరుగులేని సాక్ష్యం. దీనికన్నా ముందు కూడా చాలా కాలం క్రితమే ఉండి వుండడానికి ఆస్కారం ఉంది. సాహిత్య గ్రంథాలలో సాక్ష్యాలు చూపడానికి ఇదే అన్నింటికన్నా ప్రాచీనమైన గ్రంథంగా కనిపిస్తుంది. తర్వాతి కాలంలో కూడా పెద్దన 'మను చరిత్ర'లో దీన్ని ప్రయోగించాడు.

బ్రిటిషు అధికారి, పరిశోధకుడు విలియం క్రూక్ రాసిన గ్రంథం 'ఫోక్ లోర్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో ఈ అమ్మతల్లులు అంటువ్యాధుల అధిదేవతలుగా ఉండే వారిని గుర్తించాడు. వారిని వర్ణించడానికి The Godlings of Diseases అని ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్నే కేటాయించాడు. దక్షిణ భారతం అంతటా వ్యాధులకు మారి అనే పదం ఉండడాన్ని అతడు గుర్తించాడు. ఎల్లమ్మ కథ ఆధారంగా మారి అనే పదం ద్రావిడ శబ్దమేనని, ఇది దక్షిణాది నుంచే ఔత్తరాహ భాషలలోనికి పోయింది అని చెప్పవచ్చు.

**'మారి' అనే పదాన్ని అంటువ్యాధి అనే అర్థంలో ప్రయోగించడం మనకు చాల ప్రాచీన కాలంనుండే ఉంది. ఈ పదాన్ని తిక్కన తన విరాట పర్వం, ద్రోణ పర్వాలలో ప్రయోగించాడు. 'మారి' ద్రావిడ శబ్దమేనని, దక్షిణాది నుంచే అది ఔత్తరాహ భాషలలోనికి పోయింది అని చెప్పడానికి ఆధారాలున్నాయి.**

■ **పులికొండ సుబ్బాచారి**

# మానవ గర్వభంగం



కరోనా ఉత్పాతం మానవజాతి అహంకారాన్ని కూకటివేళ్ళతో కూల్చివేస్తున్నది. 'ఈ భూమి అంతానాదే, నేనే సర్వధికారిని, ప్రతిచెట్టూ, ప్రతిపిట్టా నాకు దాసోహం అనవలసిందే' అని విర్రవీగిన మానవజాతి, నేడు భయవిహ్వలమై మోకాళ్ళమీద కూలబడి రోదిస్తున్నది. స్వార్థం, అహంభావం, విచ్చలవిడిసుఖం, అధికార దర్పం, సామ్రాజ్యకాంక్ష, వెరసి మనిషి చేసిన అఘాయిత్యాలు, క్షమించరాని పాపాలు నేడు తిరగబడి, వెంటాడి వెంటాడి, వేటాడుతున్నాయి. స్థాపించిన సామ్రాజ్యాలు, నిర్మించిన కృత్రిమచట్టాలు, వేల సంవత్సరాల విజ్ఞానం, నవనాగరికజీవనం అంతా ఒక సూక్ష్మక్రిమి ముందు కుంచించుకుపోయి తలదించింది. ఒక నిష్ఫల, నిష్ఠురవేదన, శవాలు కాలుతున్న కమురువాసన ప్రపంచాన్ని ఆవరించింది. సమస్త మానవ ప్రపంచాన్ని తన చేతులలోకి తీసుకొని, ప్రకృతి ఒక్క చెంప దెబ్బ కొడితే ఏమవుతుందో ఇవ్వాళ మనిషి అనుభవంలోకి వస్తున్నది. వర్తమానం సుడిగుండమై సుళ్ళుతిప్పుతున్నది. భయంకర విపత్తులను గర్భంలో దాచుకున్న భవిష్యత్తును తలుచుకుంటే యముని మహిషపు లోహఘంటలు మనిషిగుండెల్లో ఖణేల్మంటున్నాయి.

భూమిని కాపాడుకోవడం అంటే మనల్ని మనం కాపాడుకోవడం. 'భూమినాదియనిన భూమి ఫక్కునవ్వు'....వేమన చెప్పిన నగ్న సత్యం. టాల్ స్టాయ్ చెప్పిన 'ఎంత భూమి కావాలి' కథ ఇన్ని శతాబ్దాలు గడిచినా మనకు అర్థం కాదు. 'అతిథివోలె ఉండిఉండి, అవని విడిచి వెళ్ళుతాను' అని కాళోజి పలికిన జీవనవేదం మనిషికి ఇమడ లేదు. ఈ భూమిమీద మనిషిగా నువ్వు ఒక అతిథివే, అధిపతివి కానేకావు. భూమి మనిషి ఒక్కడికోసం కాదు. సమస్త ప్రాణులతో మనిషి సమష్టిగా భూమిని పంచుకోవాలే. సహజీవన ధర్మాన్ని పాటించాలన్న ఇంగితం ఏనాడో మనిషి కోల్పోయినాడు. ఈ భూమి సకలజీవులకు ఆదిమాత. ప్రతి జంతువును, మొక్కను చరాచరాలన్నిటినీ భూమాత పోషిస్తుంది. పదివేలసంవత్సరాల కింద జంతువుల జనాభాలో మానవులు ఒక శాతం మాత్రమే కాగా, నేడు 32శాతం మేరకు అరణ్యాలలో ఉండే జంతువులను హరిస్తున్నాడు. అరణ్యేతర జంతువులలో 67 శాతం మనిషికి ఆహారం అవుతున్నాయి. మానవుని వినాశకరచర్యలు భూమిగుండెలలో భయంకర విస్ఫోటనాలు రేపుతున్నాయి. సాగరాల్లో చమురు తెట్టుకట్టిన విషపు అలలను లేపుతున్నాయి.మహాటవులను ఘోరఎడారులుగా మారుస్తున్నాయి. ఈ భూమిని ఫలపుష్పభరితంగా, సారవంతంగా, నివాసయోగ్యంగా మలచిన అనేక జీవజాతుల ఉసురు తీస్తున్నాడు మనిషి. వన్యప్రాణుల ఆవాసాలు చెదిరి మనిషికి, వనచరాలకు మధ్య సామాజిక దూరం తగ్గింది. ఆపాపమే కరోనా రూపంలో నేడు మనిషికి మనిషికి మధ్య అనివార్యమైన భౌతికదూరాన్ని, ఎడబాటును సృష్టించింది.

అమెరికా, దాని తైనాతీదేశాలు వాటి బహుళజాతి కంపెనీలు చేస్తున్న భూగర్భదోపిడీ అంతా ఒక చీకటిచరిత్ర. గుత్తపెట్టుబడిదారీ విధానం భూమికి కలిగించిన నష్టం అంతాఇంతా కాదు. శాస్త్రసాంకేతికపరిజ్ఞానాన్ని భూమ్యాకాశాలను, సముద్రాలను జయించే ఆయుధంగా అవి మలుచుకుంటున్నాయి .

మనిషి చేస్తున్న దారుణాలకు, పెట్టుబడిదారీ దురాశకు వ్యతిరేకంగా నేడు భూమి పోరాడుతున్నది. ఈ ఘర్షణ అనేక వ్యాధి బీజాలను నాటుతున్నది. కరోనా అసంకల్పిత, అయాచిత, అనూహ్య ప్రమాదం ఎంత మాత్రమూ కాదు. ఇది మనిషి స్వయంకృత అపరాధం పర్యావరణ విధ్వంస ఫలితం. మానవ అహంకృతి మీద ప్రకృతి తీర్చుకుంటున్న ప్రతీకారం. అమెరికన్లు ఈ మహమ్మారి విస్తృతిని అంగీకరించలేక పోయారు. దివాంధాలైన గబ్బిలాలనుంచి పుట్టిన ఈ వ్యాధిశక్తిని దివాంధుడైన అంకుల్ శామ్ చూడలేకపోతున్నాడు. భూమి మీదకు ఏ గ్రహాంతరవాసులో దాడికి దిగితే, భూరక్షకులు అమెరికన్లే! అనే అహంకారంతో సినిమాలు తీసిన హాలీవుడ్ నిర్మాతలకు, దర్శకులకు చిత్ర నిర్మాణ నిపుణులకు నేడు మానవుని స్వీయాపరాధం లోంచి పుట్టిన ఒక సూక్ష్మక్రిమిని ఎదుర్కోలేని నిస్సహాయత మింగుడుపడుతుందా? దేశదేశాలలో ఆధిపత్యాన్ని చలాయిస్తూ, ధిక్కారమును సైతునా అని, తనను ప్రతిఘటించిన వారు ఏ బంకర్లలో దాక్కున్నా ఈడ్చిచంపిన సామ్రాజ్యవాదానికి ఇప్పుడు కరోనానుంచి తప్పించుకునే బంకర్లు కావాలి.

అంటువ్యాధులలో 75 శాతం వన్యప్రాణుల నుంచి వచ్చేవే. వ్యాధి కారకాలు జంతువులనుండి మనుషులకు చేరే అవకాశాలు గతంలో ఇంతగా లేవు. 'ఈ భూమి మీద ఇక మేమే చివరితరం' అన్నట్లు విచక్షణారహితంగా చేస్తున్న అడవులనరికివేత, భూమి ఉపరితలం పైనా, భూగర్భంలో సాగిస్తున్న విధ్వంసం, నదులు, సముద్రాలు, సరస్సులను విషపూరితం చేయడం, పెరుగుతున్న ప్రపంచతాపం (గ్లోబల్ వార్మింగ్) అడవి జంతువుల అక్రమ రవాణా, కబేళాలలో సామూహికవధ వంటి దురాగతాలు జంతువులతోపాటూ వాటివెంట విషపూరిత వైరస్ విష క్రిములు మన జీవితంలోకి లంఘించేలా చేస్తున్నాయి. జంతువులను పెద్ద దూరాలకు రవాణా చేస్తున్నప్పుడు అవి విపరీతమైన భయానికి, ఒత్తిడికి లోనై చేసే మలమూత్ర విసర్జనలోంచి ప్రాణాంతకమైన వ్యాధికారకాలు పుడతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్మెంటల్ ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంగర్ అండర్సన్ చెప్పిన దాని ప్రకారం జంతువుల శరీరంనుండి వెలువడే ద్రవాలు జనసమ్మర్దం గల మార్కెట్లు ఒక సులభసమ్మేళనానికి మిక్సింగ్ బౌల్ లాగా ఉపయోగపడుతున్నాయి. ఊహాన్ మార్కెట్ అనుభవం అదే. గుర్రపుడెక్కజాతి గబ్బిలాలలో సార్స్, కోవిడ్ లాంటి వైరస్‌ల రిజర్వాయర్లు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఎబోలా, బర్డ్ ఫ్లూ, జికా వైరస్ వంటివన్నీ వన్యప్రాణుల నుండి మనుషులకు సోకినవే. ఆ అనుభవాల నుంచి మానవాళి గుణపాఠం నేర్చుకున్నదా? 'కరోనా ఉత్పాతం పెద్దగా ఆశ్చర్యపరిచేది కాదు. మనమింకా ప్రమాదపు మొదటి మెట్టు మీదనే ఉన్నామ'ని ఎమోరీ విశ్వవిద్యాలయంలో పర్యావరణ శాస్త్రవేత్త థామస్ గిలెప్సీ హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యం, పర్యావరణ విధానం వేరువేరుకావు. వాతావరణమైనా మన ఆరోగ్యమైనా, మనం భూమిని పంచుకుంటున్న ఇతరజీవుల మీద ఆధారపడి ఉంటాయనేది ప్రాథమికసూత్రం. రోగాలు వచ్చినపుడు పరిష్కారాలు వెతుక్కోవడం దప్పైనప్పుడు బావి తోడిన చందంగా కాకూడదు. భయంతో తీసుకునే తత్తరపాటు చర్యలు ఘోర విపత్తులకు సమాధానం కాజాలవు. నిజమైన పశ్చాతాపంతో, వివేకంతో కూడిన విధానం, ధైర్యంతో కూడిన కార్యాచరణ ఇప్పుడు అవసరం. ఇది మానవజాతి మేల్కొనవలసిన సందర్భం. 'పారాహుషార్' అనే ప్రకృతి హెచ్చరికను గంభీరంగా యోచించవలసిన క్షణం. మొక్కుబడిగా కాకుండా, అంతకరణ శుద్ధితో ప్రాయశ్చిత్తం చేసుకొని, ప్రకృతితో సవ్యమైన సకారాత్మకమైన అవిభాజ్యమైన సంబంధాన్ని భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవాలి. సహజస్థలాల వినాశనాన్ని ఆపాలి. చెట్టూ, చేమ, గుట్ట, పిట్ట అన్నిటినీ వాటిమానాన వాటిని బతకనివ్వాలి. అడవుల్లో పర్వత గుహలలో జంతువులు, చెట్టు మీద గూళ్ళలో పిట్టలు క్షేమంగా ఉంటేనే మనిషి క్షేమంగా ఉంటాడనే సార్వత్రిక దృక్పథం మానవ జీవన గమనాన్ని నిర్దేశించాలి. జీవవైవిధ్యానికి ఎక్కడా నష్టం వాటిల్లకుండా బాధ్యతాయుతంగా, ప్రకృతి పట్ల జవాబుదారీతనంతో మనిషి మెదులుకోవాలి. దుర్మార్గమైన వృకోదర లాభాపేక్షను విడిచిపెట్టాలి. మనుషులమధ్య రకరకాల అంతరాలు, వివక్షలు, అధిక ఐశ్వర్యం పక్కనే నిత్యదరిద్రం ఉండే ఈ క్రూర ప్రపంచాన్ని పరిహరించాలి. కరోనాకు వ్యాక్సిన్ కనుగొంటామా? అన్న ప్రశ్న కన్నా, కరోనా ఇస్తున్న సందేశం మానవాళికి కనువిప్పుకలిగిస్తుందా? అన్నదే అసలైన ప్రశ్న. అమెరికాలో 'అంతర్జాతీయ పరిణామాలు, శీఘ్ర అంటువ్యాధులు, ఉద్భవిస్తున్న ప్రమాదాల పరిశోధన సంస్థ' డైరెక్టర్‌గా ఉన్న డెన్నిస్ కారోల్ పరిశోధనల సారాంశం ప్రకారం 'జంతువుల ద్వారా వచ్చే వైరస్‌ల వల్ల మనిషి ప్రతి మూడు సంవత్సరాల కొకసారి అంటు రోగాల బారిన పడే వ్యాధి చట్రంలో ఇరుక్కున్నాడు'. ఒంటిస్తంభం మేడలో దాక్కున్నా, పరీక్షిత్ మహారాజును పాము కాటేసింది. మనిషి అవివేకంతో, ఎన్నటికీ తీరని తోడేలు ఆకలితో సర్వభక్షకుడై స్వైరవిహారం సాగిస్తే, సుషుప్తిలో ఉన్న, మరేదో వైరస్ ఒళ్ళువిరిచి, విజృంభించకపోదు. అప్పుడు మనం గడపలో పల గొళ్ళెం బిగించుకు కూర్చున్నా, అది కబళించకపోదు. భౌతికవృద్ధికన్నా, నైతికవృద్ధికోసం మనిషి తపించాలి. ఇప్పుడు మతంకన్నా మానవత్వం గురించి చర్చించాలి. మనిషి విజ్ఞానమే జయిస్తుంది. అయితే అది మానవీయ స్వభావాన్ని కలిగుండాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్లు అసమానతలను సమర్థించని మతాలను నిర్మించుకోవాలి. అప్పుడు మతం మత్తుమందు కాకుండా, కార్ల్ మార్క్స్ నిర్వచనం మొదటి పంక్తులలో చెప్పినట్లు మతం నోరులేనివారి నోరుగా, గుండెలేనివారి గుండెగా, ఆత్మలేనివారిఆత్మగా వికసిస్తుంది. ఆ మతమే ప్రకృతిహితంగా పరిణమిస్తుంది.

**కరోనా అసంకల్పిత, అయాచిత, అనూహ్య ప్రమాదం కాదు. ఇది మనిషి స్వయంకృత అపరాధం పర్యావరణ విధ్వంస ఫలితం. మానవ అహంకృతి మీద ప్రకృతి తీర్చుకుంటున్న ప్రతీకారం.**

**భౌతికవృద్ధికన్నా, నైతికవృద్ధికోసం మనిషి తపించాలి. ఇప్పుడు మతంకన్నా మానవత్వం గురించి చర్చించాలి. మనిషి విజ్ఞానమే జయిస్తుంది. అది మానవీయ స్వభావాన్ని కలిగుండాలి. డాక్టర్ అంబేడ్కర్ చెప్పినట్లు అసమానతలను సమర్థించని మతాలను నిర్మించుకోవాలి. అప్పుడు మతం నోరులేనివారినోరుగా, గుండెలేనివారిగుండెగా, ఆత్మలేనివారిఆత్మగా వికసిస్తుంది. ఆ మతమే ప్రకృతిహితంగా పరిణమిస్తుంది.**

● **దేశపతి శ్రీనివాస్**



చిరంజీవి నుండి పిలుపు వచ్చింది.
తెలుగు చిత్ర పరిశ్రమ కదిలింది.
కరోనా కష్టాలపై యుద్ధం ప్రకటించింది.
'కరోనా క్రైసిస్ ఛారిటీ' సహాయ కార్యక్రమాలు,
కొత్త సినిమా 'ఆచార్య' కబుర్ల గురించి
చిరంజీవితో 'నవ్య' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ...

# ఇలాంటి పరిస్థితి ఇంతకుముందు రాలేదు!

**కరోనా వల్ల షూటింగ్ వాయిదా ఆలోచనకు కారణం?**

కరోనా మహమ్మారి రోజురోజుకీ ఎలా విస్తరిస్తుందో ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న తర్వాత ఇది ఆషామాషీ వ్యవహారం కాదు, కనీవినీ ఎరుగని ఉపద్రవం అనిపించింది. 'ఆచార్య' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో దర్శకుడు కొరటాల శివ, సోనూసూద్‌తో ఈ విషయం గురించి చర్చించేవాడిని. అదే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఎక్కువమంది ఒకేచోట గుమికూడకుండా చర్యలు తీసుకోవాలి, సోషల్ డిస్టెన్స్ పాటించకపోతే వైరస్ తీవ్రత ఎక్కువవుతుందని ప్రకటించడంతో వెంటనే దర్శకుడు కొరటాల శివకు ఫోన్ చేసి రేపటి నుండి షూటింగ్ ఆపేద్దామని చెప్పాను. 'కరోనా వైరస్ వ్యాప్తి చెందడానికి మనం కారణం కాకూడదు' అనే నా భావాన్ని ఆయన అర్థం చేసుకుని సరేనన్నారు. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో పరిస్థితి తీవ్రతను గమనించిన మిగిలిన పెద్దలు షూటింగ్స్ ఆపివేయాలని నిర్ణయించారు. కష్టనష్టాలు కలిగిన నిర్ణయమే. కానీ భరించక తప్పదు.

**మీరు, మీ ఫ్యామిలీ తీసుకొంటున్న జాగ్రత్తలు?**

ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామనే చెప్పాలి. బయట నుంచి వచ్చే మా సహాయకులు, డ్రైవర్స్, సెక్యూరిటీ పర్సన్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్... అందరికీ సెలవులు ఇచ్చేశాను. లాక్ డౌన్ పీరియడ్‌ను గౌరవిస్తూ తీసుకొన్న నిర్ణయమది. లాక్ డౌన్ ఎత్తేసిన తర్వాత కొంతకాలం పాటు ఇదే విధానాన్ని ఆచరించాలనుకొంటున్నాను. కుక్స్, ఇంట్లో ఉండే సహాయకులు, ఇతర పనివాళ్లు ఎప్పటినుంచో మా ఇంట్లోనే ఉంటున్నారు. వాళ్లు మాతో పాటు స్వీయ నిర్బంధంలోనే ఉన్నారు. అతిథులను కూడా కొంత కాలంపాటు రావద్దని రిక్వెస్ట్ చేస్తున్నాం. మా అమ్మాయిలు, చెల్లాయిలు వాళ్ల కుటుంబాలతో మాతో పాటే ఉంటున్నారు. కొత్త సినిమాలు చూడగలుగుతున్నాం. మంచి పుస్తకాలు చదువుతున్నాం. రెండు పూటలా ఎక్సర్‌సైజ్ చేయగలుగుతున్నాం. మొక్కలకు నీళ్లు పోయడం, తోట పని చేయడం.. స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేయడం ఇలాంటి వాటి వల్ల సమయం తెలియడం లేదు. ఉదయాన్నే లేచి బయట కూర్చుని సిటీని చూడడం కొత్త అనుభూతి కలిగిస్తోంది. ఆ నిశ్శబ్ద వాతావారణంలో, పక్షుల కిలకిలా రావాలు వింటూ ప్రకృతితో మమేకం అయ్యే అవకాశం మనకు మళ్లీ కలిగింది. ఇది కఠినమైన పరీక్షా సమయమే అయినా ఎంతో కొంత ఎంజాయ్ చేస్తున్నామనే చెప్పాలి.

**వంట గదిలోకి వెళ్లి గరిటె తిప్పుతున్నారా?**

(నవ్వు) కొత్త వంటకాలు చేయడం దుబారానే కదా! అందుకే వంట గదిలోకి వెళ్లి కొత్త వంటలు చేయడం లేదు కానీ దోసెలు, ఉప్మా అప్పుడప్పుడు చేస్తున్నాను. ఇలా వంట గదిలో తలే కాదు చెయ్యి కూడా దూరుస్తున్నాను.

**ఈ తీరిక సమయాన్ని ఎలా వినియోగిస్తున్నారు?**

నా ఆత్మకథ రాసుకోవాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు ఖాళీ దొరికింది కదా! అందుకే గతంలో జరిగిన సంఘటనల్ని సురేఖతో కలసి గుర్తు చేసుకొని వాటిని వీడియో రూపంలో రికార్డ్ చేసుకొంటున్నాను.

**'కరోనా క్రైసిస్ ఛారిటీ' సంస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచన ఎలా కలిగింది?**

ఎలాంటి విపత్తు ఎదురైనా ప్రభుత్వానికి మద్దతు పలకడం, అండదండలు అందించడం పౌరులుగా మన బాధ్యత. అయితే ఈ విపత్తు సమయంలో నాకు మొదట సినీ కార్మికులు గుర్తుకు వచ్చారు. రోజువారీ వేతనం లభిస్తే తప్ప పొట్టగడవని పరిస్థితి వాళ్లలో చాలామందిది. షూటింగ్స్ లేకపోతే వారి జీవనాధారం ఆగిపోతుంది కనుక వాళ్లు ఆకలితో పస్తులు ఉండకూడదు, వెంటనే ఆదుకోవాలని



అనిపించింది. మరో ఆలోచన లేకుండా సినీ కార్మికుల కోసం కోటి రూపాయలు విరాళం ప్రకటించాను. ఆ స్ఫూర్తితో సోదర హీరోలందరూ ముందుకు వచ్చి చేయూతనిచ్చారు. సినీ కార్మికులను ఆదుకోవాలనే ఆలోచన వచ్చిన వెంటనే సురేష్‌బాబుకు ఫోన్ చేశాను. వాళ్లకు ఏవిధంగా సాయం అందజేయాలనే అంశం మీద చాలాసేపు చర్చించుకొన్నాం. ఇది ఏ ఒక్కరితోనో అయ్యే కార్యక్రమం కాదు కనుక సేవాభావం కలిగిన మరి కొంతమంది వ్యక్తుల తోడ్పాటు తీసుకుంటే బాగుంటుందనిపించి తమ్మారెడ్డి భరద్వాజ, సి.కల్యాణ్, ఎన్.శంకర్, 'మా' వర్కింగ్ ప్రెసిడెంట్ బెనర్జీ, ప్రొడ్యూసర్స్ గిల్డ్ నుంచి డి. సురేశ్‌బాబు, ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్‌లను సంప్రదించాను. నాతో కలసి నడవడానికి వాళ్లంతా అంగీకరించారు.

**కానీ ఒకరిద్దరు తప్ప మిగిలిన హీరోయిన్లు ఎవరూ విరాళాలు ప్రకటించలేదు. కారణం?**

ఇప్పటికే తమన్నా, కాజల్ సాయం చేస్తామంటూ ముందుకు వచ్చారు. మిగిలిన హీరోయిన్లకు సమాచారం లేకపోవడమే తప్ప మరే కారణం కాదు. అందుకే వ్యక్తిగతంగా అందర్నీ సంప్రతిస్తున్నాం. మరో విషయమేమిటంటే ఇప్పుడున్న పరిస్థితుల వల్ల కొత్తగా ట్రస్ట్ ఏర్పాటు చేయడానికీ, బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయడానికీ అవకాశం లేకపోవడంతో చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ ఉంది కనుక దాని పేరిట విరాళాలు తీసుకొంటున్నాం.

**వేలల్లో ఉన్న సినీ కార్మికులకు నిత్యావసర వస్తువుల సరఫరా ప్రణాళిక ఎలా చేశారు?**

అన్ని శాఖల నుంచి లబ్ధి పొందడానికి అర్హులైన సినీ కార్మికుల డేటాను ఆయా అసోసియేషన్‌ల చీఫ్‌ల ద్వారా సేకరించాం. నిజాయితీగా అవసరార్థులకు సీసీసీ చేసే సాయం పారదర్శకంగా అందడానికి అమితాబ్ బచ్చన్‌గారు ఓ సులభమైన పద్ధతిని చెప్పారు. 'సినీ కార్మికుల డేటా ప్రకారం వారి పేరుతో ఓ ఎలక్ట్రానిక్ కార్డ్ రూపొందించి, దాన్ని ఆధార్ కార్డ్‌కి లింక్ చేస్తున్నాం. అందులో బ్లడ్ గ్రూప్ సహా అన్ని వివరాలు ఉంటాయి. దీన్ని కంప్యూటర్‌కి అనుసంధానం చేసి ఆ డేటాతో ప్రతి పేద కార్మికుడికి సహాయం అందేలా చేస్తున్నాం" అని అమితాబ్ బచ్చన్ చెప్పారు. అదే పద్ధతిని మనమూ ఫాలో అవుతున్నాం. దీనికి సంబంధించి నలుగురు సాఫ్ట్‌వేర్ నిపుణులు పని చేస్తున్నారు. ఈ విషయంలో మెహర్ రమేశ్ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాడు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి నుంచి ఎలక్ట్రానిక్ కార్డ్ ద్వారా సీసీసీ ఆఫీస్‌కు ఓటీపీ వస్తుంది. 'మేం సహాయాన్ని స్వీకరించాం' అనడానికి అది నిదర్శనం. ఎలాంటి పొరపాటు జరగకుండా పారదర్శకంగా జరుగుతుంది. 'మాకు అందలేదు' అన్నమాట రాకుండా ప్రతి సినీ కార్మికుడిని తమ పేర్లను ఆయా అసోసియేషన్‌లలో నమోదు చేసుకోమని చెబుతున్నాం. ప్రస్తుతం నెలరోజులకు సరిపడా రూ.2222 విలువగల నిత్యావసర వస్తువులతోపాటు, శానిటైజర్, కొన్ని మాస్క్‌లు అందజేస్తున్నాం. లాక్‌డౌన్ కొనసాగి మళ్లీ షూటింగ్‌లు లేకపోతే మరో నెలకు కూడా సాయం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. అవసరమైతే నా సోదర సమానులైన తోటి కళాకారులను, పరిశ్రమ బయట నాకున్న స్నేహితులను అడిగైనా సరే.. పరిశ్రమకు అండగా ఉంటాం. ఈ క్లిష్ట పరిస్థితుల్లో సినీ కార్మికులు ఆకలితో ఉండకూడదన్నది మా ధ్యేయం. అలాగే రామ్‌చరణ్ అడగడంతో ఉపాసన కూడా తమ అపోలో ఫార్మసీ నుంచి ప్రిస్క్రిప్షన్ ఉన్న కార్మికులకు రూ.500 నుంచి 1000 వరకూ మెడిసిన్స్ కూడా ఫ్రీ హోమ్ డెలివరీతో ఇవ్వడానికి ప్రిపేర్ అవుతున్నారు.

### సూపర్‌స్టార్స్ అంతా కలిసి...

ఇటీవల ఓ యాడ్ షూట్ కోసం బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ నాతో మాట్లాడారు. 'ఇండియాలో సూపర్‌స్టార్స్ అందరితో ఓ యాడ్ షూట్ చేస్తున్నాం. ఇందులో మీరు భాగం కావాలి చిరంజీవీ' అని ఆయనడిగారు. తప్పకుండా చేస్తానని అందులో యాక్ట్ చేశాను. త్వరలోనే ఆ వీడియో బయటకు వస్తుంది. 'సినీ కార్మికుల కోసం తెలుగు పరిశ్రమలో మీరంతా చేస్తున్న సహకారం గురించి విన్నాను. మీరు, నాగార్జున చేసిన సాంగ్ బావుంది' అని చెప్పి.. కార్మికులకు సీసీసీ అందజేసే సహాయం వారికి ఎలా చేరాలి అన్నదానిపై అమితాబ్ మాకు ఓ గొప్ప ఐడియా ఇచ్చారు.

**'సీసీసీ' అన్నది ఇకపై కూడా కొనసాగుతుందా?**

కరోనా సమస్య పరిష్కారం అయ్యాక 'సీసీసీ' ఉండదు. 'మన కోసం' అనే సంస్థ మాత్రం అన్ని క్రాఫ్ట్‌లనూ, అసోసియేషన్‌లనూ కలుపుకొని విపత్కర పరిస్థితుల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా చేయూతనివ్వడానికి సిద్ధంగా ఉంటుంది. దీనికి ఓ కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఇదెలా ముందుకెళ్తుంది అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుంది.

**థియేటర్ల మూత, షూటింగ్‌ల నిలిపివేత వల్ల కలిగిన నష్టాన్ని తట్టుకోవడానికి, మళ్లీ దారిలో పడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు?**

గతంలో కూడా థియేటర్లు మూతపడడం, షూటింగ్‌లు ఆగిపోవడం జరిగాయి. అన్నీ సర్దుకున్నాక ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండేవారు. కానీ తెలుగు సినిమా పుట్టాక ఇలాంటి పరిస్థితులు రాలేదు. దీనివల్ల ఎంత నష్టం వాటిల్లిందనేది ఇంకా బేరీజు వేసుకోలేకపోతున్నాం. సినిమా పరిశ్రమ అనే కాదు ప్రపంచంలో ఏ రంగం తీసుకున్నా ఇదే పరిస్థితి. ఇప్పట్లో ఎవరూ మాట్లాడలేరు. చిన్నా, పెద్ద అంతా కలిసి దీనిని అధిగమించాలి.

**'ఆచార్య' సినిమా, దర్శకుడు కొరటాల శివ గురించి?**

'ఆచార్య నిమిత్తం అతనితో ఇంటరాక్ట్ అవ్వడం మొదలుపెట్టిన తర్వాత లోతైన వ్యక్తిగా కనిపించాడు. సమాజం పట్ల ఎంతో అవగాహన, మేధస్సు ఉన్న వ్యక్తి. జాతీయ, అంతర్జాతీయ విషయాలపై పట్టున్న వ్యక్తి. దిగజారుతున్న రాజకీయలు, నాయకుల వ్యక్తిత్వాలు-ప్రవర్తన గురించి అతనిలో ఆందోళన ఎక్కువ. డబ్బు తీసుకుని ఓట్లు వేస్తున్న ప్రజల గురించి వ్యథతో మాట్లాడతాడు. కొరటాల శివలోని సేవాతత్పరత నాకు బాగా నచ్చింది. శ్రీమతితో కలిసి తన ఆదాయంలో కొంత భాగాన్ని సమాజసేవకు వెచ్చించే వ్యక్తి కొరటాల. పిల్లలు పుడితే స్వార్థంతో సమాజానికి ఏమీ చేయలేమని... బిడ్డలు వద్దనే కఠోర నిర్ణయం తీసుకున్న గొప్ప జంట. గొప్ప వ్యక్తిత్వం, సామాజిక స్పృహ ఉన్న తనతో సినిమా చేయడం నాకు చాలా గర్వంగా ఉంది. అతని చిత్రాల్లో ఆ భావాలు కనపడతాయి.

**సినిమాలో మీరు మాజీ మావోయిస్టుగా నటిస్తున్నారని టాక్. ఆల్రెడీ లుక్ కూడా లీకైంది!**

కొరటాల శివ వామపక్ష భావాలున్న మనిషి. ఆ నేపథ్యం



నుండి వచ్చాడు. అతని వ్యక్తిగత భావజాలం నా పాత్రలో కనపడుతుంది. అంతవరకూ చెప్పగలను.

**'ఆచార్య'లో మహేశ్‌బాబు నటిస్తున్నారనీ, కాదు కాదు రామ్‌చరణ్ నటిస్తున్నారని వార్తలు వచ్చాయి.**

(నవ్వుతూ) నేను పొరపాటున 'ఆచార్య' టైటిల్ చెప్పేశా. ఇప్పుడు మీరు అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నా... మహేశ్‌బాబు పేరు ఎలా వచ్చిందో తెలియడం లేదు. నేనంటే మహేశ్‌కి ప్రేమ, అభిమానం. అలాగే, అతనంటే నాకు చాలా ఇష్టం. మహేశ్‌బాబుతో సినిమా చేసే అవకాశం వస్తే అద్భుతం. తనూ నా బిడ్డలాంటివాడు. ఈ చిత్రానికి సంబంధించి ఓ పాత్రకు ముందు నుంచీ రామ్‌చరణ్ అయితే బాగుంటుందనే భావన కొరటాల శివకు ఎక్కడో ఉంది. 'ఆర్ఆర్ఆర్'తో చరణ్ చాలా బిజీగా ఉన్నాడు. అందువల్ల, ఆ సినిమా పూర్తికాకుండా తను ఎంత వరకూ డేట్స్ ఇవ్వగలడనే మీమాంస ఉంది. ఒకవేళ రాజమౌళిగారు, కొరటాల శివగారు అండర్‌స్టాండింగ్‌కి వస్తే.. 'ఆచార్య'లో చరణ్ ఉండొచ్చు. కుదరకపోతే... ఏమో! నేను, చరణ్ కలిసి కంప్లీట్ సినిమా చేయాలన్నది సురేఖ కోరిక. తల్లి కోరిక నెరవేరుతుందేమో చూడాలి.

**ఒకవేళ ఉంటే... అతిథి పాత్రలా ఉంటుందా? ప్రత్యేక పాత్రలా ఉంటుందా?**

రీజనబుల్లీ... మంచి నిడివి గల పాత్రే.

**ఇటీవల ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అడుగుపెట్టారు. ఈ ఆలోచన ఎప్పట్నుంచి ఉంది?**

నిజం చెప్పాలంటే... ముందు నుంచీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని గానీ, దాని ఆవశ్యకత గానీ నాకు పూర్తిగా తెలియదు. పవన్‌కల్యాణ్, చరణ్ ఇలా అందరూ ఉన్నారు. ఒక్కోసారి నేను ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు... ఎవరికి, ఎలా చెప్పాలి? అనేది తెలియదు. అప్పటికప్పుడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయలేను. ప్రెస్‌నోట్ ఇస్తే పూర్తిస్థాయిలో వెళుతుందో, లేదో? తెలియదు. ఇటువంటి ఇబ్బంది చాలాసార్లు ఎదుర్కొన్నా. నేను అనుకున్నవి చెప్పలేకపోతున్నానని ఒక్కోసారి అనిపించేది. అందుకని, నేనూ సోషల్ మీడియాలోకి వస్తే బాగుంటుందా అనుకుంటూ ఉండేవాణ్ణి. డిసెంబర్‌లో కరోనా రావడం, జనవరిలో ఉద్ధృతి పెరగడంతో 'ఇటువంటి సమయంలో హెచ్చరికలు గానీ, జాగ్రత్తలు గానీ చెప్పాల్సిన పరిస్థితి. సోషల్ మీడియాలోకి ఎంటరైతే బావుంటుంది' అనుకున్నా. అభిమానులకు నేను ఎక్కడ ఉన్నాను? ఏంటి? అనేది ఫొటోలు పోస్ట్ చేయడం ద్వారా కనువిందు చేయగలను కదా! ఇన్ని ఆలోచించి ఉగాది రోజున ప్రారంభించా. యాక్టివ్‌గా ఉంటున్నా. ఎవరైనా, ఏదైనా మంచి పని చేస్తే ట్విట్టర్ ద్వారా అభినందిస్తున్నా. ధన్యవాదాలు చెబుతున్నా. సరైన సమయంలో మంచి వేదికను వాడుకుంటున్నా.

**రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన 'ఆర్ఆర్ఆర్' టీజర్‌ను మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు. తండ్రిగా ఆ లుక్, టీజర్ చూసినప్పుడు ఎటువంటి ఉద్వేగానికి లోనయ్యారు?**

ఏ సినిమాకు ఆ సినిమాయే. రాజమౌళి హీరో క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయడం, ఎమోషన్‌తో కథను నడిపించే విధానం గానీ బాగుంటుంది. ఇద్దరు హీరోలున్నా... కచ్చితంగా ఇద్దర్నీ బ్యాలెన్స్ చేస్తారని నేను విశ్వసిస్తున్నా. ఆయన ముందు నుంచీ చరణ్ పుట్టినరోజుకు టీజర్ విడుదల చేయాలని అనుకున్నారు. అయితే... అది ఎలా ఉండబోతుందని నేనూ ఉత్సుకతతో చూశా. నిజంగా అమేజింగ్‌గా అనిపించింది. 'ఆర్ఆర్ఆర్'తో కచ్చితంగా రాజమౌళి తన ముద్ర తిరిగి వేయగలడు. 'బాహుబలి'కి ఏమాత్రం తగ్గని సినిమా అవుతుందనే నమ్మకం నాకుంది.

**'ఆచార్య' తర్వాత ఏ సినిమా చేయబోతున్నారు?**

ఇంకా ఏమీ అనుకోలేదు. ప్రస్తుతం నలుగురైదుగురు దర్శకులతో చర్చలు జరుగుతున్నాయి. త్వరలో చెబుతా. చేయబోయే 'లూసిఫర్' రీమేక్‌కి దర్శకుడు ఎవరనేది నిర్ధారించుకోలేదు.

**'లూసిఫర్' రీమేక్ పవన్‌కల్యాణ్ చేస్తారని ఒక టాక్!**

నో... నో! ఆ సినిమా నేనే చేస్తా. తమ్ముడు (పవన్‌కల్యాణ్) చేయాలని ఉత్సాహపడితే తప్పకుండా తనకు ఇచ్చేస్తా. తనకు చేయాలనుందనే వార్త అయితే నా వరకూ రాలేదు.

**తెలుగు చలనచిత్ర పరిశ్రమ పుట్టిన తర్వాత ఎప్పుడూ సమ్మర్ సీజన్ మిస్ కాలేదు. తొలిసారి మిస్ అవుతోంది.**

ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో... ఎవరికైనా సినిమా అన్నది లీస్ట్ ప్రయారిటీ అయిపోయింది. సినిమాల్లో పెట్టుబడి గురించీ ఆలోచించడం లేదు. ప్రజలందరితో పాటు పరిశ్రమలో వ్యక్తులు కూడా ఈ సమయంలో కొంత నష్టపోతారు. అందరితో పాటు మనం అనే మానసిక సంసిద్ధత ఏర్పడింది కాబట్టి... సమ్మర్ సీజన్ గురించి ఎవరూ ఏమీ ఆలోచించడం లేదని నేను నమ్ముతున్నా. ఒక సీజన్ మిస్ అయితే సినిమా ఇండస్ట్రీకి, ప్రేక్షకులకూ ఏమీ కాదు. కొంత నష్టం జరుగుతుంది. భరిద్దాం!

● వినాయకరావు

---





ప్రజలకు ఉపయోగపడే ఏ అవగాహన కార్యక్రమానికైనా సెలబ్రిటీలు ముందుండాలి. కరోనా పట్టి పీడిస్తున్న తరుణంలో దాని నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని హీరో మహేశ్ భార్య నమ్రతా శిరోద్కర్ సూచనలిస్తున్నారు. 'సేఫ్ హ్యాండ్స్' పేరుతో తాను విసిరిన ఛాలెంజ్ గురించి, కరోనా కాలంలో ఫ్యామిలీతో మహేశ్ గడుపుతున్న తీరు గురించి ఆమె 'నవ్య'తో మాట్లాడారు.





# మహేశ్‌తో సరదాగా గడుపుతున్నాం!

**అందుకే సేఫ్ హ్యాండ్స్ ఛాలెంజ్!**

కరోనా రోజురోజుకి ఎలా విజృంభిస్తుందో చూస్తూనే ఉన్నాం. ఇలాంటి ఓ విపత్తు వస్తుందని కలలో కూడా ఎవరూ ఊహించి ఉండరు. దీనిని నియంత్రించడానికి వ్యాక్సిన్, మెడిసిన్ లాంటిది ఏదీ లేదు. మనమే జాగ్రత్త వహించి, కొన్ని నియమాలు పాటించాలి. ఇంటికే పరిమితం కావాలి. స్వీయ నిర్బంధంలో ఉండడం వల్ల వ్యాప్తి తగ్గుతుంది. అదే దీని నియంత్రణకు సరైన మందు. ఇలాంటి సమయంలో సొసైటీకి గైడెన్స్ చాలా అవసరం. అందుకే ఓ వీడియో చేసి సోషల్ మీడియా వేదికగా 'సేఫ్ హ్యాండ్స్' ఛాలెంజ్ విసిరాను. ఇది నా వంతు బాధ్యత అనుకున్నా. దగ్గు, తుమ్ముల వల్ల కరోనా ఒకరి నుంచి ఒకరికి వ్యాపించే వైరస్ కాబట్టి శుభ్రత, సామాజిక దూరం పాటించడం చాలా ముఖ్యం. ముక్కు, నోటికి మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలి. చేతుల్ని తరచూ 20-30 సెకన్ల పాటు శుభ్రం చేసుకోవాలి. కనీసం అభిమానులు ఈ వీడియో చూసినా అది వేల మందికి చేరుతుందనే నమ్మకంతో చేసిన ప్రయత్నమిది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో భయపడుతూ ఇబ్బందుల్లో ఇరుక్కోవడం, అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కరోనా వైరస్‌కు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే అన్నింటిని నమ్మవద్దు. కరోనా మహమ్మారిని నియంత్రించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు వైద్య, పోలీస్, పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయం.

**బతికుంటే... సంపాదించుకోవచ్చు...**

చాలామంది కరోనాను రెగ్యులర్ ఫ్లూ లాగా భావిస్తున్నారు. ఆ ఆలోచన తప్పు. ఎందుకంటే ఇది చాలా భయంకరమైన వైరస్. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వైరస్ కాబట్టే.. దేశంలోని మొత్తం స్కూళ్లు, కాలేజీలు, థియేటర్లు, మాల్స్ అన్నీ మూతపడ్డాయి. మన ప్రధాని మోదీ తీసుకున్న 'జనతా కర్ఫ్యూ', జాతీయ 'లాక్‌డౌన్' చాలా మంచి నిర్ణయాలే! జనాలు బయటకు రాకపోతే వైరస్ ఛైన్ లింక్ తెగుతుంది అన్నది వాస్తవం. గత ఆదివారం దేశవ్యాప్తంగా అందరూ ఇళ్లకే పరిమితమై జనతా కర్ఫ్యూను విజయవంతం చేశారు. అయితే కర్ఫ్యూ, లాక్‌డౌన్ వల్ల సాధారణ ప్రజలు పనులు లేక, నిత్యావసర వస్తువులకు చాలా ఇబ్బంది పడుతున్నారు. అది బాధాకరమే! అయితే వైద్య సౌకర్యాలు, వసతులు తక్కువైన మన దేశంలో కరోనాను తరిమికొట్టడానికి ఇంతకన్నా మంచి మార్గం ఇంకోటి లేదు. ఆరోగ్యంకన్నా ముఖ్యమైనది ఏదీ లేదు. బతికుంటే ఎలాగైనా కష్టపడి సంపాదించుకోవచ్చు.





**హౌస్ అరెస్ట్ చేశా..!**

చదువుకొనే పిల్లలకు పరీక్షలు వాయిదా పడడం, సెలవులు ఇవ్వడంతో సరదాగా బయటకు వెళ్లి గడపాలనుకుంటారు. మొదట మా పిల్లలు గౌతమ్, సితార కూడా అదే ఆలోచన చేశారు. కానీ బయట పరిస్థితి భయంకరంగా ఉంది. అందుకు వాళ్లను గడప దాటనివ్వకుండా హౌస్ అరెస్ట్ చేసేశాం. 'అమ్మా... బోర్ కొడుతోందీ' అన్నారు మొదట్లో! కానీ ప్రాణంగా పెంచుకునే పిల్లలకు ఆరోగ్యం చాలా ముఖ్యం కదా! అందుకే, కరోనా పరిస్థితుల్లోనూ, 'లాక్‌డౌన్'లో ఇంట్లోనే ఉండాల్సిన అవసరాన్ని వాళ్లకు అర్థమయ్యేలా చెప్పి.. ఇంట్లోనే.. వాళ్లకు కావలసిన ఆటలు, ఆహారం అందిస్తున్నాం. మా ఇంట్లో పని చేసే అందరి విషయంలో నేను జాగ్రత్తలు తీసుకుంటున్నా. 'సరిలేరు నీకెవ్వరు' తర్వాత ఫ్యామిలీ మొత్తం మూడు నెలల పాటు వెకేషన్ ప్లాన్ చేశాం. కరోనా కారణంతో ఆ ప్లాన్ మొత్తం మారిపోయింది. అది కూడా మన మంచికే అనుకున్నా. ఇప్పుడు మహేశ్‌తో ఇంట్లోనే సరదాగా గడుపుతున్నాం.

**సరైన సమాధానం దొరుకుతుంది...**

'ఇఫ్ యు కాంట్ గో అవుట్ సైడ్.. గో ఇన్‌సైడ్' స్లోగన్‌కి నా వైపు నుంచి బలమైన అర్థం ఉంది. ఇలాంటి భయాందోళనల మధ్య మనం బయటకు వెళ్లలేని పరిస్థితిలో కామ్‌గా ఉండి మన మనసుతో గడపడం వల్ల చాలా ప్రశాంతత చేకూరుతుంది. జవాబు దొరకని ఎన్నో ప్రశ్నలకు ధ్యానంతో సమాధానం దొరుకుతుంది. ప్రజలకు ఉపయోగపడే ఏ అవగాహన కార్యక్రమానికైనా నేను ముందుంటా.

**మహేశ్‌కు ఆ రెండూ ప్రాణం...**

షూటింగ్‌లు ఉన్నప్పుడు మహేశ్‌కు ఇంత ఖాళీ సమయం దొరకదు. ఆయనకు సినిమాలు, పిల్లలంటే ప్రాణం. షూటింగ్‌లు లేకపోవడంతో ఆయన పూర్తి సమయాన్ని కుటుంబం కోసం కేటాయించారు. తరచూ పిల్లలతో ఆటలాడుతున్నారు. ఇప్పుడు ఆయనకు పిల్లలతో అనుబంధం మరింత పెరిగింది. ఆటలు పూర్తయ్యాక అన్ని భాషల చిత్రాలూ చూస్తారు. పుస్తకాలు చదువుతారు.

**సితార ఏకసంథాగ్రాహి...**

సితార డాన్స్‌లు చూసి డాన్స్ మాస్టర్‌ని పెట్టి నేర్పిస్తున్నాం అనుకుంటారంతా. తను ఏకసంథాగ్రాహి. ఏదైనా ఒక్కసారి చూసిందంటే పట్టేస్తుంది. వాళ్ల నాన్న సినిమాలో పాటల్ని అలా నేర్చుకునే డ్యాన్స్ చేస్తుంది. తన డ్యాన్స్ చూసి సితార ఎంత బాగా చేస్తోందో అని మీరెలా అనుకుంటారో.. మేమూ అలాగే ఆశ్చర్యపోతాం. దానికి అంత గ్రాస్పింగ్ పవర్ ఉంది. ఈ మధ్యనే సితార చేసిన 'మైండ్ బ్లాక్' సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది.

● ఆలపాటి మధు

● కామిక్ కరోనా

కార్టూన్: చారి పి.ఎస్



## జీఎస్‌టీ చెల్లింపుదారులకు ఊరట

**రిటర్న్ దాఖలు, పన్ను చెల్లింపు గడువు పెంపు**


రాంబాబు గొండాల

**క**రోనా వైరస్ ప్రభావంతో భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో ఒక్కసారిగా వాణిజ్య, పారిశ్రామిక రంగాలు కుదేలయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని వస్తుసేవల పన్నులో ఉన్న పన్ను చెల్లింపుదారులకు రిటర్న్ దాఖలు, పన్ను చెల్లింపు సమయం పెంచటం, వడ్డీ తగ్గించటంతో పాటు పలు రకాల ఇతర మినహాయింపులు ఇవ్వటం జరిగింది. ఆ వివరాలు మీ కోసం..

ఇందులో ముందుగా చెప్పాల్సింది ఏమిటంటే.. 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను కాంపోజిషన్ స్కీమ్ (COMPOSITION SCHEME) ఎంపిక చేసుకునే పన్ను చెల్లింపుదారులు సంబంధిత అప్లికేషన్‌ను (దీన్నే FORM GST CMP-02 గా వ్యవహరిస్తారు) దాఖలు చేసే గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించటం జరిగింది. వాస్తవానికి ఇది ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే దాఖలు చేసి ఉండాలి. అలాగే, వీరు ఇప్పటి వరకు తీసుకున్న ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను రివర్స్ చేయటానికి దాఖలు చేయాల్సిన FORM GST ITC-03 ను జూలై 31వ తేదీ వరకు దాఖలు చేయవచ్చు. మామూలుగా అయితే దీన్ని ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 60 రోజుల లోపు అంటే మే 30వ తేదీ లోపు దాఖలు చేయాల్సి ఉంది.

అలాగే నిర్ణీత సమయంలోపు పన్ను చెల్లించకుంటే ఏటా 18 శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉండగా దీన్ని పన్ను చెల్లింపుదారుల టర్నోవర్‌ను బట్టి పూర్తిగా తీసివేయటం లేదా 9 శాతానికి తగ్గించటం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలేమిటంటే..

**గత ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.5 కోట్లకు మించి ఉన్నవారు:** వీరికి ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి చెల్లించాల్సిన పన్ను మీద నిర్ణీత తేదీ నుంచి 15 రోజుల వరకు ఎలాంటి వడ్డీ వసూలు చేయరు. ఆ తర్వాత 9 శాతం వడ్డీ చొప్పున కట్టాల్సి ఉంటుంది. అయితే, ఈ సౌలభ్యం సంబంధిత GSTR-3B రిటర్న్‌లను జూన్ 24వ తేదీ కంటే ముందు దాఖలు చేసినపుడు మాత్రమే లభిస్తుంది.

**గత ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.1.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్య ఉన్నవారు:** వీరికి ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి చెల్లించాల్సిన పన్ను మీద వడ్డీ నుంచి పూర్తి మినహాయింపును ఇవ్వటం జరిగింది. కాకపోతే, ఫిబ్రవరి, మార్చి GSTR-3B రిటర్నులను జూన్ 29వ తేదీలోపు, ఏప్రిల్ రిటర్న్‌ను జూన్ 30వ తేదీలోపు దాఖలు చేయాల్సి ఉంటుంది.

**గత ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.1.5 కోట్ల లోపు ఉన్నవారు:** వీరికి కూడా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి చెల్లించాల్సిన పన్ను మీద వడ్డీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. అయితే, ఫిబ్రవరి GSTR-3B రిటర్న్‌ను జూన్ 30వ తేదీ, మార్చి GSTR-3B రిటర్న్ జూలై 3వ తేదీ లోపు, ఏప్రిల్ రిటర్న్‌ను జూలై 6వ తేదీ లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇచ్చిన గడువు లోపు రిటర్నులు దాఖలు చేస్తే లేట్ ఫీజు నుంచి కూడా పూర్తి ఉపశమనం లభిస్తుంది.

ఇంతేకాకుండా GSTR-1కు సంబంధించి లేట్ ఫీజును తొలగించటంతో పాటు కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్న వారు దాఖలు చేయాల్సిన త్రైమాసిక రిటర్న్ దాఖలు గడువు పొడిగించటం జరిగింది. అయితే, వీటన్నింటికి తగు నియమ నిబంధనలు ఉన్నందున పన్ను చెల్లింపుదారులు, ఆడిటర్లు వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రయోజనాలను పూర్తి స్థాయిలో పొందే వీలు ఉంటుంది.

**గమనిక:** ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

## పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు తగ్గాయిలా..



| పొదుపు పథకాలు | 1-1-2020 నుంచి 31-3-2020 వరకు అమల్లో ఉన్న వడ్డీ రేటు | 1-4-2020 నుంచి 30-6-2020 వరకు అమల్లో ఉండే వడ్డీ రేటు |
|---|---|---|
| సేవింగ్ డిపాజిట్ | 4.0 | 4.0 |
| ఏడాది కాలపరిమితి డిపాజిట్ | 6.9 | 5.5 |
| రెండేళ్ల కాలపరిమితి డిపాజిట్ | 6.9 | 5.5 |
| మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్ | 6.9 | 5.5 |
| ఐదేళ్ల కాలపరిమితి డిపాజిట్ | 7.7 | 6.7 |
| ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ | 7.2 | 5.8 |
| సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ | 8.6 | 7.4 |
| నెలవారీ ఆదాయ ఖాతా | 7.6 | 6.6 |
| నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ | 7.9 | 6.8 |
| పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ | 7.9 | 7.1 |
| కిసాన్ వికాస్ పత్ర | 7.6 | 6.9 |
| సుకన్య సమృద్ధి యోజన | 8.4 | 7.6 |

**క**రోనా వైరస్ వ్యాప్తి, ఆర్థిక వ్యవస్థలో మందగమనం నేపథ్యంలో భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను తగ్గించింది. ఆర్‌బీఐ నిర్ణయం మేరకు బ్యాంకులు తాము జారీ చేసే వివిధ రకాల రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించాయి. ఇదే సమయంలో కస్టమర్ల డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేట్లలో కోత విధించాయి. రుణాలపై వడ్డీ భారం తగ్గడం వల్ల చాలా మంది రుణగ్రహీతలు సంతోషిస్తున్నారు. కానీ డిపాజిట్లపై వడ్డీ రేట్లలో కోత విధించడం వల్ల ఈ ఆదాయంపై ఆధారపడిన డిపాజిట్‌దారులు నిరాశకు గురవుతున్నారు.

ప్రభుత్వం చిన్న మొత్తాల పొదుపు పథకాలపైనా వడ్డీ రేట్లను తగ్గించింది. తగ్గించిన వడ్డీ రేట్లు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. వచ్చే జూన్ 30వరకు (ఏప్రిల్-జూన్ త్రైమాసికం) ఈ రేట్లు కొనసాగుతాయి. ఈసారి ఈ పథకాలపై వడ్డీ రేటు చాలా తగ్గింది. ముఖ్యంగా పోస్టాఫీసు టర్మ్ డిపాజిట్లపై కోత ఎక్కువగా ఉంది. ఎక్కువగా ప్రాచుర్యం పొందిన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై కూడా వడ్డీ తగ్గింపు అధికంగానే ఉంది.

**పీపీఎఫ్:** పాపులర్ టాక్స్, దీర్ఘకాలిక పొదుపు పథకమిది. మెచ్యూరిటీ కాలపరిమితి 15 ఏళ్లు ఉంటుంది. దీని వడ్డీ రేటును ఏకంగా 7.9 శాతం నుంచి 7.1 శాతానికి తగ్గించారు

**సుకన్య సమృద్ధి యోజన:** ఆడ పిల్లల కోసం తెచ్చిన పొదుపు పథకమిది. దీనిపై వడ్డీ రేటు ఇంతకు ముందు 8.4 శాతం ఉండగా.. దీన్ని 7.6 శాతానికి తగ్గించారు

**సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్:** ఈ పథకంపై వడ్డీ రేటును 8.6 శాతం నుంచి 7.4 శాతానికి తగ్గించారు

**ఎన్ఎస్‌సీ:** నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ రేటు 7.9 శాతం నుంచి 6.8 శాతానికి తగ్గించారు

**ఐదేళ్ల పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్:** ఈ పథకంపై వడ్డీ రేటును 7.2 శాతం నుంచి ఏకంగా 5.8 శాతానికి తగ్గించడం గమనార్హం.

**కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ):** ఇంతకు ముందు ఇందులో పెట్టుబడి పెడితే 113 నెలల్లో రెండింతలయ్యేది. ఇప్పుడది 124 నెలలకు పెరిగింది. దీనిపై వచ్చే రాబడి 7.6 శాతం నుంచి 6.9 శాతానికి తగ్గింది.

**పోస్టాఫీసు టర్మ్ డిపాజిట్లు:** తాజా తగ్గింపుతో పోస్టాఫీసు టర్మ్ డిపాజిట్ల (1-3 ఏళ్లు) వడ్డీ రేటు 6.9 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గిపోయింది. ఐదేళ్ల కాలపరిమితి కలిగిన టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటును 7.7 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గించి వేశారు.

### ఇలా చేయవచ్చు...

**డి**పాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గడం వల్ల అనేక మంది కలవరపడుతున్నారు. తమకు అధిక ఆదాయాన్నిచ్చే ఆర్థిక సాధనాల గురించి వెతుకుతున్నారు. ఎక్కువ రిటర్నులు రావాలని భావించే వారు బ్యాంకింగ్, పీఎస్‌యూ డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించవచ్చని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. ప్రస్తుతమున్న మార్కెట్ పరిస్థితుల్లో ఇవి వార్షికంగా 7.5 శాతం వరకు రిటర్నును ఇవ్వడానికి అవకాశం ఉందని చెబుతున్నారు. ఇతర డెట్ ఫండ్స్‌తో పోల్చితే బ్యాంకింగ్, పీఎస్‌యూ డెట్ ఫండ్స్ భద్రమైనవంటున్నారు. బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పీఎస్‌యూలకు సావరిన్ గ్యారెంటీ ఉంటుంది కాబట్టి భరోసాగా ఉండవచ్చని సూచిస్తున్నారు. తమ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పోర్ట్‌ఫోలియోలో 40 శాతం వరకు ఈ కేటగిరీ కోసం కేటాయించవచ్చని నిపుణులు సలహా ఇస్తున్నారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 4వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 340 | విశాఖపట్నం | 345 |
| 5వ తేదీకి.. | | వరంగల్ | 343 |
| చిత్తూరు | 373 | డజను గుడ్లు రూ. | 54 |
| గోదావరి | 345 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72 | విజయవాడ | 62 |
| వరంగల్ | 72 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 72 | ఒంగోలు | 58 |
| కరీంనగర్ | 72 | చిత్తూరు | 75 |
| కర్నూలు | 72 | నెల్లూరు | 75 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 83 |
| గోదావరి | 65 | | |

## ఈ-వే బిల్లులకు నెలాఖరు వరకు గడువు

**దే**శవ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో జాతీయ రహదారుల వద్ద సరుకు రవాణా లారీలు, ట్రక్కులు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయి ఉన్నాయి. ఈ పరిస్థితి దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ ఈ-వే బిల్లుల గడువు తేదీని ఈ నెల చివరి వరకు పొడిగించింది. మార్చి 20 నుంచి ఏప్రిల్ 15 మధ్యలో గడువు ముగిసే ఈ-వే బిల్లులకు మాత్రమే ఈ గడువు పొడిగింపు వర్తించనుంది. జీఎస్‌టీ చట్టం ప్రకారం.. రూ.50,000 మించి విలువైన వస్తువులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలించేందుకు ఈ-వే బిల్లు తప్పనిసరి.

## టీడీఎస్ మినహాయింపు ఫైలింగ్‌కు మరింత సమయం

**వ**డ్డీ ఆదాయంపై టీడీఎస్ మినహాయింపు కోరే వ్యక్తులు జూన్ 30 తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఫారమ్ 15జీ, 15హెచ్‌లను సమర్పించేందుకు ఆదాయ పన్ను శాఖ అనుమతిచ్చింది. కరోనా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పన్ను విధింపు పరిమితికన్నా తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు ఫారమ్ 15జీ, 15 హెచ్‌లను సమర్పించడం ద్వారా వడ్డీ ఆదాయంపై టీడీఎస్ (మూలం వద్ద పన్ను) విధించకుండా మినహాయింపు కోరుతారు. ఈ ఫారాలను పన్ను చెల్లింపుదారులు తమ బ్యాంకులు లేదా ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లకు ఏప్రిల్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

## భారత ఐటీ.. రివర్స్ గేర్!

**ఇ**న్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగంపైనా కరోనా వైరస్ ప్రభావం గట్టిగానే ఉందని ఇండస్ట్రీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సంవత్సరంలో భారత ఐటీ రంగ వృద్ధి గత ఏడాది స్థాయిలో లేదా అంతకంటే తగ్గి రుణాత్మకంలోకి జారుకోవచ్చని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ఇంకా ఆయనేమన్నారంటే..

- కరోనా విజృంభణతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోయాయి. పరిస్థితి 2008 ఆర్థిక మాంద్యం నాటి కంటే అధ్వానంగా ఉంది.
- ఈ నేపథ్యంలో భారత ఐటీ కంపెనీల క్లయింట్లు ఆధునిక సాంకేతికత కోసం వ్యయాన్ని పెంచకపోవచ్చు. ప్రస్తుత స్థాయి వ్యయాన్ని సైతం కొనసాగించే అవకాశాలు కన్పించడం లేదు.
- ఆయా రంగాల్లో ఐటీ వ్యయం తగ్గడంతోపాటు సాఫ్ట్‌వేర్ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పెరగనుంది. ఎందుకంటే, అంతర్జాతీయంగా రిటైల్, ఆర్థిక సేవల రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.
- అమెరికాలో నిరుద్యోగిత రేటూ పెరగనుంది. ఆర్థిక వ్యవస్థల పనితీరు పూర్తిగా పతనమైంది. ఈ నేపథ్యంలో వ్యవస్థలో కొనుగోలు శక్తి పూర్తిగా తగ్గిపోనుంది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది ఐటీ రంగానికి గడ్డుకాలమే.

# స్పోర్ట్స్

## అండర్-17 మహిళల సాకర్ వరల్డ్‌కప్ వాయిదా

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ దెబ్బకు తాజాగా మరో మెగా టోర్నమెంట్ వాయిదా పడింది. వచ్చే నవంబరులో భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సిన ఫిఫా అండర్-17 మహిళల వరల్డ్‌కప్‌ను వాయిదా వేస్తున్నట్టు అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) శనివారం ప్రకటించింది. నవంబరు రెండు నుంచి 21 వరకు దేశంలోని ఐదు ప్రాంతాలు.. కోల్‌కతా, గువాహటి, భువనేశ్వర్, అహ్మదాబాద్, నవీ ముంబైలో ఈ మెగా టోర్నీ జరగాల్సి ఉంది. భారత్ సహా మొత్తం 16 జట్లు ఈ ప్రపంచ కప్‌లో తలపడాల్సి ఉంది. ఈ టోర్నమెంట్‌తో పాటు ఆగస్టులో పనామా/కోస్టారికాలో నిర్వహించాల్సిన అండర్-20 మహిళల వరల్డ్‌కప్‌నూ వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండు టోర్నమెంట్లు ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని ఫిఫా పేర్కొంది.

## హాకీ ఇండియా మరో రూ.75 లక్షలు..

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు హాకీ ఇండియా (హెచ్ఐ) మరోసారి విరాళం ప్రకటించింది. తాజాగా పీఎం-కేర్స్ నిధికి రూ.75 లక్షల విరాళమిచ్చింది. దీంతో హెచ్ఐ అందించిన మొత్తం రూ.కోటికి చేరింది. ఈనెల 1న ముందుగా హెచ్ఐ రూ.25 లక్షల విరాళం ఇచ్చింది. ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయం మేరకు ఈ అదనపు మొత్తాన్ని అందించినట్టు హెచ్ఐ అధ్యక్షుడు మహ్మద్ ముస్తాక్ అహ్మద్ తెలిపాడు. ఈ కష్టకాలంలో దేశానికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పాడు. అలాగే గోల్ఫర్ అనిర్బన్ లహిరి రూ.7 లక్షల విరాళమిచ్చాడు. దేశానికి సహాయం చేసేందుకు ఎంత మొత్తమైనా అందజేసి తమ వంతు పాత్ర పోషించాలని కోరాడు.

## 2022 వరకు ఆమే!

### సింధుకు మూడేళ్లు ప్రపంచ చాంపియన్ హోదా



**హైదరాబాద్:** స్టార్ షట్లర్ పీవీ సింధు కూడా ఊహించి ఉండదు. కానీ మూడేళ్లపాటు ఆమే ప్రపంచ చాంపియన్. ఇంతకీ విషయం ఏమిటంటే.. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) 2006 నుంచి ప్రతి సంవత్సరం వరల్డ్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తోంది. సింధు 2019లో ప్రపంచ చాంపియన్‌షిప్ గెలిచింది. ఆ ప్రకారం 2020 వరకే ఆమెకు ఆ హోదా. కానీ ఒలింపిక్స్ ఏడాదిలో వరల్డ్ చాంపియన్‌షిప్ నిర్వహించరు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ జూలైలో ఒలింపిక్స్ జరగాలి. కానీ కరోనా వైరస్‌తో విశ్వ క్రీడలు వచ్చే సంవత్సరానికి వాయిదా పడ్డాయి. దాంతో వచ్చే ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌ను నిర్వహించే అవకాశాలు లేవు. ఇక 2021 డబ్ల్యూబీఎఫ్ క్యాలెండర్ పరిశీలిస్తే.. నవంబరు వరకూ ఖాళీ లేదు. దాంతో ఈ మూడేళ్ల పాటు సింధుదే వరల్డ్ టైటిల్ అని బ్యాడ్మింటన్ వర్గాలు చెబుతున్నాయి. కాగా..తాను ప్రపంచ చాంపియన్‌గా ఏకంగా మూడేళ్లు కొనసాగనుండడంపై సింధు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. 'టోర్నీలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయనే దానిపైనే ప్రస్తుతం మా దృష్టి నిలిచింది. వరల్డ్ చాంపియన్‌షిప్, ఒలింపిక్స్ వాయిదా పడడంపై చర్చ జరుగుతోంది' అని ఆమె చెప్పింది. ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో పాల్గొని గతనెల 14న స్వదేశానికి వచ్చిన సింధు 14 రోజుల స్వీయ నిర్బంధంలో ఉంది. వాస్తవంగా ఆ నిర్బంధం కిందటినెల 28న ముగిసింది. కానీ విదేశాల నుంచి వచ్చిన దరిమిలా దానిని ఈనెల 5వరకు పొడిగించారు. 'స్థానిక పోలీసులు మమ్మల్ని పర్యవేక్షిస్తున్నారు. క్వారంటైన్‌ను ఈనెల 5వరకు పొడిగించారు. మా పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటికి స్టిక్కర్ అతికించారు. ఇంగ్లండ్ నుంచి వచ్చిన స్నేహితులను విచారిస్తే.. వారికి కూడా ఇలానే చేశారని చెప్పారు' అని సింధు వివరించింది.

## మేము సైతం..



**కరోనాపై పోరుకు చెస్ స్టార్ల నిధుల సేకరణ**

**ఎగ్జిబిషన్ టోర్నీకి ఆనంద్, హంపి, హరికృష్ణ**

**చెన్నై:** కరోనా మహమ్మారిపై పోరులో మేము సైతం..అంటున్నారు దేశ ప్రముఖ చెస్ ఆటగాళ్లు. దిగ్గజం ఆనంద్‌తోపాటు తెలుగు తేజాలు కోనేరు హంపి, పి.హరికృష్ణ, ద్రోణవల్లి హారిక, విదిత్ గుజరాతి, అధిబన్ వీరిలో ఉన్నారు. కొవిడ్-19పై యుద్ధానికి నిధుల సేకరణలో భాగంగా ఈనెల 11న ఈ ఆరుగురు ఆటగాళ్లు ఎగ్జిబిషన్ చెస్ టోర్నీలో పాల్గొననున్నారు. చెస్.కామ్ పోర్టల్ ద్వారా వీరు ప్రపంచంలోని చెస్ ప్లేయర్లతో గేమ్‌లు ఆడనున్నారు. 20 బోర్డులపై మ్యాచ్‌లు జరుగుతాయి. చెస్.కామ్/టీవీ ఈ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ టోర్నీ ద్వారా వసూలైన మొత్తాన్ని పీఎం కేర్స్ నిధికి అందజేస్తారు. 'కోవిడ్-19పై పోరుకు విరాళాల సేకరణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మద్దతు పలకండి' అని ప్రస్తుతం జర్మనీలో ఉన్న గ్రాండ్‌మాస్టర్ ఆనంద్ కోరాడు. టోర్నీలో పాల్గొనే ఆటగాళ్లు 2000లోపు ఫిడే రేటింగ్ కలిగి ఉండాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ప్లేయర్లు విరాళాలు ఇవ్వాలి. 150 అమెరికా డాలర్లు విరాళంగా ఇస్తే ఆనంద్‌తో గేమ్ ఆడవచ్చు. ఇక.. 25 అమెరికా డాలర్ల రిజిస్ట్రేషన్ రుసుము చెల్లిస్తే ఆరుగురు భారత స్టార్ ఆటగాళ్లలో ఒకరితో పోటీపడవచ్చు. వీరిలో ఒకరు ఆనంద్ కూడా ఉండే అవకాశముంది.

## దాదా పెద్ద మనసు



### 10 వేల మందికి అన్నదానం

**కోల్‌కతా:** కొవిడ్-19 ధాటికి ఇబ్బందులు పడుతున్న పేదవారిని ఆదుకునేందుకు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ నడుం బిగించాడు. ఈసందర్భంగా అతడు ఇస్కాన్ ఆధ్వర్యంలో పది వేల మందికి భోజనం అందించేందుకు సిద్ధమయ్యాడు. స్థానిక ఇస్కాన్ సెంటర్ ప్రతిరోజూ పది వేల మందికి భోజనం అందిస్తుంటుంది. అయితే లాక్‌డౌన్ సమయంలో దాదా మరో పది వేల మందికి అందించేందుకు ముందుకు వచ్చాడు. దీంతో ఈ సంఖ్యను 20 వేలకు పెంచనున్నట్టు ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధర్మన్ దాస్ తెలిపారు. ఇంతకుముందు రామకృష్ణ మిషన్‌కు సౌరవ్ 20 వేల కిలోల ధాన్యాన్ని కూడా అందించాడు.

## నెయ్‌మార్ సాయం రూ. 7.6 కోట్లు!



**బ్రెజిలియా:** కొవిడ్-19 మహమ్మారిపై పోరుకు బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్ నెయ్‌మార్ తనవంతు సాయం చేశాడు. ఈ వైరస్‌తో పోరాడుతున్న తన సొంత దేశాన్ని ఆదుకునేందుకు నెయ్‌మార్ ఏకంగా రూ.7.64 కోట్ల భారీ విరాళం అందజేసినట్టు స్థానిక టీవీ నెట్‌వర్క్ ఎస్‌బీటీ వెల్లడించింది. ఈ విరాళంలో భాగంగా కొంత మొత్తం అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి (యునిసెఫ్)కి, మిగతాది తన స్నేహితుడు లూసియానో హక్ నిర్వహిస్తున్న చారిటబుల్ ట్రస్ట్‌కు ఇచ్చాడు. ప్రపంచవ్యాప్తంగా మూడో అత్యధిక పారితోషికం అందుకునే సాకర్ ప్లేయర్‌గా ఖ్యాతికెక్కిన నెయ్‌మార్.. ఇటీవల తన లగ్జరీ విల్లాలోని బీచ్ వాలీబాల్ కోర్టులో స్నేహితులతో కలిసి సరదాగా గడుపుతున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి విమర్శల పాలయ్యాడు. ఓవైపు ప్రపంచమంతా కరోనా వైరస్ ధాటికి విలవిల్లాడుతుంటే.. ఇవేమీ పట్టించుకోకుండా నెయ్‌మార్ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ బిజీగా ఉన్నాడంటూ నెటిజన్లు కడిగిపారేశారు.

## ఇంగ్లండ్ క్రికెటర్ల వితరణ

***లండన్:*** *ఇంగ్లండ్‌ను చావుదెబ్బ తీస్తున్న కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఆ దేశ పురుషుల, మహిళా క్రికెటర్లు ముందుకు వచ్చారు. దీంట్లో భాగంగా తమ మూడు నెలల వేతనాల్లో 20 శాతం కోత విధించుకోనున్నారు. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఇటీవల చేసిన ఈ ప్రతిపాదనకు ఆటగాళ్లు అంగీకరించారు. ఇక పురుషుల జట్టుకు సంబంధించి ఈ మొత్తం 5 లక్షల పౌండ్లు (రూ.4 కోట్ల 69 లక్షలు) కానుంది. 'ఇంగ్లండ్ సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్లతో జరిగిన సమావేశం తర్వాత వారంతా 0.5 మిలియన్ పౌండ్లను విరాళంగా ఇచ్చేందుకు అంగీకరించారు' అని ఈసీబీ ఓ ప్రకటనలో తెలిపింది. పురుషుల, మహిళల క్రికెటర్ల ఏప్రిల్, మే, జూన్ వేతనాల్లో కోత పడనుంది.*

## వేలంలో అక్రమ్ బ్యాట్, బాల్



***కరాచీ:*** *కరోనా వైరస్ నివారణ చర్యల్లో భాగంగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్, ఇంగ్లండ్ మాజీ పేసర్ డారెన్ గాఫ్ నిధుల సేకరణకు తోడ్పడ్డారు. ఓ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన వేలంలో పాక్ నుంచి టెస్టు, వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన అక్రమ్ సంతకంతో కూడిన బ్యాట్, బాల్‌కు 150 డాలర్ల (రూ. 11,462) ధర పలికింది. అలాగే గాఫ్ సంతకం చేసిన బంతికి 50 డాలర్లు (రూ. 3800) లభించాయి. ఇక.. ఇదే వేలంలో స్విమ్మింగ్ దిగ్గజం మైకేల్ ఫెల్ప్స్ సంతకంతో కూడిన స్విమ్ సూట్ 1490 డాలర్ల (రూ. లక్షా 13 వేలు) ధర పలకడం విశేషం.*

## మాస్టర్ క్రమశిక్షణకు ఆ '241' నిదర్శనం



**న్యూఢిల్లీ:** బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో అద్భుత ఇన్నింగ్స్ కనిపిస్తాయి. అయితే ఆసీస్ పర్యటనలో అతడు చేసిన డబుల్ సెంచరీ అత్యంత క్రమశిక్షణతో కూడినదని విండీస్ గ్రేట్ బ్రయాన్ లారా అభిప్రాయపడ్డాడు. '16 ఏళ్ల వయస్సులో టెస్టుల్లో అరంగేట్రం చేసిన క్రికెటర్ ఆ తర్వాత 24 ఏళ్లపాటు కొనసాగడం మామూలు విషయం కాదు. సచిన్ తన కెరీర్‌లో ఎన్నో మరపురాని ఇన్నింగ్స్ ఆడి ఉండొచ్చు. కానీ సిడ్నీ మైదానంలో అతడు అజేయంగా సాధించిన 241 పరుగులు మాత్రం అత్యంత క్రమశిక్షణ, అంకితభావం కారణంగా వచ్చినవి. ఇప్పుడీ కరోనాను ఎదుర్కొనేందుకు కూడా అలాంటి పట్టుదలే కావాలి' అని లారా ఇన్‌స్టాగ్రామ్‌లో పిలుపునిచ్చాడు. 2004 టూర్‌లో సచిన్ ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడ్డాడు. అతడిని అవుట్ చేసేందుకు ఆసీస్ బౌలర్లు కవర్ డ్రైవ్ ఆడేలా ఊరిస్తూ దెబ్బతీశారు. కానీ చివరి టెస్టులో మాత్రం ఒక్కసారి కూడా అలాంటి షాట్లకు వెళ్లకుండా ఏకాగ్రతతో ఆడి ద్విశతకంతో సత్తా చాటుకున్నాడు.

## ఆ ఇద్దరు.. అత్యుత్తమ టీ20 ఓపెనర్లు



**న్యూఢిల్లీ:** రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్ ప్రపంచ అత్యుత్తమ టీ20 ఓపెనర్లుగా ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ టామ్ మూడీ పేర్కొన్నాడు. ప్రముఖ కోచ్‌గా, వ్యాఖ్యాతగా పేరుపొందిన మూడీ.. ట్విటర్ వేదికగా క్రికెట్ అభిమానులతో ముచ్చటించాడు. ఈ సందర్భంగా తన ప్రపంచ అత్యుత్తమ టీ20 ఓపెనర్లు ఎవరో చెప్పాలని నెటిజన్లు టామ్‌ను అడిగారు. 'రోహిత్, వార్నర్ ఓపెనర్లుగా ఉంటే ఎంతో సంతోషిస్తా' అని బదులిచ్చాడు. కోహ్లీని తన ఫేవరెట్ భారత క్రికెటర్‌గా పేర్కొన్న మూడీ.. అభిమాన ఐపీఎల్ జట్టు చెన్నై, ఫేవరెట్ కెప్టెన్ ధోనీ అని తెలిపాడు.

## ఇంట్లో ఉంటేనే గెలిచినట్టు..



**న్యూఢిల్లీ:** కొవిడ్-19పై పోరులో గెలవాలంటే ప్రజలంతా ఇంట్లోనే ఉండాలని టెస్టు బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజార సూచించాడు. 'లాక్‌డౌన్ సమయంలో చాలా మంది ఇళ్లకే పరిమితమైనా కొందరు మాత్రం వైరస్‌ను తేలిగ్గా తీసుకుంటున్నారు. ఇప్పుడు ప్రతీ ఒక్కరు సైనికుల్లాంటివారే. దేశం తరఫున యుద్ధం చేయాలంటే మీరు ఇంట్లో ఉంటే చాలు. అలాగైతేనే కరోనాను అధిగమిస్తాం' అని పుజార స్పష్టం చేశాడు.

## గ్రామాల్లోనే వ్యవసాయ ఉత్పత్తులు కొనండి

**రైతు పక్షాన నిలిచి న్యాయం చేయండి.. గవర్నర్ ఆదేశం**



అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతు పక్షాన నిలబడి వారికి న్యాయం చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ప్రక్రియను గ్రామాల్లోనే చేపట్టాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆదేశించారు. రాష్ట్రంలో ధాన్యం క్రయ విక్రయాలకు సంబంధించి ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకూడదని అన్నారు. ఈ మేరకు శనివారం మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను రాజ్‌భవన్‌కు పిలిపించి సమీక్షించారు. లాక్‌డౌన్ నేపథ్యంలోను వ్యవసాయ పనులు ఆగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఆహార ధాన్యాల ఉత్పత్తికి అవాంతరం ఏర్పడితే పలు ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.

## భౌతిక దూరమా.. ఏదీ.. ఎక్కడా?



ఒంగోలు కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్‌లో శనివారం కనిపించిందీ దృశ్యం. కరోనా నేపథ్యంలో ప్రజలు భౌతిక దూరం పాటించాలని ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా.. తాత్కాలిక ఏఎన్ఎం పోస్టుల భర్తీకి అధికారులు ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసి.. కనీస జాగ్రత్తలు కూడా తీసుకోలేదు. ఆ ప్రాంగణంలో నిరుద్యోగులు గుంపులుగుంపులుగా కనిపించడంపై విమర్శలు వినిపించాయి. అలాగే, ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రూ.1000 పంపిణీ తదితర కార్యక్రమాల్లో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు, ఆధికార పార్టీ నేతలు కార్యర్తలతో గుంపులు గుంపులుగా పాల్గొనడం కనిపించింది. వై.పాలెంలో మంత్రి సురేశ్, ముండ్లమూరులో మండలం వేములలో దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్, అద్దంకి సెగ్మెంట్‌లో ఆ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య, అలాగే పలుచోట్ల అధికారపార్టీ నేతలు, కార్యకర్తల గుంపులుగా పర్యటించడంపై విమర్శలొచ్చాయి. **- ఒంగోలు**

## లాక్‌డౌన్ ఉల్లంఘించిన పాస్టర్లపై కేసు



టౌన్ పోలీసు స్టేషన్ వద్ద పాస్టర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రఘు

తాడేపల్లిగూడెం క్రైం, ఏప్రిల్ 4: ఢిల్లీ మర్కజ్ సమావేశం లింకులతో రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మతపరమైన సమావేశాలను ప్రభుత్వం నిషేధించింది. అయితే లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఓ చర్చిలో 49 మంది పాస్టర్లు సమావేశం అవ్వడంపై పోలీసుల దృష్టి పడింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు.

## వలస కార్మికుల వసతికి 294 కేంద్రాలు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో 294 వసతి కేంద్రాలను నెలకొల్పినట్లు రాష్ట్ర సమన్వయకర్త, ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శనివారం తెలిపారు. ఈ కేంద్రాల్లో 17,475 మంది నిరాశ్రయులు, వలసకార్మికులకు వసతితోపాటు ఆహారం, వైద్యసదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్‌జీఓలు మరో 36 కేంద్రాలు ఏర్పాటుచేసి 4,142 మందికి వసతి కల్పిస్తున్నాయని వివరించారు. కంపెనీలు 19,207 మందికి తక్షణ వసతి కల్పించి ఆహారం అందిస్తున్నాయని చెప్పారు.

## పోలీసులకు 50 వేల మాస్కులు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): లాక్ డౌన్ విధులు నిర్వర్తిస్తోన్న పోలీసులకు 50 వేల మాస్కులు డీజీపీ కార్యాలయం సరఫరా చేసింది. దాతల సహకారంతో పోలీసులకు వీటిని సరఫరా చేస్తున్నట్లు డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. మొదటి ప్రాధాన్యం 4 వేల మంది మహిళా పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు ఇస్తున్నామని చెప్పారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం భారీగా మాస్కులు విరాళంగా ఇచ్చిన స్పిన్ టెక్స్ సంస్థకు డీజీపీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ‘కరోనా’ విధుల్లోని అందరికీ జీతాలివ్వాలి

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది మాదిరిగానే రాష్ట్రంలో కరోనా నియంత్రణ డ్యూటీలో ఉన్న అందరికీ పూర్తి జీతాలు ఇవ్వాలని యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి.బాబురెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులతోపాటు కరోనా విధుల్లో పాలుపంచుకుంటున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు, పీఈటీలకు, పీడీలకు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, గ్రామ సచివాలయ వలంటీర్లకు పూర్తి జీతాలు చెల్లించాలని కోరుతూ సీఎంకు లేఖ రాశారు.

## ఆన్‌లైన్‌లో జేఈఈ, నీట్ మాక్ టెస్టులు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ కొనసాగుతున్న తరుణంలో ఇంటి వద్ద విద్యార్థులు ప్రిపరేషన్, ప్రాక్టీస్ కోసం ఐఐటీ-జేఈఈ ఫోరం-ప్రముఖ ఐఐటి, నీట్ శిక్షణా సంస్థలు సంయుక్తంగా రూపొందించిన జేఈఈ, నీట్ మోడల్, మాక్ టెస్ట్‌లను ఆన్‌లైన్‌లో విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం కన్వీనర్ కె.లలిత్ కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9849016661కు 'online Test' అని టైప్ చేసి వాట్సాప్ మెసేజ్ చేయాలని ఆయన కోరారు.

## జన్‌ధన్ ఖాతాల్లో రూ.500 జమ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కరోనా రిలీఫ్ ప్యాకేజీ ఫలాలు పేదలకు అందుతున్నాయి. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖా తాలున్న లబ్ధిదారుల కు 3 నెలల పాటు రూ.500 వంతున రూ.1500లు జమచేస్తారు. రాష్ట్రంలో జన్‌ధన్ యోజన అక్కౌంట్ కలిగిన లబ్ధిదారులు 1.04 కోట్ల మంది ఉన్నారు. 51.63 లక్షల మంది గ్రామీణ ప్రాంత వాసులు కాగా, మరో 52.87 లక్షల మంది పట్టణాల్లో ఉన్నారు. తొలివిడతగా శుక్రవారం నుంచి రూ. 522.58 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నారు.

## ఏపీకి కరోనా వైద్య సామగ్రి దిగుమతి



రాష్ట్రానికి చేరిన కరోనా హెల్త్ కార్టన్స్

విజయవాడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో, కొద్ది రోజులుగా వెలవెలబోయిన విజయవాడ విమానాశ్రయం ప్రస్తుతం కార్గో విమానాలతో కొంత సందడిని సంతరించుకుంది. శనివారం ఎయిర్ ఇండియా తన కార్గో సేవలను ప్రారంభించింది. కరోనా నివారణకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కోసం ముంబై నుంచి ఎయిర్ ఇండియా 68 కార్టన్ల వైద్య ఎక్విప్‌మెంట్‌ను తీసుకువచ్చింది. రాష్ట్రంలోని ఐసోలేషన్ వార్డుల్లో చికిత్స అందించే వైద్య సిబ్బందికి అందించే అత్యున్నతమైన ఎన్ 95 మాస్కులు, స్టేషనరీ ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది.







## రైతు కష్టం నేలపాలు

కరోనా ప్రభావం రాష్ట్రంలో వ్యసాయ రంగంపైనా పడింది. వివిధ పంటలు కనీసం కోత, సేకరణకు కూడా నోచక పంట చేలలోనే కుళ్లి పాడైపోతున్నాయి. ఈ చిత్రాలు అవే. మొదటిది... కర్నూలు జిల్లా గార్గేయపురంలో రవాణా లేక, కొనుగోలుదారులు రాక, క్యాబేజీ పంటను వృథాగా వదిలేశారు. రెండోది.. కృష్ణా జిల్లా పెనమలూరు ప్రాంతంలో కాయలు ముదిరిపోతున్నా అరటి గెలలు కోతకు నోచుకోవడంలేదు. ఇక మూడోది.. గుంటూరు జిల్లా దుర్గి, వెల్దుర్తి మండలాల్లో సుమారు 300 ఎకరాల్లో బొప్పాయి కోతకు వచ్చినా లాక్‌డౌన్ నేపథ్యంలో ఎగుమతులు లేకుండా పోయాయి. పండ్లు పక్వానికి వచ్చినా సేకరించకపోవడంతో ఇలా నేలపాలవుతున్నాయి.

# పిల్లలపైనా పంజా

(మొదటి పేజీ తరువాయి)

బాలికలకు కూడా కరోనా సోకింది. ఇంత చిన్నపిల్లలకు ఈ వైరస్ సోకడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి. ఢిల్లీ సమావేశాలకు వెళ్లి వచ్చిన కుటుంబ సభ్యుడి నుంచి వీరందరికీ వైరస్ సంక్రమించింది. మర్కజ్ నుంచి వస్తున్న ప్రయాణికులతో కలిసి ఢిల్లీ నుంచి రైలులో ప్రయాణించిన గుంటూరు వ్యాపారికీ వైరస్ సోకింది. మరో బాధితుడు ఢిల్లీ వెళ్లనప్పటికీ పక్కింట్లో నివసిస్తున్న వ్యక్తి కారణంగా కరోనా బారిన పడ్డారు. వీరితో పాటు మాచర్లకు చెందిన మహిళకు, మంగళగిరికి చెందిన మరో మహిళకు, చేబ్రోలు మండలంలో ఒకరికి వ్యాధి సోకింది. కృష్ణాజిల్లాకు చెందిన 9మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో ఈ జిల్లాలో మొత్తం కేసుల సంఖ్య 32కు చేరింది. తాజాగా పాజిటివ్ వచ్చిన వారిలో ఒకరు తప్ప అందరూ ఢిల్లీ సమావేశాలతో సంబంధం ఉన్నవారేనని తేలింది. కడపలో ఇద్దరు, బద్వేలులో ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయింది. జిల్లాలో ఇప్పటివరకూ 23 కేసులు నమోదయ్యాయి. వీరిలో 17 మందికి ‘ఢిల్లీ కనెక్షన్’ ఉందని గుర్తించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో 2, చీరాలలో ఒకటి, కారంచేడు మండలం కుంకలమర్రులో మరొకటి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరందరూ ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రార్థనలకు వెళ్లి వచ్చినవారితో సన్నిహితంగా ఉన్నవారే. ఢిల్లీ పర్యటనకు వెళ్లి వచ్చిన కర్నూలు జిల్లా వాసులు ముగ్గురికి కరోనా సోకింది. చిత్తూరు జిల్లా తిరుపతిలో ఓ మహిళ(39)కు కరోనా నిర్ధారణ అయింది. ఓ వామపక్ష నాయకుడి కుటుంబానికి చెందిన ఈమె మార్చి 16న తిరుపతి నుంచి రైల్లో హైదరాబాద్ వెళ్లి అక్కడినుంచి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలో సన్నిహితుల ఇంట వేడుకలకు కుటుంబంతో సహా హాజరయ్యారు. 19న ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి తిరుపతి చేరుకున్నారు. ఈ నెల 1న వైద్యసిబ్బంది వారందరి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. ఆ మహిళను రుయా ఆస్పత్రికి, ఆమె కుటుంబ సభ్యులతో పాటు వారిని కలిసిన 28మందిని క్వారంటైన్‌కు తరలించారు. బాధిత మహిళ ప్రయాణించిన బోగీలో జమాత్ సభ్యులెవరూ ప్రయాణించలేదని చెబుతున్నారు.

**జిల్లాల వారీగా కేసుల వివరాలు...**

| | |
|---|---|
| గుంటూరు | 30 |
| కడప | 23 |
| ప్రకాశం | 21 |
| కృష్ణా | 32 |
| పశ్చిమ గోదావరి | 15 |
| విశాఖపట్నం | 15 |
| తూర్పు గోదావరి | 11 |
| చిత్తూరు | 10 |
| నెల్లూరు | 32 |
| అనంతపురం | 3 |
| కర్నూలు | 4 |
| మొత్తం | 196 |

### 200కు చేరువలో...

దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో కరోనా కేసులు 200 దాటాయి. ఏపీలో వీటి సంఖ్య 196కు చేరింది. మార్చి 30వరకూ రాష్ట్రంలో పాజిటివ్‌లు 23 మాత్రమే. 31నాటికి ఆ సంఖ్య 44కు, ఏప్రిల్ 1కి 111కు చేరింది. అంటే కేవలం 24 గంటల వ్యవధిలో 88 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఏప్రిల్ 2 నాటికి 149, ఏప్రిల్ 3 నాటికి 164, ఏప్రిల్ 4 సాయంత్రానికి 196 కేసులకు చేరాయి. దీని ప్రకారం మార్చి 31నుంచి ఏప్రిల్ 4లోపు 173 పాజిటివ్‌లు నమోదయ్యాయి. కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో రోజూ 5 నుంచి 10 వరకూ కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గుంటూరు, కడప, ప్రకాశం జిల్లాలు కూడా డేంజర్ జోన్‌లోనే ఉన్నాయి. ఇక కరోనా బారిన పడి కోలుకున్న వారి సంఖ్య ఐదుకు చేరింది.

### మార్చి 30నుంచి బీమా

కరోనాపై పోరాడుతున్న వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు ప్రధాని గరీబ్ కల్యాణ్ ప్యాకేజీ బీమా కింద రూ. 50లక్షల బీమా సౌకర్యం మార్చి 30 నుంచి అమలులో కి వస్తుందని ఆరోగ్యశాఖ పేర్కొంది. 90రోజుల కాలానికి ఈ బీమా వర్తిస్తుందని తెలిపింది. కాగా, వీరికి భవిష్యత్తు నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

## మరో ఇద్దరు బలి!

**కృష్ణా జిల్లాలో 45 ఏళ్ల వ్యక్తి.. అనంతలో 60ఏళ్ల వృద్ధుడు!**

**కరోనా లక్షణాలతో ఇంకొకరి మృతి**

విజయవాడ/అనంతపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా కాటుకు శనివారం ఒక్కరోజే ఇద్దరు బలయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం, అనంతపురం జిల్లాలో హిందూపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ‘కొవిడ్-19’తో మరణించారు. ఇక... విజయవాడ నగరానికి చెందిన మరో వ్యక్తి... కరోనా లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన కొన్ని గంటలకే చనిపోయారు. అయితే, ఇది కరోనా మరణమని అధికారులు ధ్రువీకరించలేదు.

కృష్ణా జిల్లా మచిలీపట్నం చిలకలపూడికి చెందిన 45 సంవత్సరాల వ్యక్తి వ్యాపార పనులపై బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లి వస్తుండేవారు. కొన్నాళ్లుగా దగ్గు, ఆయాసంతో బాధపడుతుండటంతో... స్థానికంగా ఒక వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్నారు. మందులు వాడినా నయం కాకపోవడం, కరోనా లక్షణాలు కనిపించడంతో ఈ నెల 1న మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు ఆయనను ఐసోలేషన్ వార్డులో ఉంచి, నమూనాలను పరీక్షకు పంపారు. శనివారం పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో మెరుగైన చికిత్స కోసం ఉదయం 11 గంటల ప్రాంతంలో విజయవాడ కొవిడ్-19 ఆసుపత్రికి తరలించారు. శనివారం సాయంత్రం ఆయన మృతి చెందారు. ఈయనకు చికిత్స చేసిన ప్రైవేటు వైద్యుడు తన నమూనాలను ఇచ్చి, హోం క్వారంటైన్‌లోకి వెళ్లిపోయారు.

### మక్కాకు వెళ్లి వచ్చిన వారితో..

అనంతపురం జిల్లాలో తొలి కరోనా మరణం నమోదైంది. హిందూపురానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తి శనివారం మరణించారు. మక్కాకు వెళ్లొచ్చిన సమీప బంధువుతో సన్నిహితంగా ఉన్న ఈయన, గత నెల 31న కరోనా లక్షణాలతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఆయనకు వైరస్ సోకినట్లు శుక్రవారం నిర్ధారణ అయ్యింది. చికిత్స చేస్తుండగానే.. శనివారం ఆయన మరణించారు.

విజయవాడ భవానీపురం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి(56) శనివారం తీవ్రమైన దగ్గు, ఆయాసంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో చేరిన కొద్ది గంటలకే ఆయన మృతి చెందారు. కరోనా లక్షణాలు ఉండడంతో వైద్యులు ఆయన నమూనాలను పరీక్షకు పంపారు.

## కోరలు చాచిన మహమ్మారిపై.. ఒట్టి చేతులతో పోరాటమా!

**బ్లీచింగ్, మాస్కులకూ నోచని పంచాయతీలు**

**గ్రామాల్లో పారిశుధ్య పనులకు నిధులేవీ?**

**ఆర్థికసంఘం నిధులొచ్చినా సీఎఫ్ఎంఎస్‌లో ఆటంకాలు**

**భయాందోళనలో క్షేత్రస్థాయి సిబ్బంది**

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారిపై పోరాటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించాయి. కేంద్రం భారీగా నిధులు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు చెప్తోంది. అయితే తాము ఒట్టి చేతులతో ఆయుధం లేని పోరాటం చేయాల్సి వస్తోందని గ్రామ సచివాలయాల సిబ్బంది వాపోతున్నారు. కరోనా కరాళ నృత్యం చేస్తున్న తరుణంలో గ్రామ పంచాయతీలకు పైసా కూడా ఇవ్వకుండా ఉచిత సలహాలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు రాక, ఇప్పటికే పనులు చేసిన మాజీ సర్పంచులు అప్పుల పాలై ఉన్నారు. ఏవో కొన్ని మేజర్ పంచాయతీలకు తప్ప చిన్న పంచాయతీలకు ఆదాయాలు లేనందున జనరల్ ఫండ్ కింద నిధులు సమకూరే పరిస్థితి లేదు. ఇటీవల 14వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు కొంత జమయ్యాయి. అయితే సీఎఫ్ఎంఎస్‌లో ఆటంకాల కారణంగా వాటిని డ్రా చేసుకునే పరిస్థితి లేదని కార్యదర్శులు వాపోతున్నారు. సైడు కాలువల నిర్మాణం, డ్రైన్ల శుభ్రతకు మాత్రమే 14వ ఆర్థిక సంఘం నిధులను వాడుకోవాలని నిబంధనలు ఉన్నాయని, దీంతో పారిశుధ్యానికి ఆ నిధులు ఖర్చు చేసే వీలులేదంటున్నారు. కరోనాపై అవగాహన కల్పించాల్సిన పంచాయతీ సిబ్బంది మాస్కులు, గ్లౌజ్‌లు కూడా లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు. ఇటీవల ఒక్కో వలంటీర్‌కు ఒక్కో మాస్క్ ఇచ్చి, మమ అనిపించారు. ప్రతి 5గంటలకు ఒక మాస్క్ మార్చాలని ఓ వైపు చెప్తున్న ప్రభుత్వమే, సిబ్బందికి మాస్కులు సరఫరా చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మరోవైపు గ్రామ సచివాలయ వ్యవస్థతో సిబ్బంది సంఖ్య పెరిగిందే తప్ప ప్రజలకు సౌకర్యాలు పెరగలేదన్న ఆరోపణలొస్తున్నాయి. నిధుల లేమితో కొన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లే పరిస్థితి లేదంటున్నారు. కరోనా నేపథ్యంలో బ్లీచింగ్ బస్తా ధర కూడా రూ.1000కు పెరిగింది.

ఆయుధాలు లేకుండా కరోనాపై పోరాటం చేయాల్సి వస్తోందని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. 28వేల మందికి పైగా ఎన్ఆర్ఐలు రాష్ట్రానికి వచ్చారని ప్రభుత్వమే చెబుతోంది. వారిలో ఎక్కువమంది గ్రామాల నేపథ్యం ఉన్నవారే. వారిని కలిసిన అందరినీ సెల్ఫ్ క్వారంటైన్ చేయాల్సిన పరిస్థితి ఉంది. అలాంటివారిని కలవడానికి సిబ్బంది భయపడుతున్నారు. దీనివల్ల తమకూ ఆ మహమ్మారి సోకుతుందన్న భయం ప్రతి ఒక్కరిలో ఉంది. అలాంటి పరిస్థితుల్లోనూ కనీసం మాస్కులు, గ్లౌజ్‌లు లేక నిస్సహాయ స్థితిలో పంచాయతీలున్నాయి. దీంతో వలంటీర్లు ఆ కుటుంబాలను సందర్శించే పరిస్థితి లేదని, అందువల్ల గ్రామాల నుంచి ప్రభుత్వానికి ఇచ్చే సమాచారంలో వాస్తవాలు ప్రతిబింబించే అవకాశం ఉండదని పలువురు అధికారులే పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి పకడ్బందీ ప్రణాళికలతో గ్రామ సచివాలయ సిబ్బందిని కరోనా వ్యాప్తి నివారణకు వినియోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మాట వింటే మనకే మేలు

**ఈ మహమ్మారికి మందు లేదు**

**వైద్యులకు సహకరించడమే దారి**

**కరోనాను జయించి బయటపడిన**

**విజయవాడ యువకుడి కథనం**

విజయవాడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో తొలి పాజిటివ్ ఆ యువకుడిదే! విదేశాల నుంచి వచ్చిన ఈ యువకుడు...స్వీయ నిర్బంధంలో ఉండాలన్న వైద్యుల సూచనను సంతోషంగా పాటించారు. పాజిటివ్‌గా తేలినా వారు సూచించినట్టు 14 రోజులు క్వారంటైన్‌లో ఉండి పూర్తి ఆరోగ్యంతో శనివారం డిశ్చార్జి అయ్యారు. తాను సాధించిన విజయాన్ని ‘ఆంధ్రజ్యోతి’తో పంచుకొన్నారు. ‘నేను పారిస్ నుంచి గతనెల 16న ఢిల్లీకి చేరుకున్నాను. 17న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి క్యాబ్‌లో విజయవాడలో మా ఇంటికి వచ్చాను. జిల్లా అధికారులు..14 రోజుల పాటు హోం ఐసోలేషన్‌లోనే ఉండాలని సూచించారు. ఇంట్లో ఉండగా జ్వరం రావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్ అని తేలింది. కుటుంబ సభ్యులకు నెగెటివ్ రావడంతో ఇంటికి పంపేశారు. నన్ను ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందించారు. చికిత్స కాలంలో రెండుసార్లు పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ రిపోర్టులు వచ్చాయి. ఈ వైరస్‌ను చాలా సులువుగా జయించవచ్చు. దీనికి మందు లేదు. నివారణే మార్గం. ధైర్యంగా ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకుంటే నయమవుతుంది. అందుకు నేనే నిదర్శనం. వైరస్ లక్షణాలతో బాధపడుతున్న వారు బాధ్యతగా వ్యవహరించాలి. పారిస్ నుంచి వచ్చిన తర్వాత నేను ఒక్కరోజు కూడా బయటకు వెళ్లలేదు. అయితే సోషల్ మీడియాలో దానికి భిన్నంగా కథనాలు రావడం బాధించింది’ అని ఆవేదన వ్యక్తం చేశాడు.

## సీఎం జగన్ వీడియో సందేశం



‘కరోనా బాధితులను వేరుగా చూడకూడదు. మనం ఈ సమయంలో వారి మీద ఆప్యాయత చూపాలి. దురదృష్టవశాత్తూ జరిగిన ఈ సంఘటనను పలానా మతంవారి మీద.. మనవారి మీద ఒక ముద్ర వేయడానికి ఎవరూ వాడుకోవద్దు. ఇది ఏ మతస్థులకైనా జరిగే అవకాశం ఉన్న సంఘటనగానే భావించాలి’

**- ముఖ్యమంత్రి జగన్**

## ఆదర్శంగా నిలుద్దాం

**కరోనాపై ఐక్యంగా పోరాడి దేశానికే గొప్ప సందేశమిద్దాం**

**మెడికల్, పోలీసు, పారిశుద్ధ్య శాఖ సేవలు భేష్.. వారికి పూర్తి వేతనం**

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కరోనాపై యుద్ధంలో అందరమూ ఐక్యంగా, ఆదర్శంగా పోరాడాలని ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం రాత్రి 9గంటలకు అందరూ దీపాలు వెలిగించి ఐక్యంగా పోరాడుతున్నామనే గొప్ప సందేశం ఇద్దామని రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి శనివారం వీడియో సందేశం ఇచ్చారు. ఇందులో... ‘ఢిల్లీలో జరిగిన ఆధ్యాత్మిక సదస్సుకు హాజరైన వారిలో ఎక్కువమంది కరోనా బారిన పడ్డారు. ఈ ఆధ్యాత్మిక సంఘటనకు సంబంధించి ప్రత్యేకంగా వచ్చిన విదేశీ ప్రతినిధుల్లో కొందరికి కరోనా ఉండడం, ఆ మీటింగ్‌కు వెళ్లిన మనరాష్ట్రం వారికి కూడా సోకడం దురదృష్టకరమైన పరిణామం. ఇదే సంఘటన ఏ మతానికి సంబంధించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలోనైనా జరగవచ్చు. రవిశంకర్ గారి ఆర్ట్ ఆఫ్ లివింగ్ గానీ, జగ్గీ వాసుదేవ్ గారి ఈషా పౌండేషన్‌లోగానీ, మాత అమృతానందమయ సభల్లోగానీ, ఒక పాల్ దినకరన్ గారి ఆధ్యాత్మిక కార్యక్రమంలోగానీ, జాన్ వెస్లీగారు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలోగానీ ఎవరైనా పాల్గొనవచ్చు. ఎవరికైనా ఈ పరిస్థితి రావచ్చు. ఎక్కడ జరిగినా అది ఒక దురదృష్టకర సంఘటనగానే చూడాలి. ఒక మతానికో, కులానికో ఆపాదించి వారేదో తప్పు చేసినట్లుగా, నేరం చేసినట్లుగా, ఉద్దేశపూర్వకంగా చేసినట్లుగా చూపడం, చూపే ప్రయత్నం చేయకూడదు. బాధితులపట్ల ఆప్యాయత చూపాలి. కరోనాకు కులాలు, మతాలు, ప్రాంతాలు లేవు. అందరమూ ఐక్యంగాపోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం. మోదీ కూడా ప్రధాని హోదాలో ఈ మేరకే పిలుపు ఇచ్చారు. చీకటి నింపుతున్న కరోనా మీద దివ్వెలు, దీపాలు, కొవ్వొత్తులు, టార్చ్‌లైట్లు, సెల్ ఫోన్ లైట్ల వెలుగులు వేసి అసలైన వెలుగుకు అర్థం తేవాలి’ అని సీఎం పిలుపునిచ్చారు. కరోనా లాంటి వైరస్ వచ్చి విడిదీసే పరిస్థితిలోకి మనం పోకుండా ఉండాలని సూచించారు.

### వారికి ప్రేరణగా పూర్తి జీతం

‘ఇతర శాఖల ఉద్యోగులను ఒప్పించి జీతాలు వాయిదా వేశాం. కానీ ముందు వరుసలో ఉంటూ కరోనా వైరస్ మీద యుద్ధం చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు విభాగం, పంచాయతీ, మునిసిపల్ శాఖలోని పారిశుద్ధ్య కార్మికులకు ప్రేరణ ఇచ్చేలా.. ఈ నెల పూర్తి జీతం ఇస్తున్నాం’ అని జగన్ ఈ సందర్భంగా ప్రకటించారు.

## మానవ సంబంధాలు మృగ్యం

**ఆస్పత్రుల్లో టపటపా రాలుతున్న ప్రాణాలు**

**కడచూపునకూ నోచుకోని కుటుంబ సభ్యులు**

**ఆవేదన కలిగిస్తున్న ఎన్నారై వైద్యురాలి లేఖ**



గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 4: కరోనా రక్కసి అమెరికాను అతలాకుతలం చేసేస్తోంది. ఇక్కడ బాధితుల సంఖ్య 2లక్షలు దాటేసింది. ముఖ్యంగా న్యూయార్క్ నగరంపై కరోనా రక్కసి తీవ్రంగా దాడి చేస్తోంది. వయసు పైబడిన వృద్ధులు నిస్సహాయంగా ప్రాణాలు విడుస్తున్నారు. అయితే కుటుంబ సభ్యులు సైతం వారిని అక్కడే వదిలేసి వెళ్లడం కలచివేస్తుంది. కరోనా మహమ్మారి మానవ సంబంధాలను ఎలా చిదిమేస్తోందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. గుంటూరు జిల్లాకు చెందిన వైద్యురాలు ఆలపాటి అనూహ్య ప్రస్తుతం న్యూయార్క్‌లోని బ్రాన్స్ కేర్ హెల్త్ సిస్టమ్‌లో ఫెలోషిప్ చేస్తున్నారు. టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కుమార్తె అయిన అనూహ్య ఇటీవల రెసిడెన్సీ పూర్తిచేసి ప్రస్తుతం ఎమర్జెన్సీ వార్డులో కరోనా రోగులకు చికిత్స అందిస్తున్నారు. న్యూయార్క్‌లో కరోనా మహమ్మారి విలయ తాండవాన్ని ఆమె తల్లిదండ్రులకు లేఖ రూపంలో తెలియజేశారు.

### ఆ లేఖ ఆమె మాటల్లోనే...

“కరోనా మహమ్మారి వెలుగు చూసిన తర్వాత మానవ సంబంధాల్లో గమనిస్తున్న మార్పులు విస్మయం కలిగిస్తున్నాయి. న్యూయార్క్‌లోని ఆస్పత్రులు కరోనా రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఐసోలేషన్ వార్డు ప్రవేశం ఒకవైపు ప్రయాణంలా మారింది. ఒకసారి ఐసోలేషన్‌లో చేరాక కుటుంబ సభ్యులను కాదుకదా చికిత్స చేస్తున్న డాక్టర్లు, నర్సుల ముఖాలను కూడా చూడలేకపోతున్నారు. చాలా మంది బాధితులు చివరి క్షణాల్లో తమను ప్రేమించేవారిని, కుటుంబసభ్యులను చూడాలని పరితపిస్తున్నారు. అదృష్ట వశాత్తు కోలుకుంటే సంతోషమే.. లేదంటే తమ కుటుంబాన్ని, తమను ప్రేమించే వారిని కడసారి చూడకుండానే తుది శ్వాస విడుస్తున్నారు. రోగుల మనసులోని భావోద్వేగాలు మరణంతో ఒక్కసారిగా మూగబోతున్నాయి. మరో పక్క తమ తండ్రో, తల్లో మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడుస్తున్నా కుటుంబ సభ్యులు మాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోతున్న హృదయ విదారక దృశ్యాలు ప్రతి రోజూ కనిపిస్తున్నాయి. కరోనా మహమ్మారి అంటువ్యాధి కావడమే దీనికి కారణం. విజిటర్లకు ఆస్పత్రిలోకి ప్రవేశం నిషేధం. మనుషుల మధ్య ఉండే ఆప్యాయత, అనురాగం, బంధాలు, అనుబంధాలను కరోనా మహమ్మారి నిర్దాక్షిణ్యంగా కాలరాయడానికి వైద్య సిబ్బంది మౌన సాక్ష్యులుగా నిలిచిపోతున్నారు. బరువెక్కిన హృదయంతో తమ వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తున్నారు.

epaper.andhrajyothy.com

# అమెరికా చరిత్రలో పెద్ద సంక్షోభం


తాళ్లూరి జయశేఖర్

- 1982 తర్వాత ఉద్యోగాల్లో భారీ కోత
- తెలుగువారి కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో.. తానా అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్

(న్యూయార్క్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అమెరికా మొత్తాన్ని చుట్టుముడుతున్న కరోనా వైరస్ దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా సంక్షోభాన్ని సృష్టిస్తుందని తానా అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ తెలిపారు. కొవిడ్-19 కారణంగా అమెరికాలోని 90% ప్రాంతాల్లో లాక్‌డౌన్ జరుగుతోందని, దీంతో 2 కోట్ల మంది ఉపాధి కోల్పోయారని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. 1982లో అమెరికాను కుదిపేసిన ఆర్థిక సంక్షోభం కన్నా ఇది 100% అధిక సంక్షోభాన్ని సృష్టిస్తుందని పేర్కొన్నారు. తాను నివసిస్తున్న న్యూయార్క్‌లో ప్రతి గంటకు వందల కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన 30 మంది ప్రముఖులు ఈ వ్యాధి బారిన పడి మృతి చెందారని, న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యోమో సోదరుడికీ కరోనా సోకిందని వెల్లడించారు. 15% మంది ఫైర్ సిబ్బందికి, 300 మంది పోలీసులకు సైతం కరోనా సోకిందన్నారు.

## న్యూయార్క్, న్యూజెర్సీల్లోనే సగం బాధితులు

అమెరికాలోని లక్షలాది మంది కరోనా బాధితుల్లో న్యూయార్క్, న్యూజెర్సీ రాష్ట్రాల వారే సగం మంది ఉన్నారని జయశేఖర్ చెప్పారు. ఉపాధి కోల్పోయిన వారి కోసం అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన 2.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సాయం కొంత ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. ఉద్యోగం కోల్పోయిన హెచ్1బీ వీసా ఉన్న వారు మరో ఉద్యోగంలో చేరేందుకు గతంలో 60 రోజుల సమయం ఉండేదని, దాన్ని 180 రోజులకు పెంచాలని తానాతో పాటు వివిధ సంస్థల ఆధ్వర్యంలో అమెరికా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించామని చెప్పారు. చిన్న వ్యాపారులకు 10 వేల డాలర్ల ఆర్థిక సాయం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. క్రైస్లర్, బెడ్‌బాత్ వంటి భారీ కంపెనీలు ప్రకటించిన లాక్‌డౌన్‌తో హెచ్1బీ వీసాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని తెలిపారు. కరోనా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు వారి కోసం తానా ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని జయశేఖర్ చెప్పారు. మూసేసిన వివిధ యూనివర్సిటీల్లోని హాస్టల్ విద్యార్థులకు బయట వసతి సౌకర్యం కల్పించామన్నారు. నిధులు సేకరించి అమెరికాతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కరోనా బాధితులను ఆదుకుంటామని చెప్పారు. అమెరికాలో ఆపదలో ఉన్న తెలుగువారు తానా హెల్ప్‌లైన్ 1855-OURTANA నంబరును సంప్రదించాలని జయశేఖర్ సూచించారు.

# తెలంగాణలో కొత్తగా 43 పాజిటివ్‌లు!

హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసుల జోరు తగ్గడం లేదు. శనివారం ఏకంగా 43 కొత్త కేసులు నమోదయ్యాయి. అందులో 34 హైదరాబాద్ నుంచే వచ్చాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే 90 శాతం కేసులు నమోదయ్యాయి. తాజా కేసులన్నీ ఢిల్లీలోని మర్కజ్ మసీదుతో సంబంధం ఉన్న కేసులే. దీంతో రాష్ట్రంలో కేసుల సంఖ్య 272 కు చేరింది. వాటిలో అత్యధిక కేసులు హైదరాబాద్ నుంచే నమోదయ్యాయి. శనివారం మధ్యాహ్నం వరకు నగరంలో 105 కేసులు నమోదయ్యాయి. వరంగల్ అర్బన్‌లో 22 కేసులు, నిజామాబాద్‌లో 18, కరీంనగర్‌లో 17, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 15 చొప్పున కేసులు నమోదయ్యాయి. మొత్తం 21 జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. కేవలం ఐదు రోజుల వ్యవధిలో 190 కేసులు నమోదు కావడం గమనార్హం. కరోనాను నుంచి కోలుకున్న ఒకర్ని శనివారం డిశ్చార్జి చేశారు. ఇప్పటి దాకా 33 మంది డిశ్చార్జ్ అయ్యారు. శనివారం మధ్యాహ్నం వరకు మర్కజ్‌కు వెళ్లి కరోనా పాలైన వారి సంఖ్య 165గా తేల్చారు. వీరి ద్వారా వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు మరో 50 మందికి కరోనా సోకింది. మరో 500మంది నమూనాలను పరీక్షించాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో ఫలితాలు వస్తాయని వైద్యాధికారులు చెబుతున్నారు. మర్కజ్‌కు వెళ్లిన వారిలో 25 శాతం మందికి పాజిటివ్ వస్తోందని నమూనాల బట్టి తేలుతోంది. కాగా, నిమ్స్‌లో మునుపటి మాదిరిగానే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని, నిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. నిమ్స్‌ను నాన్ కొవిడ్ ఆస్పత్రిగా ప్రభుత్వం ప్రకటించింది.

# భారత్‌లో వందకు చేరిన మరణాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశంలో కరోనా మృతుల సంఖ్య మూడంకెల్లోకి మారింది. వైరస్ కారణంగా చనిపోయిన వారి సంఖ్య వందకు చేరింది. శనివారం రికార్డు స్థాయిలో 600పైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసులు 3,600 దాటాయి. మహారాష్ట్రలో ఆరు మరణాలు సహా 145 కొత్త కేసులు రికార్డులకెక్కాయి. మొత్తం కేసులు పెరిగి 635కు చేరగా.. ఉత్తర ప్రదేశ్‌లో 53 కేసులు పెరిగి 227 అయ్యాయి. శనివారం పదిమంది ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా కరోనాతో ఇప్పటివరకు 75 మంది మృతి చెందారని, పాజిటివ్ కేసుల సంఖ్య 3,072 అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీటిలో 30 శాతం కేసులు (1,032) తబ్లీగీ జమాత్‌కు సంబంధించినవేనని పేర్కొంది. ఆ సంస్థ కార్యక్రమాల్లో పాల్గొన్నవారితో పాటు వారిని కలిసిన 22 వేల మందిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపింది. 211 జిల్లాల్లో కరోనా కేసులు ఉద్భవిస్తున్నాయని ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ ప్రకటించారు. లద్దాఖ్‌లో మొత్తం 14 మంది బాధితులకు 9 మంది వ్యాధి నయమైంది. ఢిల్లీలో కేసులు 445కు చేరాయని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి సైతం వైరస్‌కు గురయ్యారు. సీఆర్పీఎఫ్‌లో పనిచేసే వైద్యుడు ఒకరు కరోనాకు గురవడంతో సంస్థ డైరెక్టర్ జనరల్ మహేశ్వరి సెల్ఫ్ క్వారంటైన్‌కు వెళ్లారు.

## కర్ణాటకలో వృద్ధుడి మృతి

కర్ణాటకలో శనివారం 16 మందికి వ్యాధి నిర్ధారణ కావడంతో బాధితుల సంఖ్య 144కు చేరింది. బాగల్కోట్‌కు చెందిన వృద్ధుడి (70) మృతితో రాష్ట్రంలో నలుగురు మరణించినట్లైంది. ఢిల్లీలో మర్కజ్‌కు హాజరై క్వారంటైన్ కానివారిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. లండన్ నుంచి వచ్చిన యువతి (25) ద్వారా ఆమె తండ్రికి, వారి ఇంటి పనిమనిషికి వైరస్ సోకింది. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య 485కి చేరింది. శనివారం ఇద్దరు మరణించారు. మరో 74 మందికి పాజిటివ్ అని తేలింది. వీరిలో 73 మంది ఢిల్లీలో మత పరమైన కార్యక్రమానికి వెళ్లివచ్చిన వారే. రాష్ట్రంలోని మొత్తం బాధితుల్లో 422 మంది ఢిల్లీ నుంచి తిరిగొచ్చిన వారేనని ఆరోగ్యశాఖ కార్యదర్శి బీలా రాజేష్ తెలిపారు.

# ఒక్క రోజే 1,500 మృతులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటిదాకా భావించారు. అయితే, వారు మాట్లాడినప్పుడు పక్కన ఉన్నా, శ్వాస తీసుకొన్నా ఆపదేనని ఆంటోనీ ఫౌచీ అనే శాస్త్రవేత్త ప్రకటించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.దీనిపై అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటన చేశారు. అయితే, తాను మాత్రం మాస్క్ ధరించబోనని చెప్పారు. "వ్యాధుల నియంత్రణ కేంద్రం సూచనల మేరకు అందరూ మాస్కులు పెట్టుకోవాలి. గుడ్డతో తయారుచేసినవి ధరిస్తే సరిపోతుంది. మెడికల్ గ్రేడ్, సర్జికల్‌గ్రేడ్ మాస్కులు మనల్ని రక్షించే వైద్యులు, సర్జన్లు మాత్రమే వాడతారు" అని వివరించారు. కరోనా వైద్యానికి హైడ్రాక్సీ క్లోరోక్విన్ వాడొచ్చునని ట్రంప్ పునరుద్ఘాటించారు. యుద్ధానికి ఏమాత్రం తక్కువగాని ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సైన్యాలను దించకతప్పదని ఆయన తెలిపారు. అమెరికాలో ఈ రోజు వరకు 2,70లక్షల పాజిటివ్ కేసులు నమోదు కాగా, 7 వేల మంది చనిపోయారు. ప్రతి 10 మందికి 9 మంది కట్టడిలో ఉన్నారు.

**జాతి యావత్తు శిరస్సు వంచి..:** కరోనా కేంద్రం చైనా ఈ వైరస్‌తో మరణించిన 3 వేలమందికి 3నిమిషాలు మౌనం పాటించింది. వూహాన్‌లో చనిపోయిన వీరికి జాతి యావత్తు నివాళులర్పించింది. అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా కమ్యూనిస్టు అత్యున్నత నాయకత్వమంతా శిరస్సులు వంచి నివాళులు అర్పించారు. జాతీయ జెండాలను సగంమేర అవనతం చేశారు. కరోనాను ధీరోదత్తం గా ఎదుర్కొన్న 14మంది వైద్య సిబ్బందికి పతకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా ముప్పును తొలిలోనే పసిగట్టి చెప్పినందుకు అధికారుల శిక్షకు గురైన వైద్యు డు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. కరోనాపై పోరులో భాగంగా 46 మంది వైద్య సిబ్బంది, 95 మంది పోలీసు అధికారులు చనిపోయారు. ఆరోగ్య విషాదంపై చైనా జాతీయ సంతాపం ప్రకటించడం ఇదే తొలిసారి. అక్కడ ప్రాణం పోసుకొన్న ఈ మహమ్మారి శనివారం వరకు 11 లక్షలమందికి సోకగా, 60వేలమంది మృత్యువాతపడ్డారు. ఈ మరణాల్లో 40వేలు దాకా యూరప్‌లోనే చోటుచేసుకొన్నాయి. హాట్‌స్పాట్ దేశం స్పెయిన్‌లో 24 గంటల్లోనే 900 మంది చనిపోయారు. ఈ నెల 25 దాకా లాక్‌డౌన్‌ను కొనసాగించాలని స్పెయిన్ నిర్ణయించింది. ఇటలీలో 766 మంది చనిపోయారు. 17 మంది వైద్యుల్లో పాజిటివ్ లక్షణాలు బయటపడ్డాయి. మరికొంత కాలం భౌతిక దూరం పాటించాలని జర్మనీ ఆదేశాలు జారీచేసింది. బ్రిటన్ నులివెచ్చటి వేసవి వాతావరణంలో ఆదివారం గడపాలనే కోరికను విరమించుకోవాలని ఆదేశించింది. అక్కడ ఒక్కరోజే 708 మంది మరణించారు.

**కొత్త తావుల్లో కలకలం..:** పశ్చిమ, తూర్పు యూరప్‌ను చుట్టుబెట్టిన కరోనా ఇప్పుడు సిరియా, లిబియా, యేమెన్ వైపు విస్తరిస్తుండటం పట్ల ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. నిత్య యుద్ధ, హింసాత్మక ఘర్షణలతో నిండిన ఈ దేశాల్లో కరోనా విజృంభిస్తే ఘోర పరిస్థితి తప్పదని ప్రకటించింది. పాకిస్థాన్‌లో పాజిటివ్ కేసులు ఒక్కరోజే 2,708కి చేరాయి. పాక్‌కు 200 మిలియన్ డాలర్లను ప్రపంచ బ్యాంకు మంజూరు చేసింది. ఒకేరోజు 9 పాజిటివ్ కేసులు బయటపడటంతో ఈ నెల 11 వరకు రవాణా బంద్‌కు బంగ్లాదేశ్ పిలుపునిచ్చింది. సింగపూర్‌లో కేసులు 1,114కు చేరాయి. కాగా, అమెరికా, రష్యాల మధ్య కరోనా కారణంగా మరోసారి అగ్గి రాజుకొంది. అత్యవసర మందులు, చికిత్స పరికరాలతో నిండిన విమానం రష్యా నుంచి బుధవారం అమెరికా చేరడంపై రెండు దేశాల మధ్య వివాదం నెలకొంది.

## భారత సంతతి దాతృత్వం

అమెరికాలోని ప్రవాసులు భారత్‌లో కరోనా నిరోధక యత్నాలకు సహకరించాలని నిర్ణయించారు. గుజరాత్ భూకంప బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించిన అమెరికా-ఇండియా ఫౌండేషన్ ఇప్పుడు కూడా ముందుకొచ్చింది. పేదరికంతో బాధపడుతూ కరోనా ప్రమాదం గురించి అవగాహన తక్కువగా ఉండేవారికి , హెల్త్ ఎమర్జెన్సీతో ఆర్థికంగా చితికిపోయినవారికీ అన్ని సేవలు అందిస్తామని సంస్థ సీఈవో నిషాంత్ పాండే తెలిపారు.



# ఇంట్లోనే కరోనా పరీక్ష

- ఖరీదు 2 వేలు.. కచ్చితత్వం 99%
- భారత్‌లో ఇలాంటి కిట్ తొలిసారి

జలుబు, దగ్గు, గొంతునొప్పి.. చాలామందికి అప్పుడప్పుడూ వచ్చేవే! కానీ, ఇప్పుడు ఆ మూడిట్లో ఏదొచ్చినా భయపడే పరిస్థితి!! కరోనాయేమోనని అనుమానించే దుస్థితి. అలాగని ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలంటే అనుమానంగా చూసే పరిస్థితి. ఈ ఇబ్బందులేవీ లేకుండా ఇంట్లోనే ఎవరికి వారు కొవిడ్-19 పరీక్ష చేసుకోగలిగితే? బెంగుళూరుకు చెందిన బయోనీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అలాంటి 'హోమ్ స్క్రీనింగ్ కిట్'ను విడుదల చేసింది. మన దేశంలో ఈ తరహా కిట్‌ను మార్కెట్‌లో ప్రవేశపెట్టడం ఇది తొలిసారి. ఒక వ్యక్తికి కరోనా సోకిందో లేదో కేవలం పది నిమిషాలలో చెప్పే ఈ కిట్ ఖరీదు 2వేల రూపాయలే. ఈ కిట్‌కు సంబంధించిన విశేషాలను బయోనీ కంపెనీ ఫౌండర్ డాక్టర్ సురేందర్ చికారా 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మధుమేహ పరీక్షలు చేసుకోవడానికి అందుబాటులో ఉన్న కిట్లలాగానే ఇదీ పనిచేస్తుంది. ఈ కిట్‌తో పాటు ఒక సూది ఇస్తారు. దాన్ని ఉపయోగించి రక్తాన్ని తీసి కిట్‌పై వేయాలి. వేసిన 10 నిమిషాల్లో.. కరోనా సోకిందీ లేనిదీ తేలిపోతుంది. ఇందులో పాజిటివ్ వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మళ్లీ పరీక్ష చేయించుకోవటం మంచిది. 93-99% కచ్చితత్వంతో ఫలితాలు వస్తాయి.

# కువైత్‌లో పెరుగుతున్న 'కరోనా భారతీయులు'

- కేంద్ర మంత్రి జైశంకర్‌కు కువైత్ మంత్రి ఫోన్
- ప్రత్యేక విమానాలను అనుమతించాలని విజ్ఞప్తి

**గల్ఫ్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి:** కువైత్‌లో కరోనా సోకిన భారతీయుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోతుండటంపై అక్కడి ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. శనివారం వరకు నమోదయిన 479 కేసులలో భారత్‌కు చెందిన 148మంది ఉన్నారు. అక్కడ తొలి మరణం కూడ భారతీయుడిదే కావడంతో కలవరం రేగుతుంది. వీరు ఇరుకైన గదులలో ఉండటంతో వ్యాధి శరవేగంగా వ్యాపిస్తోందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. దీనిపై కువైత్ విదేశీ వ్యవహారాల మంత్రి షేఖ్ అహ్మద్ నాసర్ అల్ సబా మన విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. వీలయినంత త్వరగా ప్రత్యేక విమానాలను అనుమతించాలని కోరినట్లు సమాచారం. మహ్బూలలో 540 మంది భారతీయులు నివసించే కార్మిక క్యాంపులో వ్యాధి సోకిన ఒకరిని క్వారంటైన్ చేశారు. ఆ తర్వాత పరీక్షించగా మరికొంతమందిలోనూ పాజిటివ్ వచ్చింది. దీంతో వారందరినీ రెండు ప్రత్యేక ఆసుపత్రులకు తరలించారు. సరైన వీసాలు లేకుండా నివసిస్తున్న భారతీయులను గుర్తించి పరీక్షలు జరపడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది.

# 15 నుంచి విమాన టికెట్లు: ఎయిర్ ఏషియా

ముంబై, ఏప్రిల్ 4: ఈ నెల 15 నుంచి విమాన టికెట్ల బుకింగ్‌ను ప్రారంభిస్తామని ఎయిర్ ఏషియా ప్రకటించింది. అయితే, విమాన ప్రయాణాల కొనసాగింపు విషయంలో అప్పటి పరిస్థితులకనుగుణంగా డీజీసీఏ ఏవైనా నిర్ణయాలు తీసుకుంటే, ఆ సమాచారాన్ని ప్రయాణీకులకు చేరవేస్తామని చెప్పింది. ఏప్రిల్ 14 తర్వాత చేసే ప్రయాణాల కోసం ఎయిర్‌లైన్స్ సంస్థలు టికెట్ల బుకింగ్ ప్రారంభించుకోవచ్చని విమానయాన శాఖ కార్యదర్శి ప్రదీప్ సింగ్ గురువారం ప్రకటించారు. ఇప్పటికే ఇండిగో, స్పైస్‌జెట్, గోఎయిర్ సంస్థలు 15 నుంచి ప్రయాణాలు చేసే వారి కోసం డొమెస్టిక్ బుకింగ్స్ ప్రారంభించాయి. స్పైస్ జెట్, గోఎయిర్ సంస్థలు మే 1 నుంచి అంతర్జాతీయ సర్వీసుల కోసం టికెట్లు ఇస్తున్నాయి.

# ఈ పాపం చైనాదే.. నష్టాన్ని రాబట్టాలి

- యూఎన్‌హెచ్చార్సీకి న్యాయవేత్తల సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ప్రపంచవ్యాప్తంగా కరోనావైరస్ కరాళనృత్యం చేయడానికి కారణం చైనాయేనని అంతర్జాతీయ న్యాయనిపుణుల మండలి(ఐసీజే) విమర్శించింది. ఈ పాపానికి నిష్కృతి లేదని, దీనికి ఒడిగట్టినందుకు చైనా నుంచి భారీ నష్టపరిహారం రాబట్టాలని, ఆ శిక్ష అందరికీ గుణపాఠం కావాలని ఐసీజే... ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిని డిమాండ్ చేసింది. 'ఇదంతా ఓ మిస్టరీలా కనిపిస్తోంది. చైనాలో కేవలం ఒక్క రాష్ట్రంలో మాత్రమే ఇది విస్తరించింది. మిగిలిన దేశమంతా సేఫ్. కానీ ఆ వైరస్ అక్కడి నుంచి ప్రపంచదేశాలన్నింటికీ వ్యాపించింది. వేలల్లో చనిపోతున్నారు. దీనికి చైనా నాయకగణం, ఆర్మీ, వుహాన్ నగర భూమి.. అన్నింటినీ బాధ్యుల్నీ చేయాలి" అని ఐసీజే అధ్యక్షుడు అధీష్ సీ అగర్వాలా అన్నారు.

# రైళ్ల పునఃప్రారంభంపై నిర్ణయం తీసుకోలేదు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ ముగిసిన వెంటనే రైళ్ల పునఃప్రారంభానికి సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. లాక్‌డౌన్ తర్వాత 15నుంచి రైళ్లు నడుస్తాయంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో రైల్వే శాఖ శనివారం వివరణ ఇచ్చింది. ప్యాసింజర్ రైళ్ల పునఃప్రారంభానికి రైల్వే జోన్లు ఏర్పాట్లు చేస్తున్నాయంటూ వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేసింది. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. "ప్రతి రైలు సర్వీసు పునఃప్రారంభానికి రైల్వే బోర్డు నిర్దిష్టంగా అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. దశలవారీగా రైళ్ల రాకపోకలను ప్రారంభించేందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఆయా రైల్వే జోన్లు రైల్వే బోర్డుకి సమర్పించాల్సి ఉంటుంది" అని రైల్వే ఉన్నతాధికారి శనివారం చెప్పారు. రైల్వే బోర్డు చైర్మన్, ఇతర ఉన్నతాధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం జరిపిన రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని అధికారులు తెలిపారు.

# కొవిడ్ వైద్యం కోసం 500 మందికి శిక్షణ

భువనేశ్వర్, ఏప్రిల్ 4: కొవిడ్ బాధితుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రుల్లో చికిత్స అందించడానికి ఒడిసా ప్రభుత్వం 500 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు శిక్షణనిచ్చింది. దేశవ్యాప్తంగా కరోనా ఉధృతి నేపథ్యంలో వీరందరికీ ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందించారు.



# 25 సెకన్లలో వైరస్ ఖతం

- కరోనా రోగులకు చికిత్స తర్వాత వైద్యులను శుభ్రపరిచే 'ఎన్‌క్లోజర్'
- రెండు ఉపకరణాలను అభివృద్ధిచేసిన డీఆర్డీవో

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కరోనాపై ధైర్య సాహసాలతో పోరాడుతున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది కోసం రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) రెండు సరికొత్త ఆవిష్కరణలు చేసింది. ఇందులో మొదటిది పర్సనల్ శానిటైజేషన్ ఎన్‌క్లోజర్. ఇందులో ఉండే షవర్ హైపో సోడియం క్లోరైడ్ ద్రావణాన్ని విడుదల చేస్తుంది. వైద్యులు ఈ షవర్ కింద కేవలం 25 సెకన్లపాటు నిలబడితే వారి దుస్తులపై ఉండే వైరస్‌లు నశిస్తాయి. ఎన్‌క్లోజర్ యంత్రంలో 700 లీటర్ల హైపో సోడియం క్లోరైడ్‌ను నింపే వీలుంది. ఒక్క ట్యాంకు ద్రావణం 650 మంది డాక్టర్ల వ్యక్తిగత శుభ్రతకు ఉపయోగపడుతుంది. అలాగే కరోనా రోగులకు చికిత్స అందించే క్రమంలో వైద్యులు ఉపయోగించేందుకు తేలికపాటి ఫేస్ ప్రొటెక్షన్ మాస్క్‌ను డీఆర్డీవో అభివృద్ధి చేసింది. ఇప్పటికే 100 ఫేస్ ప్రొటెక్షన్ మాస్క్‌లను ఈఎస్ఐసీ హాస్పిటల్‌లకు అందించగా మరో 10,000 తయారీకి ఆర్డర్లు వచ్చాయని డీఆర్డీవో తెలిపింది.

# నేను సైతం జాతి ఐక్యతకు జ్యోతినై..

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముంగిళ్లలో, బాల్కనీల్లో ప్రమిదలు పేర్చి నూనెపోసి, వత్తులేసి దీపాలు వెలిగించి.. కరోనా వైరస్ అనే చీకటిని తరిమికొట్టే సంకల్పంలో జాతి ఐక్యంగా ఉందనేది చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధమైంది. ఆదివారం రాత్రి సరిగ్గా 9 గంటలకు ఇళ్లలో లైట్లను ఆర్పేసి.. దీపాలు, కొవ్వొత్తులు, టార్చ్‌లైట్లు, సెల్‌ఫోన్ ఫ్లాష్‌లైట్లు ఏది వీలైతే అది వెలిగించి 9 నిమిషాల పాటు ప్రభలను కొనసాగించాలన్న ప్రధాని మోదీ పిలుపును పాటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యవసర సేవలందిస్తున్నవారికి మరోసారి సంఘీభావం తెలపాలని రాష్ట్ర ప్రజలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కోరారు. ఉద్యోగ, గెజిటెట్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు ఆదివారం రాత్రి 9గంటలకు జ్యోతులు వెలిగించాలని ఉద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది.



# లైట్లు మాత్రమే ఆర్పండి

- కేంద్ర విద్యుత్తు శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం రాత్రి 9 గంటలకు ఇళ్లలో లైట్లు ఆర్పేయడం వల్ల విద్యుత్ గ్రిడ్ ఫెయిల్ అవుతుందన్న వార్తలపై కేంద్ర విద్యుత్తు శాఖ స్పందించింది. కేవలం ఇళ్లలోని లైట్లు మాత్రమే ఆఫ్ చేయాలని, అత్యుత్సాహంతో అన్నీ ఆఫ్ చేయవద్దని హెచ్చరించింది. టీవీలు, ఫ్యాన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, ఇతర గృహోపకరణాలను ఆన్‌లోనే ఉంచాలని పేర్కొంది. ప్రజా భద్రత కోసం వీధి లైట్లను ఆపకుండా చూసుకోవాలని స్థానిక సంస్థలకు సూచించింది. ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్లు, మునిసిపల్ సేవలు అందించే కార్యాలయాలతో పాటు అత్యవసర సేవల్లో ఉన్న కార్యాలయాల్లో కూడా లైట్లు ఆపకూడదని హెచ్చరించింది. కాగా ప్రధాని మోదీ చెప్పినట్లుగా ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు లైట్లు ఆర్పేస్తే పవర్‌గ్రిడ్ మీద పడే ప్రభావంపై ఆయన హామీ ఇవ్వగలరా? అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రశ్నించారు.

# దివ్వెలు వెలిగించే ముందు శానిటైజర్లు వాడొద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: శానిటైజర్లు మండే స్వభావం కలవని, కాబట్టి దివ్వెలు, కొవ్వొత్తులను వెలిగించే ముందు శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవద్దని ప్రజలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఈ మేరకు అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రజలందరూ తమ ఇళ్లలోని లైట్లను ఆఫ్ చేసి, తొమ్మిది నిమిషాల పాటు దివ్వెలు, కొవ్వొత్తులు వెలిగించాలని లేదా టార్చ్‌లైట్లు కానీ, మొబైల్ ఫోన్‌లోని టార్చ్‌లైట్లను కానీ వెలిగించాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.

# రెండు వారాల్లో 8 మందికి!

**కరోనా చైన్ రియాక్షన్ ఎలా ఉంటుందంటే?**

ముంబైకి చెందిన యువడాక్టర్ మార్చిలో లండన్‌కు వెళ్లొచ్చి తాతకు కరోనా వైరస్ అంటించారు. డాక్టర్ అయిన తండ్రికీ అంటించారు. ఆస్పత్రిలో వైద్యం చేసి మరో ఇద్దరికి అంటించారు. యువ డాక్టర్ తల్లి, నాన్నమ్మలకూ పాజిటివ్ అని తేలింది. తాత చనిపోయారు. భౌతికదూరం ప్రాముఖ్యాన్ని చెప్పే ఉదంతమిది.

**మార్చి రెండో వారం**

ముంబై డాక్టర్ బ్రిటన్ నుంచి వెనక్కి వచ్చారు.

**కరోనా పాజిటివ్: 0**

**మార్చి 23:** డాక్టర్ తాత కూడా డాక్టరే. యూరాలజిస్టు. 85 ఏళ్లు. మనుమడు విదేశాల నుంచి వచ్చాక తాతకు ఊపిరి పీల్చడం కష్టంగా మారింది. దక్షిణ ముంబైలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. సీటీ స్కాన్ తీయగా ఊపిరితిత్తుల్లో తేడా ఉందని తేలింది. కరోనా వైరస్ ఉందని అనుమానించారు. మనుమడు ఇటీవలే లండన్ నుంచి వచ్చాడని ధ్రువీకరణ కాగానే ఇద్దరికీ కరోనా వైరస్ పరీక్షలు చేశారు.

**కరోనా పాజిటివ్: 0**

**మార్చి 25:** తాతకు, మనుమడికి ఇద్దరికీ పాజిటివ్ అని తేలింది. మనుమడు బ్రిటన్‌లో కరోనా అంటించుకొని వచ్చి తాతకు తగిలించారు. మార్చి 26న తాత గుండెపోటుతో చనిపోయారు.

**కరోనా పాజిటివ్: 2**

**మార్చి 27:** యువ డాక్టర్ తండ్రి హృద్రోగ శస్త్ర చికిత్స నిపుణుడు. ఆయనకూ పాజిటివ్ వచ్చింది. హిందూజా ఆసుపత్రిలో చేర్చారు. తనయుడు విదేశాల నుంచి వచ్చాక తాను 40 మంది పేషంట్లకు సేవలందించానని తండ్రి వెల్లడించారు. అందులో ఐదుగురికి ఆపరేషన్ కూడా చేసినట్లు చెప్పారు. వారిలో 14 మందిని హైరిస్క్ గ్రూప్‌గా తేల్చి పరీక్షిస్తున్నారు.

**కరోనా పాజిటివ్: 3**

**మార్చి 28:** సీనియర్ డాక్టర్‌తో కాంటాక్టులోకి వచ్చిన 40 మంది పేషంట్లను పరీక్షించారు. ఆయన పని చేసే ఆస్పత్రి ఆపరేషన్, సర్జికల్స్ విభాగాలను మూసేశారు. కొత్త పేషంట్లను చేర్చుకోరాదన్నారు.

**కరోనా పాజిటివ్: 3**

**మార్చి 30:** హాస్పిటల్ ఉద్యోగికి పాజిటివ్ వచ్చింది

**కరోనా పాజిటివ్: 4**

**ఏప్రిల్ 1:** హృద్రోగ డాక్టర్ తల్లికి, భార్యకు పాజిటివ్ వచ్చింది. డాక్టర్ల కుటుంబం నివసించే భవనాన్ని సీల్ చేశారు.

**కరోనా పాజిటివ్: 6**

**ఏప్రిల్ 2:** హృద్రోగ నిపుణుడి క్లినిక్‌లో వాచ్‌మన్, టెక్నీషియన్లకు పాజిటివ్ వచ్చింది. వారి కుటుంబాలను క్వారంటైన్ చేశారు. క్లినిక్ ఉన్న భవనాన్ని సీల్ చేశారు.

**కరోనా పాజిటివ్: 8**

# లాక్ డౌన్.. మరో వారం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని రాష్ట్రాల్లోనూ మర్కజ్ లింకులు బయట పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో నమోదవుతున్న కొత్త కేసులన్నీ మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారు, వారి సన్నిహితులకే సోకుతున్నాయి. మరీ ముఖ్యంగా, గత మూడు నాలుగు రోజులుగా మర్కజ్‌తో సంబంధం ఉన్న కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తబ్లీగీ జమాత్ సమావేశానికి హాజరైనవారు, వారిని కలిసిన వారు కలిపి 22 వేల మందికి పైగా ఉన్నారని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లో వీరు ఉన్నారని అంచనా వేసింది. వారిలో ఇప్పటి వరకూ 1023 మందికి కరోనా పాజిటివ్ రాగా.. మిగిలిన వారంతా క్వారంటైన్‌లో, ఐసొలేషన్లో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల్లో తబ్లీగీ జమాత్‌కు సంబంధించిన వారే 30 శాతం ఉన్నారని ప్రకటించింది. ఈ నేపథ్యంలో, రాబోయే కొద్ది రోజుల్లోనే మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారికి సంబంధించి మరిన్ని పాజిటివ్ కేసులు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. నిజానికి, మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారిని గుర్తించే పనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వారందరినీ గుర్తించి, క్వారంటైన్‌లో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు కూడా జారీ చేసింది. దాంతో, వారి నుంచి ఎంత మందికి వైరస్ సోకిందనే అంశంపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు. ఈ లెక్కలన్నీ పక్కాగా తేలే వరకూ లాక్ డౌన్‌ను ఎత్తి వేసే అవకాశాలు కనిపించడం లేదు. ఇందుకు కారణాలనూ అధికారులు వివరిస్తున్నారు. గత మూడు నాలుగు రోజులుగా ప్రతిరోజూ దేశవ్యాప్తంగా 400కుపైగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో నమోదవుతున్న కొత్త కేసులన్నీ తబ్లీగీ జమాత్‌కు చెందినవే. ఇతర రాష్ట్రాల్లో నమోదవుతున్న కొత్త కేసుల్లోనూ వీటికి సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. ఇక, మరణాల్లోనూ ఇదే పరిస్థితి. తెలంగాణలో ఇప్పటి వరకూ 11 మంది మరణిస్తే.. అంతా మర్కజ్‌తో లింకు ఉన్నవారే. ఈ నేపథ్యంలోనే, రాబోయే కొద్ది రోజులపాటు కూడా మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారికి సంబంధించి పాజిటివ్ కేసులు పెరిగే అవకాశం ఉండవచ్చని కేంద్రం అంచనా వేస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అందుకే, కరోనాను పూర్తిగా నిలువరించాలంటే లాక్ డౌన్‌ను పొడిగించడం ఒక్కటే మార్గమని కేంద్రం భావిస్తోందని వివరించాయి.

# మన కరోనా భిన్నమైనదే!

- కానీ తీవ్రతలో తేడా లేదు
- రెండు నెలల్లో స్వదేశీ టెస్ట్ కిట్‌లు
- ఐసీఎంఆర్ శాస్త్రవేత్త గంగాఖేద్కర్



మన దేశంలో వ్యాప్తి చెందుతున్న కరోనా వైరస్‌కు చైనాలో ప్రబలిన వైరస్‌కు తేడాలున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. చైనాలో వ్యాపించిన వైరస్‌తో పోలిస్తే మన వద్ద ఉన్న వైరస్ బలహీనంగా ఉందని కూడా కొందరు నిపుణులు చెబుతున్నారు. ఈ విషయాలపై స్పష్టత కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) ఎపిడమాలజీ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ డివిజన్ హెడ్ డాక్టర్ గంగాఖేద్కర్‌తో ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంభాషించారు. ఆ వివరాలివి..

**ప్రశ్న: మన దేశంలో వ్యాపిస్తున్న కరోనా వైరస్ బలహీనమైనదా?**

**జవాబు:** చైనాలో మొదట వ్యాపించిన వైరస్‌కు మన దేశంలో వ్యాపిస్తున్న వైరస్‌కు మధ్య తేడాలున్నాయి. మన దేశంలో వ్యాపిస్తున్న సార్స్ కొవిడ్ వైరస్‌లో కొన్ని మార్పులు వచ్చాయి. అయితే ఈ వైరస్ వ్యాపిస్తున్న తీరులో కానీ.. ఒకసారి శరీరంలో ప్రవేశించిన తర్వాత కణాల్లో చొచ్చుకుపోతున్న వేగంలో కానీ ఎటువంటి తేడా లేదు. దీనిపై ఇప్పటికే పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఇవి పూర్తయితే కానీ ఈ విషయంలో స్పష్టత రాదు.

**ప్రశ్న: మిగిలిన దేశాల్లో వ్యాపిస్తున్న వైరస్‌తో పోల్చి చూస్తే ఈ విషయంలో స్పష్టత వస్తుంది కదా?**

**జవాబు:** మన దేశంలో జరుగుతున్న పరిశోధన ఆధారంగా చూస్తే కరోనా వైరస్‌లో మూడు భిన్నమైన సబ్‌స్పీసిస్‌లు ఉన్నాయి. అయితే ఇవన్నీ ఒకేలా వ్యాపిస్తున్నాయి. ఇతర దేశాల్లోనూ ఇదేవిధంగా ఉండొచ్చు.

**ప్రశ్న: స్వదేశీ కిట్‌లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?**

**జవాబు:** స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన కిట్‌లు ఒకటి రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో కిట్‌ల తయారీకి అనేక పరిశోధనా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

**ప్రశ్న: మన దేశంలో వచ్చే కొన్ని రోజుల్లో కేసులు పెరిగిపోయే అవకాశముందా? మిగిలిన దేశాల అనుభవాలేమి చెబుతున్నాయి?**

**జవాబు:** కేసులు పెరుగుతాయా? లేదా? అవి ఎలా పెరుగుతాయనే విషయాన్ని అంచనా వేయటం చాలా కష్టం. మన దేశం చాలా పెద్దది. భిన్నమైన భౌగోళిక ప్రాంతాలు.. జన్యు సమూహాలు.. ఉష్ణోగ్రత వ్యత్యాసాలు ఉన్నాయి. అందువల్ల వైరస్ వ్యాప్తిని కచ్చితంగా అంచనా వేయటం కూడా కష్టమే! ఇతర దేశాల్లో ఇంత వైవిధ్యం ఉండదు. అందువల్ల వారికి అంచనాలు సులభమవుతాయి. - స్పెషల్ డెస్క్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com